
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM



'బీడుబడిన భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 134

SUNDAY Special | ఆదివారం 4-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'మూడో' కన్ను చెదిరింది!

పారిస్ ఒలింపిక్స్‌లో భారత షూటర్ మనూ భాకర్‌కు త్రుటిలో మూడో పతకం చేజారింది. 25 మీ. పిస్టల్ ఈవెంట్‌లో మనూ భాకర్ నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కోల్పోయింది.

- వివరాలు 13లో



మాది ఎయిర్‌ఫోర్స్ బ్యాచ్

'ఎయిర్‌ఫోర్స్ బ్యాచ్' నుంచి ఎయిర్ బస్ దాకా... రెండు ఐదు రూపాయల కాయిన్స్ కోసం వెతికిన రోజుల నుంచి కోట్లు లెక్క పెట్టుకునే రోజుల దాకా... ఇద్దరూ విజయప్రయాణాలు చేశారు. 'ఫ్రెండ్‌షిప్ డే' ప్రత్యేకం..

- 12లో



పారిస్ ప్రయాణానికి కేంద్రం నో

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ ఫ్రాన్స్ వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని అధికార వర్గాలు తెలిపాయి.

- వివరాలు 6లో



'ఫాక్స్'లో అయితేనే డిబేట్!

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్, కమలా హారిస్ మధ్య ప్రెసిడెన్షియల్ డిబేట్ జరిగే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి.


- వివరాలు 6లో



యుద్ధమేఘాలు!

పశ్చిమాసియాపై యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. హమాస్ చీఫ్ హత్య.. ప్రతీకారం తప్పదన్న ఇరాన్ హెచ్చరికలు అగ్గి రాజేశాయి.

- వివరాలు 6లో



ఆహార మిగులు దేశంగా భారత్

భారత్ ఆహార మిగులు దేశంగా మారిందని, ప్రపంచ ఆహార భద్రతకు పరిష్కారాలను అందించేందుకు కృషి చేస్తోందని మోదీ చెప్పారు.

- వివరాలు 6లో

'కృష్ణా'లో సిరుల పంట

కృష్ణా నది పరీవాహకంలో ఈసారి 100 శాతం సాగుకు చాన్స్

నిండుకుండల్లా శ్రీశైలం, సాగర్, జూరాల జలాశయాలు



నీళ్లు నిండుగ.. పంటలకు పండుగ | నాగార్జున సాగర్ జలాశయం

- చిన్నా పెద్దా అన్ని ప్రాజెక్టులూ ఫుల్.. ముగిసిన క్రాప్ హాలిడే
- 14.5 లక్షల ఎకరాలకు 125 టీఎంసీలు సరఫరా చేసేలా ప్రణాళికలు
- గోదావరి ప్రాజెక్టుల కింద 17.95 లక్షల ఎకరాలకు 188 టీఎంసీలు
- ఎగువ గోదావరిలో ఆశించిన మేర రాని వరదలు
- దీనితో పరీవాహకంలో లోయర్ మానేరు వరకే సరఫరా
- స్కివం కమిటీ సమావేశంలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: కృష్ణా ప్రాజెక్టుల కింద ఈ ఏడాది సిరుల పంట పండనుంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కృష్ణా నది పరీవాహకంలోని చిన్నా, పెద్దా అన్ని ప్రాజెక్టుల కింద పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేసేందుకు రాష్ట్ర నీటిపారుదల శాఖ సిద్ధమైంది. కృష్ణా ప్రాజెక్టుల కింద ఉన్న 14.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు 125 టీఎంసీలు.. గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రాజెక్టుల కింద 17.95లక్షల ఎకరాల ఆయకట్టుకు 188 టీఎంసీల సాగునీటిని సరఫరా చేయాలని నిర్ణయించింది. శనివారం జలసౌధలో నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ నేతృత్వంలో రాష్ట్ర స్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (స్కివం) సమావేశమైంది. కృష్ణా, గోదావరి బేసిన్లలోని జలాశయాల్లో ప్రస్తుత నీటి లభ్యత, సమీప భవిష్యత్తులో రానున్న వరద ప్రవాహాల అంచనాపై విస్తృతంగా చర్చించింది. రాష్ట్రంలోని భారీ, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల కింద.. ప్రస్తుత ఖరీఫ్‌లో మొత్తం 33లక్షల ఎకరాలకు 314 టీఎంసీల సాగునీటిని సరఫరా చేయాలని తీర్మానించింది. ఈ ప్రతిపాదనలను త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించి ఆమోదం పొందనుంది. సమావేశంలో ఈఎన్‌సీ (ఓఅండ్‌ఎం) బి.నాగేందర్‌రావుతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చీఫ్ ఇంజనీర్లు పాల్గొని తమ పరిధిలోని ప్రాజెక్టుల పరిస్థితి, ఆయకట్టుకు సాగునీటి సరఫరా కోసం ప్రతిపాదనలు సమర్పించారు.

కృష్ణాలో ముగిసిన క్రాప్ హాలిడే..

గత ఏడాది కృష్ణా బేసిన్‌లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు నీళ్లు లేక వెలవెలబోయాయి. దీనితో గత రబీలో కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల కింద క్రాప్ హాలిడే

మిగతా 11వ పేజీలో ▶

యామిని శివైక్యం..



- వయోభారం, అనారోగ్య సమస్యలతో ఢిల్లీలో తుది శ్వాస విడిచిన నాట్య మయూరి
- నేడు ఢిల్లీ గ్రీన్‌పార్క్ శ్మశానవాటికలో అంత్యక్రియలు
- ఏపీలోని అన్నమయ్య జిల్లా మదనపల్లె యామిని జన్మస్థలం
- 2016లో పద్మ విభూషణ్ పురస్కారం..

- 11లో

నాట్యం కోసమే పుట్టాను 12లో

ఎన్నికల్లో భారీగా అవకతవకలు



- ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో 12.5 శాతం ఓట్లు పెరిగాయి
- ఈసీ ప్రకటించిన ఓట్ల లెక్కలకు, తుది ఓటింగ్ శాతానికి మధ్య భారీ తేడా
- ఈవీఎంల యుగంలోనూ ఇంత వ్యత్యాసాలా?
- ఈ ఎన్నికల ఫలితాలు సరైనవేనా? కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్

11లో



వయనాడ్ జిల్లాలో గుహలో చిక్కుకున్న చిన్నారులను రక్షించిన కేరళ అటవీ శాఖ సిబ్బంది

6 ప్రాణాలు నిలబెట్టారు

- వయనాడ్ జిల్లాలో కొండ గుహలో చిక్కుకున్న గిరిజన కుటుంబం
- 5 రోజులపాటు తిండిలేక నలుగురు చిన్నారులు, తల్లిదండ్రులు విలవిల
- ఎనిమిది గంటలపాటు శ్రమించి రక్షించిన కేరళ అటవీ శాఖ సిబ్బంది
- అసలైన హీరోలంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్న జనం

6లో

వయనాడ్ వారియర్

ఆర్మీ మేజర్ సీతా అశోక్ షెల్కేపై కథనం 12లో

నీట్ రాష్ట్ర ర్యాంకులు విడుదల



- టాపర్‌గా 711 మార్కులతో అనురాన్ ఘోష్
- తెలంగాణ విద్యార్థులకు 49,184 ర్యాంకులు
- రేపటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- స్థానికతకు 9, 10 తరగతులు.. ఇంటర్‌తో కలిపి నాలుగేళ్ల కొలమానం
- వైద్య సీట్ల భర్తీకి నోటిఫికేషన్

- వివరాలు 3లో

ఏజెన్సీ 'నాడి' పట్టేదెవరు?



- ఆస్పత్రుల్లో డాక్టర్లు లేక.. సమయానికి వైద్యం అందక.. ప్రాణాలు పోగొట్టుకుంటున్న గిరిజనులు
- చాలా ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత
- జిల్లా కేంద్రాల్లోనూ సర్జరీలు, ముఖ్యమైన చికిత్సలు అందని దుస్థితి
- ఇప్పటికే ఓవైపు డెంగీ, ఇతర విషజ్వరాల విజృంభణ

2లో



చౌటుప్పల్-సంగారెడ్డిలో ఇంటర్‌చేంజ్ కూడళ్లు!

- రీజనల్ రింగ్ రోడ్డుపై రెండు ప్రాంతాల్లో భారీ ఇంటర్ చేంజ్ కూడళ్లను నిర్మించబోతున్నారు. హైదరాబాద్–పుణె జాతీయ రహదారిని క్రాస్ చేసే సంగారెడ్డి సమీపంలోని గిర్మాపూర్ వద్ద.. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని క్రాస్ చేసే చౌటుప్పల్ వద్ద ఈ కూడళ్లు ఉంటాయి.

- వివరాలు 16లో

ఇదండీ సంగతి



అలాగే రాజకీయాల్లో కూడా బెర్తులుండేట్లు చూడండీ!



చిన్ననాటి స్నేహితులు

చెరో దారిలో నడిచారు


సిద్దారెడ్డి (ఫైల్)

దేశం కోసం సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా ఒకరు..

సమసమాజం కోసం విప్లవోద్యమంలో ఇంకొకరు..


సిద్దరాములు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: వాళ్లిద్దరూ చెడ్డీ దోస్తులు. ఒకరిని విడిచి ఒకరు ఉండలేనంత స్నేహం వారిది. ఇద్దరూ కలిసి పదో తరగతి దాకా చదువుకున్నారు. టెన్త్ పూర్తయ్యాక చెరో దారిలో నడిచారు. అది కూడా వర్గ శత్రువులుగా భావించే నక్సలిజం వైపు ఒకరు వెళ్తే, కేంద్ర పారామిలటరీ బలగాల్లోకి మరొకరు వెళ్లారు. కొన్నేళ్ల తర్వాత ఏడాది తేడాలో ఆ ఇద్దరూ అసువులు బాసారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం చిట్యాల గ్రామం పెద్ద వెంకట్‌రెడ్డి, భూమవ్వల కుమారుడైన సిద్దారెడ్డి, అదే గ్రామానికి చెందిన కంది నాగమణి, శంకరయ్య దంపతుల పెద్ద కొడుకు సిద్ధరాములు ఇద్దరూ చిన్ననాటి నుంచీ మంచి స్నేహితులు. స్కూలుకైనా, వాగులో ఈతకైనా, ఆటల్లో అయినా ఇద్దరూ ఇద్దరే. అలాంటి స్నేహితులు నూనూగు మీసాల వయసులో చెరో దారిని ఎంచుకున్నారు. సిద్దారెడ్డి అలియాస్ సిద్దన్న సమసమాజం కోసమంటూ అప్పటి పీపుల్స్‌వార్ ఉద్యమంలో చేరిపోయాడు. తర్వాత కాలంలో ఆ ప్రాంత ఆర్గనైజర్‌గా చురుగ్గా పాల్గొన్న సిద్దారెడ్డి 1998లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. సిద్దారెడ్డి స్నేహితుడు సిద్దరాములు దేశ రక్షణ తన విధిగా భావించి 1990లో సీఆర్‌పీఎఫ్ జవానుగా సెలెక్టయ్యాడు. ఆయన 1997 డిసెంబర్ 14న అస్సాంలోని కొక్రా జిల్లాలో బోడో తీవ్రవాదులు మందుపాతర పేల్చిన ఘటనలో తనువు చాలించాడు.

సిద్దారెడ్డి స్తూపం పక్కనే సిద్దరాములు విగ్రహం...

చిట్యాల గ్రామంలోకి అడుగుపెట్టగానే ప్రధాన కూడలి వద్ద రోడ్డు పక్కన స్తూపం, దాని పక్కనే విగ్రహం ఉంటాయి. గ్రామంలో సిద్దారెడ్డితో పాటు చనిపోయిన మరికొందరి పేర్లతో అమరవీరుల స్తూపం నిర్మించారు. కాగా జవాన్ సిద్దరాములు తల్లి కంది నాగమణి తన కొడుకు విగ్రహం పెట్టాలని ఎన్నో ఏళ్లుగా ప్రయత్నించి.. చివరకు ఏర్పాటు చేసి గతేడాది మార్చి 27న ఆవిష్కరింపజేసింది. ఇద్దరి విగ్రహాలు పక్కపక్కనే ఏర్పాటు చేయడం యాదృచ్ఛికంగా జరిగినా, దోస్తులూ పక్కపక్కనే ఉన్నట్టుంటుంది.



క్లుప్తంగా...

'మున్నూరుకాపు సంఘం అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఆది శ్రీనివాస్'



సాక్షి, హైదరాబాద్: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ స్థానంలో ఆయనను ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నేతృత్వంలో ఇటీవల జరిగిన సమావేశంలో తీర్మానించినట్టు అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తంరావు పటేల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం బైలాస్ ప్రకారం రాష్ట్ర మంత్రిని కౌన్సిల్ చైర్మన్‌గా ఎన్నుకోవలసి ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం విప్‌గా ఉన్నందున ఆది శ్రీనివాస్‌ను ఎన్నుకున్నామని వెల్లడించారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై ఫిర్యాదు

ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచందర్ నాయక్



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): అసెంబ్లీ వేదికగా ప్రజాప్రతినిధుల మాటలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజాపాలనకు వస్తున్న ఆదరణ చూడలేక.. కొందరు ప్రజాప్రతినిధుల మాటలను వక్రీకరించి అసభ్యంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. మంత్రుల వీడియోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియా వేదికలలో పోస్టులు పెడుతున్నారని తెలిపారు. దళిత గిరిజన ఎమ్మెల్యేలను కాలవానే వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకుంటున్నారని, ఈ తరహా అసత్య ప్రచారం చేస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ ఏసీపీని కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

అసెంబ్లీలో అసభ్యంగా మాట్లాడితే ఐదేళ్ల పాటు సస్పెండ్ చేయాలి

బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి డిమాండ్



సాక్షి, హైదరాబాద్: నోరుందని ఇష్టమొచ్చినట్టు అసెంబ్లీలో మాట్లాడిన వారిని ఐదేళ్లపాటు పోటీ చేయకుండా సస్పెండ్ చేయాలని బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. సభలో సంస్కారం లేకుండా కొందరు బూతు పురాణం మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి, విపక్ష నేత కేసీఆర్ తమ ఎమ్మెల్యేలను కంట్రోల్‌లో పెట్టాలని, అసెంబ్లీలో వారు ప్రజాసమస్యలపైనే మాట్లాడేలా చూడాలని సూచించారు. కేసీఆర్ 80 వేల పుస్తకాలు చదివితే రేవంత్ 80 వేల మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. విధ్వంసం, అప్పుల పాలైన తెలంగాణలో రూ.31 వేల కోట్ల రుణమాఫీ ఎలా జరుగుతుంది? రూ.లక్షా 50 వేల కోట్లతో మూసీ ప్రక్షాళన ఎలా అవుతుంది? అక్బరుద్దీన్ ఒవైసీకి రూ.300 కోట్లు ఇస్తామని సీఎం ఎలా చెబుతారని ప్రశ్నించారు. జీహెచ్‌ఎంసీలో వచ్చే డబ్బులు ఆ పరిధిలోనే ఖర్చుచేయాల్సి ఉండగా, కొడంగల్, మధిరలకు ఈ నిధులు ఎందుకు పోతున్నాయని కాటిపల్లి నిలదీశారు. రాజకీయ ప్రయోజనాల కోసమే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై రేవంత్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారన్నారు. అసెంబ్లీలో కిషన్‌రెడ్డి గురించి రేవంత్‌రెడ్డి మాట్లాడడం అవకాశవాదానికి నిదర్శనమని విమర్శించారు.

అక్టోబర్‌లో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల: తిరుమలలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్‌లో నిర్వహించనున్నట్లు టీటీడీ అదనపు ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శనివారం శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అక్టోబర్ 4న ధ్వజారోహణం, 8న గరుడసేవ, 9న స్వర్ణరథం, 11న రథోత్సవం, 12న చక్రస్నానం నిర్వహిస్తారని చెప్పారు. వాహన సేవలు ప్రతి రోజు ఉదయం 8 గంటలకు, సాయంత్రం7 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. గరుడ సేవ రోజున భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అందుకే అక్టోబర్ 7న రాత్రి 11 గంటల నుంచి 8వ తేదీ అర్ధరాత్రి వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలపై నిషేధం అమలు కానుందన్నారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో వయోవృద్ధులు, వికలాంగులు, ఎన్ఆర్ఐలు, చిన్న పిల్లల తల్లిదండ్రులతో సహా అన్ని ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలను టీటీడీ రద్దు చేసిందని వివరించారు.

అందితే సర్కారు వైద్యం.. లేదంటే ఆకు పసర్లే ఆధారం అన్నట్టుగా బతికే గిరిజనులు వారు.. ఏదైనా జబ్బు వస్తే దగ్గర్లోని ఆస్పత్రికి వెళ్లడానికే నానా యాతన. అక్కడ డాక్టర్ లేకుంటేనో, మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలంటేనో.. ప్రాణాల మీద ఆశలు పోయినట్టే. పట్టణాలకు వచ్చి ప్రైవేటు వైద్యం చేయించుకునే స్థోమత లేక.. దూర ప్రాంతాల్లోని పెద్దాస్పత్రులకు తరలించేలోపే ఎంతో మంది ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయి. ఇదేదో ఇప్పుడు కొత్తగా వచ్చిన సమస్య కాదు.. ఏనాడూ ఎవరూ సరిగా పట్టించుకోని సమస్య. ప్రభుత్వాలు ఆస్పత్రులు ఏర్పాటు చేయకపోవడం.. ఆస్పత్రులు కట్టినా పోస్టులు భర్తీ చేయకపోవడం.. చేసినా ఆ వైద్యులు, సిబ్బంది ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్లిపోవడం.. పరిస్థితి మళ్లీ మొదటికి రావడం.. ఇంకా ఎన్నాళ్లిలా గోసపడాలని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రౌండ్ రిపోర్ట్


భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు

ఏజెన్సీ 'నాడి' పట్టేదెవరు?

ఆస్పత్రుల్లో డాక్టర్లు లేక.. సమయానికి వైద్యం అందక.. ప్రాణాలు పోగొట్టుకుంటున్న గిరిజనులు

చాలా ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత	జిల్లా కేంద్రాల్లోనూ సర్జరీలు, ముఖ్యమైన చికిత్సలు అందని దుస్థితి	ఇప్పటికే ఓవైపు డెంగ్యూ, ఇతర విషజ్వరాల విజృంభణ	ఏజెన్సీ మంచం పట్టకముందే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తులు	అటవీ ప్రాంతాల్లో విధులపై ప్రభుత్వ వైద్యుల విముఖత	ఒకవేళ అక్కడ పోస్టింగ్ వచ్చినా.. వీలైనంత త్వరగా బదిలీ చేయించుకుంటున్న తీరు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/సాక్షి నెట్‌వర్క్: ఏజెన్సీ ప్రాంతాల్లో స్పెషాలిటీ వైద్య సేవలు అందించాల్సిన వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులు నామ్‌కేవాస్తేగా మారుతున్నాయి. పీహెచ్‌సీల నుంచి వచ్చిన రోగులకు స్పెషాలిటీ సేవలు అందించాల్సింది పోయి.. బోధనాస్పత్రులకు రిఫర్ చేసేందుకే పరిమితం అవుతున్నాయి. కాదంటే సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు దారి చూపిస్తున్నాయి. ఏజెన్సీ ఏరియాల్లో డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది కొరతే దీనికి కారణమవుతోంది. అయితే స్పెషలిస్టు వైద్యులు లేకపోవడం, వారు ఉన్నా రేడియాలజిస్టులు, మత్తుమందు నిపుణులు, స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల వంటివారు లేకపోవడంతో.. వైద్య సేవలు సరిగా అందించలేని దుస్థితి నెలకొంది.


వైద్యం అందకపోవడంతో ఓ మహిళను మరో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ప్రోత్సాహక నిర్ణయాలేవీ?

ఏజెన్సీ ఆస్పత్రుల్లో పనిచేయడానికి వైద్యులు, సిబ్బంది వెనకడుగు వేస్తున్న అంశాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రోత్సాహకాలు ఇస్తే పరిస్థితి మారుతుందని, ఏపీలో వైఎస్ జగన్ హయాంలో తీసుకున్న చర్యలు బాగున్నాయని వైద్యవర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఏపీలో కాంట్రాక్టు పద్ధతిలో స్పెషలిస్టు వైద్యుల జీతభత్యాలను రూ.2.50లక్షలకు పెంచారని, బిడ్డింగ్ నెగోషియేషన్‌కు అవకాశం కల్పించారని.. దీంతో భద్రాచలం పక్కన ఉన్న అల్లూరి జిల్లాలో గైనకాలజిస్టు ఏకంగా నెలకు రూ.3.80 లక్షల జీతం అందుకోగలుతున్నారని వివరిస్తున్నాయి.

డాక్టర్లు, సిబ్బంది బదిలీలతో..

ఏజెన్సీ ప్రాంతాలు, జిల్లా కేంద్రాలకు దూరంగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో పనిచేసేందుకు డాక్టర్లు, వైద్య సిబ్బంది ఇష్టపడటం లేదు. సౌకర్యాలు, సదుపాయాల లేమితోపాటు వేతనాల సమస్య కూడా దీనికి కారణమవుతోంది. వైద్యవిధాన పరిషత్‌లో మైదాన, గ్రామీణ, ఏజెన్సీ అన్ని ప్రాంతాల వారికి ఒకేవిధమైన జీతభత్యాలు అందుతున్నాయి. అందులోనూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 శాతం అలవెన్సులు, పాత జిల్లా కేంద్రాల్లో 17శాతం అలవెన్సులు అందితే.. ఏజెన్సీ ఏరియాల్లో 11 శాతమే వస్తాయని వైద్యులు, సిబ్బంది చెప్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తే.. అదనంగా అందాల్సిందిపోయి, తక్కువ వేతనం ఉండటం ఇబ్బందికరమని అంటున్నారు. ఈ క్రమంలోనే చాలా మంది ఏజెన్సీ ఏరియాల నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు చాలా మంది వైద్యులు, నర్సులు, ఇతర పారామెడికల్ సిబ్బంది వెళ్లిపోవడం గమనార్హం.

కొన్ని ప్రాంతాల్లో ఇదీ పరిస్థితి..


భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఓపీ వద్ద పేర్ల నమోదుకు జనం బారులు

భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో నాలుగేళ్ల కింద 13 మంది వైద్యులు సేవలందించగా.. ఏటా వేల సంఖ్యలో కాన్పులు, సర్జరీలు జరిగేవి. ఒక్కొక్కరుగా వైద్యులు ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించుకోవడంతో వైద్య సేవలు తగ్గిపోయాయి. సరిపడా గైనకాలజిస్టులు లేక కాన్పు కోసం వచ్చే గర్భిణులను ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఇక ఇక్కడ ఒక్కరే నేత్ర వైద్యుడు ఉన్నారు. వారానికి ఒక రోజును పూర్తిగా సర్జరీలకే కేటాయించినా.. వచ్చే డిసెంబర్ వరకు అపాయింట్‌మెంట్లు ఫుల్ అయ్యాయి.

- నాగర్‌కర్నూల్ జిల్లా టీజీవీవీపీ పరిధిలో నాలుగు ఆస్పత్రులు ఉన్నాయి. 107 మంది డాక్టర్లు పనిచేయాల్సిన చోట 36 మందే ఉన్నారు.
- మహబూబాబాద్ జిల్లా గార్లలో ఇటీవలి వరకు 10 మంది వైద్యులు పనిచేశారు. ఇటీవలి బదిలీల్లో తొమ్మిది మంది వెళ్లిపోగా ఒక్కరే మిగిలారు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 173 డాక్టర్ పోస్టులకుగాను 90 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ ఆస్పత్రిలో 15 మంది పనిచేయాల్సిన చోట ఐదుగురే ఉన్నారు.
- ములుగు జిల్లా ఏటూరునాగారం ఆస్పత్రిలో 17 పోస్టులకుగాను నలుగురే ఉన్నారు.
- ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఆస్పత్రిలో 33 డాక్టర్ పోస్టులుండగా 11 మందే పనిచేస్తున్నారు. ఇక్కడ గైనకాలజీ, పీడియాట్రిక్ వైద్యులు ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం.



ములుగు జిల్లా మంగపేట మండలం నర్సాపురానికి చెందిన వల్లె పోగు వినోద్‌బాబు కడుపునొప్పితో బాధపడుతూ మణుగూరు ఆస్పత్రికి వెళ్లాడు. సర్జరీ సౌకర్యం లేనందున భద్రాచలం వెళ్లాలని వైద్యులు సూచించారు. అప్పు చేసి ఆటోలో భద్రాచలం వస్తే ఇక్కడ మరో ఇబ్బంది ఎదురైంది. 'స్కానింగ్ చేసేందుకు రేడియాలజిస్టు లేడు. ఆపరేషన్‌కు సహకరించే మత్తు డాక్టర్ బదిలీ అయ్యాడు. కొత్తగూడెం వెళ్లాలంటూ వైద్యుల నుంచి సూచన వచ్చింది.




కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలం మోవాడ్‌కు చెందిన కుమురం లక్ష్మి జిల్లా కేంద్రంలోని గిరిజన డిగ్రీ కళాశాలలో ఫస్టియర్ చదువుతోంది. ఆమెకు జ్వరం రావడంతో కాలేజీ సిబ్బంది పారాసిటమాల్ మాత్రలు ఇచ్చారు. పరిస్థితి విషమించడంతో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పూర్తిస్థాయి వైద్యం అందే పరిస్థితి లేదని.. మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. లక్ష్మి అదే రోజు రాత్రి మృత్యువాత పడింది.
ఆసిఫాబాద్ మండలం మానక్‌గొందికి చెందిన మడావి రవి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఓ ఆటోడ్రైవర్ అతడిని వెంటనే ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చాడు. తలకు బలమైన గాయమవడం, చెవి నుంచి రక్తం కారుతుండటంతో వైద్యులు రవిని మంచిర్యాల ఆస్పత్రికి రెఫర్ చేశారు. కుమురం భీం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జనరల్ సర్జన్, న్యూరోసర్జన్, ఇతర స్పెషాలిటీ వైద్య నిపుణులు లేక.. ఇలాంటి సమస్యలు వస్తున్నాయి.



నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం ఎల్మపల్లికి చెందిన నిండు గర్భిణి స్వర్ణకు రాత్రి 8 గంటల సమయంలో పురిటినొప్పులు రావడంతో అమ్రాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు అందుబాటులో లేక అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తే.. ఆమెకు బీపీ ఎక్కువగా ఉందంటూ నాగర్ కర్నూల్ జనరల్ ఆస్పత్రికి పంపించారు. రాత్రి 10 గంటలకు జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి వెళ్తే.. అక్కడి డాక్టర్లు మహబూబ్‌నగర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. చివరికి మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో అర్ధరాత్రి ప్రసవం చేసినా తల్లీబిడ్డ ఇద్దరూ మరణించారు. ఆరు నెలల కింద ఈ ఘటన జరిగినా.. ఇప్పటికీ ఇక్కడి ఆస్పత్రుల్లో పరిస్థితులేవీ మారలేదు.

5 నుంచి బీజేపీ రైతు రచ్చబండ

రైతులందరికీ రుణమాఫీ చేస్తున్నట్లుగా గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ సర్కార్: కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రైతులందరికీ రుణమాఫీ చేస్తున్నట్లుగా రేవంత్ సర్కార్ ప్రగల్భాలు పలుకుతోందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎలాంటి ఆంక్షలు లేకుండా రెండు లక్షల లోపు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం మాటతప్పిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో మోసపోయిన బాధిత రైతులకు అండగా నిలిచేందుకు ఆగస్టు 5 నుంచి బీజేపీ రైతు రచ్చబండ పేరుతో గ్రామాల వారీగా బాధిత రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తామని తెలిపారు. రుణమాఫీ కానీ రైతుల పక్షాన ఉద్యమించడానికి వారి వివరాలను కిసాన్ మోర్చా సహచరులతో కలిసి పార్టీ హెల్ప్ లైన్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. రుణమాఫీ జీవోలో పేర్కొన్న ఆంక్షలు కారణంగా 30% రైతులకు మాత్రమే రుణమాఫీ అమలయ్యే పరిస్థితి తలెత్తిందని చెప్పారు. కిసాన్ మోర్చా నేతలు గోలి మధుసూదన్ రెడ్డి, పడమటి జగన్మోహన్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, జాడి రామరాజు, అనురాధ, ఏలూరు నాగేశ్వరరావు హెల్ప్ లైన్ ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.


అమెరికాకు సీఎం రేవంత్‌రెడ్డి

నేడు ప్రవాస తెలంగాణవాసులతో సమావేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో భాగంగా సీఎం ఎ.రేవంత్‌రెడ్డి శనివారం ఉదయం అమెరికా పర్యటనకు వెళ్లారు. పరిశ్రమలు, ఐటీ శాఖమంత్రి డి.శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ కూడా ఆయనతో వెళ్లినవారిలో ఉన్నారు. శనివారం ఉదయం 4.35గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయల్దేరి అమెరికన్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.30 గంటలకు న్యూయార్క్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆదివారం న్యూజెర్సీలో జరిగే ప్రవాస తెలంగాణవాసులతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. 11న అమెరికా నుంచి బయల్దేరి దక్షిణ కొరియా రాజధాని సియోల్‌కు చేరుకోనున్నారు. అక్కడ వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలతో సమావేశాలు నిర్వహిస్తారు. 14న ఉదయం 10.50 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటారు.

అథమస్థాయికి అసెంబ్లీ

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీని కాంగ్రెస్ శాసన సభ్యులు అథమ స్థాయికి తీసుకెళ్లారని, ఏడు నెలల పాలనలోనే రేవంత్ రెడ్డి వికృత చేష్టలు బయటపడ్డాయని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ఆయన శనివారం పార్టీ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కోవా లక్ష్మితో కలిసి అసెంబ్లీలోని బీఆర్‌ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శాసనసభలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అబద్ధాలకు అంతేలేదన్నారు. నామమాత్రంగా ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ ఎత్తేయడం, పద్దులపై మొక్కుబడి చర్చ, అసంపూర్తి చర్చతో ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం, విపక్షాల గొంతు నొక్కడం ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో జరిగాయన్నారు. బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలు, కాంగ్రెస్ హామీల ఊసే లేదని, దీనిపై నిలదీస్తే మార్షల్స్‌తో గెంటివేయించారన్నారు. విద్యుత్ లేకపోతే ఏమవుతుందని ఒకరు లంచాలు తీసుకుంటే ఏమవుతుందని మరొకరు, ఆసరా పింఛన్ ఆలస్యమైతే ఏమవుతుందని ఇంకొకరు.. ఇలా కాంగ్రెస్ సభ్యులు ఇష్టారీతిన ప్రసంగాలు చేశారన్నారు. అసెంబ్లీలో ప్రభు త్వం ప్రకటించిన జాబ్ కేలండర్‌పై తాము చర్చను కోరితే.. ఎమ్మె ల్యే దానం నాగేందర్‌తో తిట్టించారని కౌశిక్‌రెడ్డి విమర్శించారు. తాను హైదరాబాద్‌లోనే ఉన్నానని.. దానం నాగేందర్‌కు దమ్ముంటే రావాలని సవాల్ చేశారు.

రైతులకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


పాలేరు పాత కాల్వకు సాగునీరు విడుదల చేస్తున్న మంత్రి పొంగులేటి. పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తదితరులు

కూసుమంచి: ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిన తర్వాతే రాష్ట్రంలో మంచి వర్షాలు పడుతున్నాయని, ప్రజల దీవెనలతో పాటు దేవతలు సైతం ప్రభుత్వాన్ని దీవించారని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు పాతకాల్వతో పాటు ఎర్రగడ్డతండా వద్ద భక్తరామదాసు ప్రాజెక్ట్ ద్వారా పాలేరు రిజర్వాయర్ నుంచి ఆయన శనివారం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో జూలై చివరలోనే సాగర్‌కు నీరు వచ్చిన దాఖలాలు లేవన్నారు. కానీ ఈసారి శ్రీశైలం నిండి.. సాగర్ ప్రాజెక్టుకూ నీరు చేరిందని తెలిపారు. రైతులకు మేలు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఈ నేపథ్యంలో రూ.31 వేల కోట్లు రుణమాఫీ చేశామని చెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంపై రూ.లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోపినా తాము రోజుకు 15, 17 గంటలు కష్టపడుతూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణిని ప్రవేశపెట్టి రైతులను గోస పెట్టిందని పొంగులేటి ఆరోపించారు.

రాహుల్‌ను నిలదీస్తాం: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని యువతను నమ్మించి మోసం చేసిన రాహుల్ గాంధీని.. అవసరమైతే ఢిల్లీకి వచ్చి నిలదీస్తామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హెచ్చరించారు. బూతులు తిట్టినా, అవమానించినా కాంగ్రెస్‌ను ప్రశ్నిస్తూ, నిలదీస్తూనే ఉంటామని, తమకు పోరాటం కొత్తకాదని కేటీ రామారావు 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. గత ఏడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అశోక్‌నగర్‌కు వచ్చిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ట్వీట్‌ను కేటీఆర్ గుర్తు చేశారు. 'మీరు ఇచ్చిన ఏడాదిలోపు రెండు లక్షల ఉద్యోగాల ప్రకటనను నమ్మి యువత కాంగ్రెస్‌కు ఓటు వేసింది. ఎనిమిది నెలలు గడుస్తున్నా ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా, ఉద్యోగాలు లేని కేలండర్‌ను జారీ చేశారు. మళ్లీ హైదరాబాద్ అశోక్‌నగర్‌కు వచ్చి మీ హామీని ఎలా నెరవేరుస్తారో యువతకు చెప్పండి'.. అని కేటీఆర్ పోస్టు చేశారు. జీవో 46ను రద్దు చేయాలంటూ దీక్ష చేస్తూ అరెస్టయి బండ్లగూడ పోలీసు స్టేషన్‌లో ఉన్న 70 మంది యువతతో కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. '30 గంటలుగా దీక్ష చేస్తూ మీరు గొప్ప పోరాట స్ఫూర్తిని చూపుతున్నారు. కానీ మీ ఆరోగ్యం కూడా ముఖ్యం కాబట్టి దీక్ష విరమించండి. మీ పోరాటానికి మా మద్దతు ఉంటుంది. అవసరమైతే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలందరినీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వద్దకు తీసుకెళ్లి మీ సమస్య పరిష్కారం కోసం మాట్లాడుతాం'.. అని భరోసానిచ్చారు.

మిడ్‌మానేరు నుంచి నీటిని పంపింగ్ చేయండి

మంత్రి ఉత్తమ్‌కు హరీశ్‌రావు లేఖ



సాక్షి, హైదరాబాద్: రాజకీయాలను పక్కనబెట్టి సిద్దిపేట జిల్లాలోని ప్రాజెక్టులకు మిడ్‌మానేరు నుంచి నీటిని పంప్ చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆయన మంత్రికి బహిరంగలేఖ రాశారు. సిద్దిపేట జిల్లాలోని అన్నపూర్ణ (అంతగిరి) రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్‌లు నీళ్ల లేక పూర్తిగా అడుగంటిపోయే పరిస్థితికి చేరుకున్నాయని తెలిపారు. గత సంవత్సరం ఇదే ఆగస్టు నెలలో అనంతగిరి రిజర్వాయర్‌లో 3.32 టీఎంసీల నీళ్లు ఉంటే ప్రస్తుతం 0.75 టీఎంసీలు, రంగనాయకసాగర్‌లో 2.38 టీఎంసీలకు ప్రస్తుతం 0.67 టీఎంసీలు, మల్లన్నసాగర్‌లో 18 టీఎంసీలకు ప్రస్తుతం 8.5 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్ 10 టీఎంసీలకు గాను ప్రస్తుతం 4.5 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు రిజర్వాయర్లలో నీళ్ల లేక, మరోవైపు వర్షాలు కురవక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, పంటలు వేయాలా వద్దా అనే అయోమయంతో ఆవేదన చెందుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ఆయా రిజర్వాయర్లకు నీటిని పంపింగ్ చేసేలా ఇరిగేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అదేవిధంగా కాలువల ద్వారా నీటిని విడుదల చేసి ఆయకట్టుకు నీళ్లందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకే అలా మాట్లాడాను: దానం



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): సీఎం రేవంత్‌రెడ్డితో పాటు తనపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకే అసెంబ్లీలో తాను ఆ విధంగా మాట్లాడాల్సి వచ్చిందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శుక్రవారం అసెంబ్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. శనివారం ఆదర్శ్‌నగర్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హిమాయత్‌నగర్ డివిజన్‌కి చెందిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్‌లతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం దానం మాట్లాడుతూ, అసెంబ్లీలో బీఆర్‌ఎస్ నేతలు తనను టార్గెట్ చేశారని, హైదరాబాద్ అభివృద్ధిపై తనకు మాట్లాడేందుకు అవకాశం వచ్చినప్పుడు వారు ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నారని తెలిపారు. తాను మాట్లాడేది మైక్‌లో వినిపించిందని, వారు సీఎం రేవంత్‌రెడ్డిని చీప్ మినిస్టర్ అంటూ వ్యంగ్యంగా, కించపరిచే విధంగా మాట్లాడారని అందుకే ఆ సమయంలో సహనం కోల్పోయి ఆ విధంగా మాట్లాడానని చెప్పారు. అయితే తాను మాట్లాడిన వ్యాఖ్యలు హైదరాబాద్ వాడుక భాషనే అని దానం సమర్థించుకున్నారు. ఒకవేళ తన వ్యాఖ్యలు ఎవరినైనా బాధ కలిగిస్తే క్షమాపణ చెప్తున్నానన్నారు. గత పదేళ్లుగా ఏనాడూ తన లాంటి వారికి అసెంబ్లీలో మాట్లాడే అవకాశం రాలేదని దానం పేర్కొన్నారు.



స్నేహమే నన్ను ఈ స్థాయిలో నిలిపింది

- నా ఇద్దరు ప్రాణమిత్రులు 36 ఏళ్లుగా ప్రతి కష్టం, సుఖంలో ఉన్నారు
- స్నేహితుడు వెంట ఉంటే గొప్ప ధైర్యం ఉన్నట్టే: డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: మంచి స్నేహితుల సాన్నిహిత్యం దొరికితే జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఛేదించవచ్చని.. జీవితాన్ని ఉత్తమంగా ఆస్వాదించవచ్చని చెప్పారు డీజీపీ జితేందర్. తాను ఈ స్థాయికి ఎదగడంలో తన స్నేహితుల సలహాలు, సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయని గుర్తు చేసుకున్నారాయన. 36 ఏళ్ల తమ స్నేహ జీవితంలో ఎన్నో సందర్భాలు చూశామని, ఆ మధురస్మృతులను స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి'తో పంచుకున్నారు డీజీపీ జితేందర్... ఆ విషయాలు ఆయన మాటల్లోనే...

''నాకు బెస్ట్ ఫ్రెండ్స్ ఇద్దరు. ఒకరు ప్రస్తుతం జార్ఖండ్‌లో ఐఏఎస్‌గా పనిచేస్తున్న డా.ఏపీ సింగ్, మరొకరు కేంద్ర ప్రభుత్వ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న డా.రాజీవ్ వర్ష్నై. మేం ముగ్గురం ఢిల్లీ జేఎన్‌యూలో స్కూల్ లైఫ్ సైన్స్‌లో ఎంఫిల్ చేశాం. ఐదేళ్లపాటు ఒకే దగ్గర కలిసి ఉన్నాం.. మా జీవితాలను మలుపు తిప్పింది ఆ ఐదేళ్లే. యూపీఎస్సీకి బీజం పడింది అక్కడే.. నేను ఈ రోజు డీజీపీగా ఉన్నానంటే అందుకు ఆ స్నేహమే కారణం. నేను ఐపీఎస్, ఏపీ సింగ్ ఐఏఎస్, రాజీవ్ సైంటిస్ట్‌లుగా కెరీర్ మలచుకున్నాం. 36 ఏళ్లుగా మా స్నేహం కొనసాగుతూనే ఉంది.. నా ప్రతి కష్టంలో, సంతోషంలో ప్రాణ మిత్రులిద్దరూ నాతో ఉన్నారు. మేం ఎప్పుడు కలిసినా కుటుంబాలతో సహా కలుస్తాం. ప్రతి రెండు, మూడేళ్లకు ఒకసారి తప్పకుండా మా ఫ్యామిలీస్ గెట్ టు గెదర్ ఉంటుంది. స్నేహం గురించి చెప్పాలంటే ఏదో ఆశించి చేసే స్నేహం ఎప్పటికీ నిలవదు. ఫ్రెండ్‌షిప్ అనేది ఒక ఎమోషనల్ ఫీలింగ్..ఒక సెక్యూరిటీ..మంచి స్నేహితులున్న వారు జీవితంలో ఉన్నతంగా ఉంటారు. ఉత్తమ జీవితం గడుపుతారు. అందుకు నేను ఉదాహరణ. ప్రతి ఒక్కరి జీవితంలో బెస్ట్ ఫ్రెండ్ చాలా ముఖ్యం. మంచి స్నేహితుడు ఉంటే ఏ ఒత్తిడీ మన దరి చేరదు. అందుకే యువతకు నేను చెప్పేది ఒక్కటే. మంచి స్నేహితులను సంపాదించుకోండి.. జీవితాన్ని ఫలవంతంగా..ఆనందంగా గడపండి''అని డీజీపీ జితేందర్ తెలిపారు.


నాడు

డీజీపీ జితేందర్, ఏపీ సింగ్, రాజీవ్


నేడు

క్లుప్తంగా...

కొమ్మినేనికి 'ఎన్టీఆర్ జర్నలిస్టు-2024' అవార్డు

నేడు రవీంద్రభారతిలో ప్రదానం



లక్డీకాపూల్ (హైదరాబాద్): ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్టీఆర్ జర్నలిస్ట్ అవార్డు-2024కు సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావును ఎంపిక చేసినట్టు ట్రస్ట్ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి తెలిపారు. ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా ఈ నెల 4న అవార్డును ప్రదానం చేయనున్నట్టు చెప్పారు. రవీంద్రభారతిలో జరగనున్న ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, సాక్షి మీడియా గ్రూప్ ఎడిటర్ వర్ధెల్లి మురళి, సీనియర్ పాత్రికేయుడు దేవులపల్లి అమర్, పాత్రికేయుడు పాశం యాదగిరి ముఖ్య అతిథులుగా, ప్రముఖ విశ్లేషకులు ప్రసాద్, సీతాస్ ట్రస్టు డైరెక్టర్ రాణి ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారని లక్ష్మీపార్వతి తెలిపారు.

బీఏ యానిమేషన్, వీఎఫ్ఎక్స్ ప్రవేశాలకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోని ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో బీఏ(యానిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్) కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 17వ తేదీలోగా సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు సమర్పించాలని, వివరాలకు 9032644463, 9063242329 ఫోన్లో సంప్రదించాలని సూచించారు.

జీఓ 317 వినతులపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ

సాక్షి, హైదరాబాద్: నూతన జోనల్ విధానంలో భాగంగా ఉద్యోగుల కేటాయింపులకు సంబంధించి తెచ్చిన జీఓ 317 అమలుపై ఉద్యోగుల నుంచి వచ్చిన వినతులను న్యాయ నిపుణుల సలహా తీసుకున్న తర్వాతే తుది నివేదిక తయారు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. సచివాలయంలో జీఓ 317పై ఏర్పాటైన శనివారం మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో పాటు పలు విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జీఓ 317 అభ్యంతరాలకు సంబంధించిన వినతులపై ఇప్పటికే రాష్ట్ర సాధారణ పరిపాలన విభాగం నుంచి రెండు రకాల ప్రతిపాదనలను కమిటీ స్వీకరించింది. వీటిని రాష్ట్ర అడ్వొకేట్ జనరల్‌తో సంప్రదించి చర్చించి ఓ అంచనాకు రావాలని మంత్రివర్గ ఉపసంఘం భావిస్తోంది. అతి త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదించేందుకు మంత్రివర్గ ఉపసంఘం చర్యలు వేగవంతం చేసింది.

నీట్ రాష్ట్ర ర్యాంకులు విడుదల

వైద్య సీట్ల భర్తీకి నోటిఫికేషన్



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం శనివారం షెడ్యూల్ విడుదల చేసింది. రాష్ట్రం నుంచి నీట్ రాసిన విద్యార్థుల ప్రాథమిక ర్యాంకుల జాబితాను కూడా విడుదల చేసింది. తెలంగాణ టాపర్‌గా అనురాన్ ఘోష్ నిలిచాడు. అతనికి నీట్‌లో 711 మార్కులు వచ్చాయి. రాష్ట్ర సెకండ్ టాపర్‌గా సుహాస్ నిలిచాడు. తెలంగాణ నుంచి ఈసారి 49,184 మంది నీట్‌లో అర్హత పొందారు. వారికొచ్చిన మార్కులు, ఆలిండియా ర్యాంకులను జాబితాలో పొందుపర్చారు. ఈ జాబితాలో ఉన్న విద్యార్థులు కన్వీనర్ కోటాలో ప్రవేశాల కోసం ఈ నెల 4న ఉదయం 6 గంటల నుంచి ఈ నెల 13న సాయంత్రం 6 గంటల వరకూ వర్సిటీ వెబ్‌సైట్‌లో (https://tsmedadm.tsche.in) దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ సూచించింది. విద్యార్హత, స్థానికత, కమ్యూనిటీ తదితర సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలని సూచించింది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం మెరిట్ లిస్ట్ (స్టేట్ ర్యాంక్స్)ను విడుదల చేస్తామని తెలిపింది. ఆ తర్వాత వెబ్ ఆప్షన్లు తీసుకుంటామని, కాలేజీలు, సీట్ల వివరాలను వెబ్ ఆప్షన్లకు ముందు వెల్లడిస్తామని పేర్కొంది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏపీకి, తెలంగాణకు ఉన్న 15 శాతం అన్ రిజర్వ్‌డ్ కోటాను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు అడ్మిషన్ నిబంధనల్లో మార్పు చేస్తూ ప్రభుత్వం గత నెలలో జీవోను విడుదల చేసింది. ఈ జీవో ప్రకారమే సీట్ల భర్తీ చేపడుతామని నోటిఫికేషన్‌లో యూనివర్సిటీ పేర్కొంది. ఈ జీవో ప్రకారం రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని 85 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. ఇంకో 15 శాతం సీట్లను ఆలిండియా కోటాలో భర్తీ చేస్తారు. ఇక ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని 50 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో, ఇంకో 50 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీ చేయనున్నారు. గతంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని 15 శాతం సీట్లను ఓపెన్‌లో పెట్టి, వాటిని తెలంగాణ, ఏపీ విద్యార్థుల్లో ఎవరికి మెరిట్ ఉంటే వారికి కేటాయించేవారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు కావడంతో ఈ కోటాను (అన్ రిజర్వ్‌డ్) ప్రభుత్వం రద్దు చేసింది.

వరుసగా నాలుగేళ్లు చదవాల్సిందే...

స్థానికతను గుర్తించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో 6వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు అంటే ఏడేళ్లలో నాలుగేళ్లు తెలంగాణలో చదివితే స్థానికత ఉన్నట్లుగా గుర్తించేవారు. ఈసారి ఆ నిబంధనలో మార్పు చేశారు. 9వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు వరుసగా 4 ఏళ్లు తెలంగాణలో చదివిన వాళ్లనే తెలంగాణ స్థానికులుగా గుర్తిస్తామని పేర్కొన్నారు. 9వ తరగతి కంటే ముందు ఎక్కడ చదివారనే దాంతో సంబంధం లేదని స్పష్టం చేశారు. దీనివల్ల స్థానికతకు కచ్చితత్వం ఉంటుందని అంటున్నారు.

ఎంబీబీఎస్ సీట్లు 8,690

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో మొత్తం 8,690 సీట్లు ఉండగా వాటిల్లో 31 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 3,990 సీట్లున్నాయి. అలాగే 29 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 4,700 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. మరో నాలుగు ప్రభుత్వ మెడికల్ కాలేజీల అనుమతి కోసం ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. కౌన్సెలింగ్ పూర్తయ్యేలోగా అవి వస్తే మరో 200 ఎంబీబీఎస్ సీట్లు ప్రభుత్వ కాలేజీల్లో అందుబాటులోకి రానున్నాయి.

రాష్ట్రస్థాయి టాప్-10 నీట్ ర్యాంకర్లు

ర్యాంకు	పేరు
1	అనురాన్ ఘోష్
2	పడాల సుహాస్
3	వేముల స్నేహ స్వర్ణిమ
4	గుగులోత్ వెంకట నృపేష్
5	కోసూరి సాయి లిఖిత్
6	వై. శ్రీకాంత్‌రెడ్డి
7	వేదాంత్ అప్లుతె
8	ఎల్.సాయి ప్రణవ్
9	వెంకట సూర్యతేజ గూడూరి
10	కె.లిఖేశ్‌రెడ్డి

టీజీ సెట్-2024 పరీక్ష వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ సెట్ పరీక్షను వాయిదా వేశారు. యూజీసీ నెట్ పరీక్ష కారణంగా 28, 29, 30, 31 తేదీలలో జరగాల్సిన టీజీ సెట్ పరీక్షను వచ్చే నెల 10, 11, 12, 13 తేదీలలో నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దరఖాస్తులో తప్పులు, మార్పులు చేర్పులకు ఈ నెల 23, 24 తేదీల్లో ఎడిట్ ఆప్షన్స్ ఇచ్చారు. వచ్చేనెల 2 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రభుత్వ గోదాములన్నీ నిండుగా ఉండాలి: తుమ్మల

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ గోదాములు ఖాళీగా ఉంటే.. ప్రైవేటు గోదాములు అన్నీ నిండుగా ఉంటున్నాయంటే లోపం ఎక్కడుందో గమనించాలని, వాటిని వినియోగంలోకి ఎలా తీసుకురావాలో ప్రతిపాదనలు తయారు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. ప్రభుత్వ గోదాములన్నీ 100 శాతం నిండుగా ఉండాలని, వివిధ సంస్థల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రాష్ట్రంలో వరి విత్తనాల ఉత్పత్తితో పాటు మిగతా పంటల ఉత్పత్తిని పెంచాలని, కొత్త ఆలోచనలతో ముందుకు రావాలని ఆయన అధికారులకు సూచించారు. శనివారం వ్యవసాయ, కోఆపరేటివ్, మార్కెటింగ్, జౌళి శాఖ, అనుబంధ కార్పొరేషన్ల చైర్మన్లతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులుకు మేలు జరిగే ఏ నిర్ణయాలకైనా ప్రభుత్వం ఆమోదం ఇస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ పంట విస్తీర్ణం పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలని, నర్సరీలలో నాణ్యమైన మొక్కలు పెంచాలని సూచించారు. కాగా, ఖమ్మం మార్కెట్‌ను దేశంలోనే అగ్రగామి మార్కెట్‌గా తీర్చిదిద్దడానికి ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

రూ.16 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యం

సీఎం రేవంత్ అమెరికా, దక్షిణ కొరియా పర్యటనపై మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి రూ.16 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం అమెరికా, దక్షిణ కొరియాలలో పర్యటనకు బయలుదేరినట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ పర్యటన నేపథ్యంలో మంత్రి శనివారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియా ప్రతినిధులతోనూ మాట్లాడారు. ఐటీ, ఆరోగ్య రక్షణ, లైఫ్‌సైన్సెస్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాల్లో పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఈ పర్యటన కొనసాగుతుందన్నారు. ఐటీ వృద్ధిరేటును 11.28 నుంచి 25 శాతానికి తీసుకెళ్లే రోడ్ మ్యాప్ సిద్ధమైందన్నారు. అమెరికా, దక్షిణ కొరియా దేశాల పర్యటనలో చేసుకునే ఒప్పందాలు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ప్రోత్సాహాన్ని అందిస్తాయన్నారు. నూతన ఆవిష్కరణలు, పెట్టుబడుల రాకతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థగా పటిష్టమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటన ద్వారా అమెరికా, దక్షిణ కొరియాలతో ఇప్పటికే ఉన్న భాగస్వామ్యాలు మరింత బలోపేతం కావడంతో పాటు కొత్త సంస్థలు తెలంగాణతో కలసి పనిచేసేందుకు ముందుకు వస్తాయన్నారు. తద్వారా రాష్ట్రంలో వేలాది నూతన ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందని చెప్పారు. అమెరికా, దక్షిణ కొరియా దేశాలతో రాష్ట్ర ప్రభుత్వం గడిచిన ఆరు నెలలుగా కుదుర్చుకున్న ఒప్పందాలను ప్రస్తుత పర్యటనలో అధికారికంగా ప్రకటిస్తారని శ్రీధర్‌బాబు వెల్లడించారు. కృత్రిమమేధలో యావత్తు ప్రపంచం తెలంగాణ వైపు చూసేలా తాము భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించినట్టు శ్రీధర్‌బాబు చెప్పారు. కాగా శ్రీధర్‌బాబు సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో జరగనున్న ఏఐ గ్లోబల్ సమిట్‌ను పురస్కరించుకొని వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.

యూఎస్‌లో ఉన్నత విద్యకు నలుగురు విద్యార్థుల ఎంపిక

- వారికి అయ్యే ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయశాఖలో నలుగురు ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత విద్య కోసం అమెరికాలో చదువుకునేందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ, కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీల నుంచి వరంగల్ జిల్లాకు పర్వతగిరి మండలం గోపనపల్లికి చెందిన ప్రవల్లిక, కరీంనగర్ జిల్లా వీణవంక మండలం, మామిడాలపల్లి గ్రామానికి చెందిన పావని, హైదరాబాద్‌కు చెందిన గోలి ఐశ్వర్య, నిధా బేగంలు డిగ్రీ పూర్తి చేశారు. వీరు అమెరికాలోని అలబామా రాష్ట్రంలోని ఆబర్న్ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు దరఖాస్తు చేసుకున్నారు. శనివారం ఈ నలుగురు విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలసి తెలంగాణ సచివాలయంలో మంత్రి తుమ్మలను కలిశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. ఒక్కో విద్యార్థికి రెండేళ్లకు రూ.55.50 లక్షల చొప్పున మొత్తం నలుగురు విద్యార్థులకు రూ.2.22 కోట్లు విడుదల చేశామన్నారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులు, ఆయా రంగాల్లో ప్రతిభ చూపుతున్నవారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను మంత్రి అభినందించారు.

3 నెలల్లో ఎల్ఆర్ఎస్ పూర్తి కావాలి

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి ఆదేశం

- వేగంగా ప్రక్రియ చేపట్టాలి.. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలి
- నిబంధనల ప్రకారమే క్రమబద్ధీకరణ.. అక్రమాలకు తావు ఇవ్వొద్దు
- ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లొద్దు
- ప్రజల సందేహాలను తీర్చేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సూచన
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ నుంచి సమీక్షించిన మంత్రి
- ఖమ్మం నుంచి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్/ భూపాలపల్లి/ సాక్షిప్రతినిధి, ఖమ్మం: లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) ప్రక్రియను వేగవంతం చేయాలని.. మూడు నెలల వ్యవధిలో పూర్తి చేయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో భాగంగా ఎలాంటి అక్రమాలకు తావు ఇవ్వొద్దని, నిబంధనల ప్రకారం మాత్రమే క్రమబద్ధీకరణ జరగాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా చూడాలన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి అక్కడి కలెక్టరేట్ నుంచి మున్సిపల్, రెవెన్యూ శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధనశాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఈ సమీక్షలో పాల్గొన్నారు.

ప్రత్యేక బృందాలతో ప్రక్రియ

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో దళారుల ప్రమేయం లేకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ''పెండింగ్‌లో ఉన్న 25.70 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రజలు నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఎల్ఆర్ఎస్ కోసం జిల్లాల్లో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకోవాలి. సిబ్బంది కొరత ఉన్నచోట ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలి. ప్రతిపాదనలు పంపితే రెవెన్యూ శాఖ నుంచి కూడా సర్దుబాటు చేస్తాం. రెవెన్యూ, సాగునీరు, మున్సిపల్ అధికారులతో కూడిన బృందాలను ఏర్పాటు చేయాలి. ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై ప్రజల సందేహాలను నివృత్తి చేసేందుకు అన్ని జిల్లాల కలెక్టరేట్లు, స్థానిక సంస్థల కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసుకోవాలి. ఈ ప్రక్రియలో పాలుపంచుకునే అధికారులు, సిబ్బందికి తక్షణమే శిక్షణ ఇవ్వాలి. ప్రభుత్వ విధివిధానాలకు అనుగుణంగా అవసరమైన కార్యాచరణ చేపట్టాలి..''అని మంత్రి ఆదేశించారు. హెచ్ఎండీఏ పరిధిలోని ఏడు జిల్లాల్లో అత్యంత విలువైన భూములున్న నేపథ్యంలో ఆయా జిల్లాల్లో క్రమబద్ధీకరణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పొంగులేటి సూచించారు.

ప్రజలకు ఇబ్బంది కలగొద్దు: డిప్యూటీ సీఎం భట్టి

ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో భాగంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. దరఖాస్తుల స్క్రూటినీ సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సహకారం ప్రభుత్వం నుంచి ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ భూమికి నష్టం కలగవద్దని.. నీటి వనరులు, కాలువలు, చెరువుల ఆక్రమణలకు పాల్పడకుండా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.



విశ్వసించువాడే
నిత్యజీవము గలవాడు.
- క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం: దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; **తిథి:** అమావాస్య ప.3.54 వరకు, తదుపరి శ్రావణ శుక్ల పాడ్యమి; **నక్షత్రం:** పుష్యమి ప.1.49 వరకు, తదుపరి ఆశ్లేష; **వర్జ్యం:** తె.3.25 నుండి 5.07 వరకు (తెల్లవారితే సోమవారం); **దుర్ముహూర్తం:** సా.4.48 నుండి 5.39 వరకు; **అమృత ఘడియలు:** ఉ.7.11 నుండి 9.04 వరకు

సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం : 6.29
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

సిద్ధరామయ్య (కర్ణాటక సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"మీ మీద ఎందుకు విచారణకు ఆదేశించకూడదో వారం లోగా సమాధానం ఇవ్వండి" అంటూ గవర్నర్ థావర్ చంద్ గెహ్లోత్ నాకు పంపిన నోటీసు గడువు ఆగస్టు 1 కి ముగిసింది. ఆ వెంటనే మంత్రులందర్నీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌కి పిలిపించి, "ఏం చేద్దాం శివ కుమార్?" అని అడిగాను.

శివ కుమార్ నా డిప్యూటీ.

"ఇందులో మీరు చేయవలసిందేం లేదు సీఎం గారూ! స్థిమితంగా బ్రేక్‌ఫాస్ట్ చేయండి చాలు" అన్నారు శివ కుమార్ నవ్వుతూ.

నేను నవ్వే మూడ్‌లో లేను.

224 సీట్ల అసెంబ్లీలో 66 సీట్లు మాత్రమే ఉన్న బీజేపీ, 18 సీట్లున్న జేడీఎస్‌ను కలుపుకొని 134 సీట్లున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చటానికి గవర్నర్ ఆ నోటీసును పంపినట్లు ఉంది కానీ, ల్యాండ్ ఎలాట్‌మెంట్‌లో నాపై వచ్చిన ఆరోపణలకు పంపిన నోటీసులా లేదు!

"ఒకటి గమనించారా! ల్యాండ్ ఎలాట్‌మెంట్ కేసులో మీపై గవర్నర్‌కు ఫిర్యాదు వెళ్లిన



రోజు జూలై 26. ఆ ఫిర్యాదుపై మనం గవర్నర్‌కు వివరణ ఇచ్చిన రోజు జూలై 26. గవర్నర్ మీకు నోటీసు పంపింది కూడా జూలై 26నే. అన్నీ ఒకే రోజు జరిగిపోయాయి. అంటే అర్థం... మనం ఇచ్చిన వివరణను చదవకుండానే, కనీసం చూడకుండానే గవర్నర్ మీకు నోటీసులు పంపారని!!" అన్నారు శివ కుమార్.

"మన వివరణనే కాదు, మన సీఎం గారిపై వెళ్లిన ఫిర్యాదును కూడా గవర్నర్ చదివి ఉండరని నాకు అనిపిస్తోంది..." అన్నారు ఏఎస్ పొన్నన్న, విరాజ్‌పేట ఎమ్మెల్యే అతడు. నా లీగల్ అడ్వైజర్ కూడా!

మంత్రులంతా పొన్నన్న వైపు చూశారు.

పొన్నన్న తన బ్యాగులో ఉన్న ఫిర్యాదు కాపీని బయటికి తీశారు.

"చూడండి, ఇందులో మొత్తం 60 పేజీలు ఉన్నాయి. పేజీలన్నీ శ్రద్ధగా చదివితే ఎంత లేదన్నా పేజీకి కనీసం రెండు నిమిషాలు పడుతుంది. అంటే 120 నిమిషాలు. అంటే రెండు గంటలు. కానీ గవర్నర్ తనకు ఫిర్యాదు అందిన కొద్దిసేపటికే మన సీఎం గారికి నోటీసు పంపారు! దీనిని బట్టి మన సీఎం గారిపై వెళ్లిన ఫిర్యాదును గవర్నర్ అసలు చదవనే లేదని, మన సీఎం గారిపై ఫిర్యాదు వెళ్లటానికి ముందే గవర్నర్ దగ్గర మన సీఎం గారికి పంపవలసిన నోటీసు తయారై ఉందనీ తెలుస్తోంది..." అన్నారు పొన్నన్న!

"దీనికి మనమేమీ చేయలేమా?" అన్నారు శివ కుమార్. ఆయన ముఖంలో నవ్వు మాయమైంది.

"ఆర్టికల్ 163 ప్రకారం చేయగలం. ఆర్టికల్ 361 ప్రకారం చెయ్యలేం..." అన్నారు పొన్నన్న!!

మళ్లీ మంత్రులంతా పొన్నన్న వైపు చూశారు.

"మంత్రి మండలి చెప్పినట్లు గవర్నర్ చెయ్యాలి అని ఆర్టికల్ 163 చెబుతోంది. ఆ ప్రకారం మన సీఎం గారికి ఇచ్చిన నోటీసును వెనక్కు తీసుకోవాలని గవర్నర్‌ను మనం కోరవచ్చు. ఇక ఆర్టికల్ 361 గవర్నర్ పై క్రిమినల్ కేసు పెట్టటానికి లేదని చెబుతోంది. ఆ ప్రకారం మనం ఆయనపై, 'ప్రతిపక్షాలతో చేతులు కలిపి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని చూస్తున్నారని' ఫిర్యాదు చేయలేం..." అని చెప్పారు పొన్నన్న.

"ఈ ఆర్టికల్స్ భలే గమ్మత్తుగా రివర్స్‌లో ఉన్నాయే!" అని ఆశ్చర్యపోయారు అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే.

పెద్దగా నవ్వాన్నేను.

రివర్స్‌లో ఉన్నది ఆర్టికల్స్ మాత్రమేనా? సీఎం – గవర్నర్ అధికారాలు కూడానా!!

ఆ రోజు నవ్విన నవ్వునే నేనింకా ఈ రోజుకూ ఆపుకోలేక అవస్థలు పడుతుంటే ఖండ్రే వచ్చి భళ్ళున ఇంకోసారి నా నోరు నొప్పెట్టేలా నవ్వించారు.

కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య గవర్నర్లు వారధిగా పని చేయాలని గవర్నర్ల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ అన్నారట!! "ఇప్పుడు చేస్తున్నది అదే కదా..." అని ఖండ్రే మాట.

పశ్చిమాసియా ఓ మందు పాతర!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఇజ్రాయెల్‌పై దాడికి ఇరాన్ సన్నాహాలు చేస్తున్నట్టు తాజా వార్తలు సూచిస్తున్నాయి. పశ్చిమాసియాలో తిష్ఠవేసి ఉన్న అమెరికా సైన్యాలు కూడా ఇజ్రాయెల్‌కు రక్షణగా నిలవడానికి మోహరింపు మొదలుపెట్టాయి. ఇరాన్‌లో ఆ దేశపు అతిథిగా ఉన్న సమయంలో హమాస్ రాజకీయ విభాగపు నేతను హతం చేయడం ద్వారా ఇజ్రాయెల్ పెద్ద సవాల్‌నే విసిరింది. గత అక్టోబర్ మాసంలో ఇజ్రాయెల్ పౌరులపై దాడి చేసిన హమాస్ దుస్సాహసం కంటే ఈ చర్య తక్కువదేమీ కాదు. ఇది ఇరాన్‌కు విసిరిన సవాల్! ఇజ్జత్ కా సవాల్‌గా ఈ చర్యను ఇరాన్ పరిగణించకుండా ఉంటుందని భావించలేము.

ఇజ్రాయెల్ పాల్పడిన దుశ్చర్యకు కఠిన శిక్ష తప్పదనీ, ప్రతీకారం తీర్చుకుంటామనీ ఇరాన్ సుప్రీమ్ లీడర్ ఆయతుల్లా ఖమేనీ ఇప్పటికే ప్రకటించారు. ఇరాన్ యుద్ధంలో పాల్గొనడమంటే పశ్చిమాసియాలోని పలు ఉగ్రవాద సంస్థలు కూడా దాని వెన్నంటి ఉన్నట్టే! హమాస్‌తో పాటు లెబనాన్‌లో హెజ్బొల్లా, ఇరాక్, సిరియాల్లోని షియా మిలిషియాలు, యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు కూడా యుద్ధంలో పాల్గొంటారు. హౌతీ తిరుగుబాటుదారుల తడాఖా ఏమిటో ఇప్పటికే ప్రపంచ వాణిజ్యం చవిచూసింది.

గాజాపై ఇజ్రాయెల్ ప్రారంభించిన ప్రతీకార దాడుల తర్వాత ఇరాన్ ఆదేశాల మేరకు యెమెన్‌లో హౌతీ తిరుగుబాటుదారులు రెచ్చిపోయారు. యూరప్ – ఆసియా దేశాల మధ్య జరిగే నౌకా వ్యాపారంలో సింహభాగం సూయెజ్ కెనాల్ ద్వారానే జరుగుతుంది. ఇది ప్రపంచ నౌకా వాణిజ్యంలో 30 శాతం. విలువ లక్ష కోట్ల డాలర్లు. యూరప్ వాణిజ్య నౌకలు మధ్యధరా సముద్రం నుంచి సూయెజ్ కెనాల్ ద్వారా ఎర్ర సముద్రంలోకి ప్రవేశించి 'ఆఫ్రికా కొమ్ము' (హార్న్ ఆఫ్ ఆఫ్రికా)గా పిలుచుకునే సోమాలీ ద్వీపకల్పానికి – అరబ్ ద్వీపకల్పానికి మధ్యనున్న సన్నని దారిగుండా బంగాళాఖాతంలోకీ, అక్కడి నుంచి హిందూ మహాసముద్రంలోకీ ప్రవేశిస్తాయి. అరబ్ ద్వీపకల్పానికి బంగాళాఖాతపు అంచున ఉన్న దేశం యెమెన్. యెమెన్‌లోని షియా తిరుగుబాటుదారులనే 'హౌతీ'లుగా పిలుస్తున్నారు. హౌతీల దాడులకు భయపడి సూయజ్ నౌకా వాణిజ్యంలో 90 శాతం ఆగిపోయింది. యూరప్ నుంచి అట్లాంటిక్ సముద్రం ద్వారా ఆఫ్రికా ఖండపు 'కేప్ ఆఫ్ గుడ్ హోప్' అంచును చుట్టి హిందూ మహాసముద్రంలోకి ప్రవేశించడానికి ఈ నౌకలకు రెండు వారాల అదనపు సమయం పట్టింది. భారీగా అదనపు వ్యయాన్ని భరించాల్సి వచ్చింది. వాణిజ్యాల్లోని అదనపు భారాన్ని అంతిమంగా మోయాల్సింది వినియోగదారులైన ప్రజలే! హౌతీల దాడుల ప్రభావం 50 దేశాల నౌకా వాణిజ్యంపై పడిందని గత జనవరిలోనే వైట్‌హౌస్ ప్రకటించింది.

ఇరాన్ – ఇజ్రాయెల్‌ల మధ్యన నిజంగానే యుద్ధం ప్రారంభమైతే దాని విధ్వంసకర ప్రభావాన్ని మొత్తం ప్రపంచమే ఎదుర్కోవలసి వస్తుంది. ఇక ఆ ప్రాంతపు సంక్షోభం గురించి చెప్పవలసిన అవసరమే లేదు. ఇజ్రాయెల్ జరిపిన గాజా దాడుల్లోనే 40 వేలమంది చనిపోయారు. పుష్కర కాలం కింద ప్రారంభమైన సిరియా అంతర్యుద్ధంలో ఇప్పటివరకు నాలుగు లక్షల మంది ప్రాణాలు పోగొట్టుకున్నట్టు అంచనా. తీవ్రమైన మానవతా హననాన్ని ఈ ప్రాంతం చవిచూసింది. ఉన్న ఊరు విడిచి పోయినవారూ, కన్నబిడ్డల్ని అనాథల్ని చేసినవారూ లక్షల సంఖ్యలో ఉన్నారు. ఒక దశలో మధ్యధరా సముద్రపు అలల మీద శవాలు తేలియాడిన విషాద సన్నివేశాలను కూడా ప్రపంచం చూసింది. ఇక ఆర్థిక వ్యవస్థల విధ్వంసం, లక్షలాది ప్రజలు శరణార్థులుగా వలస వెళ్లడాలు యుద్ధ దేశాల్లో షరా మామూలే!

పశ్చిమాసియా సంక్షోభంతో కానీ, దాని కారణాలతోగానీ ఎటువంటి సంబంధం లేని భారతదేశం కూడా యుద్ధం ప్రారంభమైతే తీవ్ర సంకట పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుంది. హమాస్ నాయకుడు ఇస్మాయెల్ హనియా హత్య జరిగి మూడు రోజులు గడిచినా భారతదేశం నుంచి ఖండన మండనల వంటి అధికారిక ప్రకటనలేమీ రాలేదు. 'వ్యూహాత్మక నిశ్శబ్దాన్ని' పాటిస్తున్నామనుకోవాలి. నిజంగా కూడా భారత్ పరిస్థితి అటువంటిదే! రెండు దేశాలతో మనకు మంచి సంబంధాలున్నాయి. అంతకు మించి రెండు దేశాలతో అవసరాలు కూడా ఉన్నాయి.

ఇరాన్ – ఇజ్రాయెల్‌ల మధ్యన నిజంగానే యుద్ధం ప్రారంభమైతే దాని విధ్వంసకర ప్రభావాన్ని మొత్తం ప్రపంచమే ఎదుర్కోవలసి వస్తుంది. ఇక ఆ ప్రాంతపు సంక్షోభం గురించి చెప్పవలసిన అవసరమే లేదు. ఇజ్రాయెల్ జరిపిన గాజా దాడుల్లోనే 40 వేలమంది చనిపోయారు. పుష్కర కాలం కింద ప్రారంభమైన సిరియా అంతర్యుద్ధంలో ఇప్పటివరకు నాలుగు లక్షల మంది ప్రాణాలు పోగొట్టుకున్నట్టు అంచనా. తీవ్రమైన మానవతా హననాన్ని ఈ ప్రాంతం చవిచూసింది. ఉన్న ఊరు విడిచిపోయినవారు, కన్నబిడ్డల్ని అనాథల్ని చేసిన వారూ లక్షల సంఖ్యలో ఉన్నారు. ఒక దశలో మధ్యధరా సముద్రపు అలల మీద శవాలు తేలియాడిన విషాద సన్నివేశాలను కూడా ప్రపంచం చూసింది.

పశ్చిమాసియా సంక్షోభంతో కానీ, దాని కారణాలతోగానీ ఎటువంటి సంబంధం లేని భారతదేశం కూడా యుద్ధం ప్రారంభమైతే తీవ్ర సంకట పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుంది. హమాస్ నాయకుడు ఇస్మాయెల్ హనియా హత్య జరిగి మూడు రోజులు గడిచినా భారతదేశం నుంచి ఖండన మండనల వంటి అధికారిక ప్రకటనలేమీ రాలేదు. 'వ్యూహాత్మక నిశ్శబ్దాన్ని' పాటిస్తున్నామనుకోవాలి. నిజంగా కూడా భారత్ పరిస్థితి అటువంటిదే! రెండు దేశాలతో మనకు మంచి సంబంధాలున్నాయి. అంతకు మించి రెండు దేశాలతో అవసరాలు కూడా ఉన్నాయి.

ఇరాన్‌తో భారత స్నేహ సంబంధాలు తరతరాల నాటివి. ఇరాన్ మీద అమెరికా ఆంక్షలు విధించిన సమయంలో మిత్రదేశంగా మనం బాసటగా నిలబడనప్పటికీ 'చాబహార్ పోర్టు' నిర్మాణ బాధ్యతలను మనకే అప్పగించి సౌహార్దం చాటుకున్న దేశం ఇరాన్. ఇటీవలి కాలంలో ఇజ్రాయెల్‌తో కూడా భారత్ బంధం బాగా బలపడింది. భద్రత, మిలిటరీ వంటి అంశాల్లో రెండు దేశాల మధ్య స్నేహ ఒడంబడికలున్నాయి. భారతదేశ ఇంధన అవసరాల్లో అత్యధిక భాగం పశ్చిమాసియానే తీరుస్తున్నది. ఈ ప్రాంతంలోని దాదాపు అన్ని దేశాలతోనూ భారత్‌కు దౌత్య సంబంధాలున్నాయి.

కొన్ని లక్షలమంది భారతీయులు ఈ దేశాల్లో ఉపాధి పొందుతున్నారు. ఏటా మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా ఈ ప్రవాసులు భారత్‌కు పంపిస్తున్నారు. ప్రవాసుల భద్రత పట్ల కూడా భారత్‌కు ఆందోళన ఉంటుంది. ఇటీవలనే యూఏఈ, జోర్డాన్, గ్రీస్‌లతో కలిసి 'ఇండియా – మిడిల్ ఈస్ట్ – యూరోప్ ఎకనామిక్ కారిడార్'ను కూడా భారత్ ప్రారంభించింది. ఉద్రిక్తతల కారణంగా ఈ నడవా ఇంకా నడకను మొదలుపెట్టలేకపోయింది. ఇజ్రాయెల్, యూఏఈ, అమెరికాలతో కలిసి ఏర్పాటు చేసుకున్న 'ఐ టూ – యూ టూ' ప్లాన్ పరిస్థితి కూడా ఇంతే!

ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి రెండు ధ్రువాల ప్రపంచంలో ఏ దేశమైనా ఏదో ఓ కూటమి వైపు మొగ్గవలసిన పరిస్థితులుండేవి. అలీన దేశాలకు కూడా మినహాయింపు లేదు. ఇప్పుడున్న పరిస్థితులను ఏకధ్రువ ప్రపంచంగా కూడా పిలువలేము. ఇది దేశాల మధ్య కీలక భాగస్వామ్యాల యుగం. భౌగోళిక – రాజకీయ, భౌగోళిక – ఆర్థిక అవసరాలను బట్టి ప్రాంతీయంగానూ, ఖండాంతర స్థాయుల్లోనూ ఈ వ్యూహాత్మక లేదా కీలక భాగస్వామ్య కూటములు ఏర్పాటవుతున్నాయి. ఇటువంటి భాగస్వామ్యాలు పశ్చిమాసియా దేశాలతో కూడా భారత్‌కున్నాయి. ప్రపంచంలోని మరే ఇతర ప్రాంతంలో తలెత్తే సంక్షోభం కంటే కూడా పశ్చిమాసియా సంక్షోభమే భారత్‌పై ఎక్కువ ప్రభావాన్ని చూపుతుంది. ఈ ప్రాంతంలో జరిగే యుద్ధం భారత్‌కు నిజంగా పీడకలే! కానీ, ఒక దేశపు దుశ్చర్యను ఖండించలేని స్థితిలో ఉన్న భారత్ యుద్ధాన్ని ఆపగలదని ఆశించలేము.

ఇజ్రాయెల్... అమెరికా మాట వింటుంది. రష్యా – చైనాల మాటను ఇరాన్ వినే అవకాశం ఉంది. ఈ మూడు దేశాలు కలిసి సంయుక్తంగా యుద్ధాన్ని నివారించేందుకు పూనుకుంటాయా? అది సాధ్యమయ్యే పనేనా? అసలు యుద్ధం జరగకూడదని ఈ మూడు దేశాలు కోరుకుంటున్నాయా అనేది ముఖ్యమైన ప్రశ్న. యుద్ధం జరిగితే రష్యాకు పోయేదేమీ ఉండకపోవచ్చు. ఇరాన్, సిరియాలు మిత్ర దేశాలు. వాటికి కావలసిన ఆయుధాలను నూటికి నూరు శాతం రష్యానే ఎగుమతి చేస్తున్నది. ఇప్పటికే ఆయుధ ఎగుమతులు తగ్గిపోయిన రష్యాకు ఇదో ఊరటే! కోల్పోయిన ఒకనాటి ప్రాధాన్యత మళ్లీ ఆ ప్రాంతంలో దక్కడం కంటే కావల్సిందేముంది! ఉక్రెయిన్‌కు అండగా నిలబడిన అమెరికాకు పశ్చిమాసియాలో పాఠం చెప్పే అవకాశం వస్తే ఎందుకు వదులుకుంటుంది?

దేశాల మధ్య ఉద్రిక్తతలు, వైషమ్యాలు ఉండే పరిస్థితులపై చైనా, అమెరికాలకు అభ్యంతరాలు ఉండకపోవచ్చు. కాకపోతే ఇప్పుడున్న పరిస్థితుల్లో అవి యుద్ధాన్ని కోరుకోకపోవచ్చు. అమెరికాకు ఈ ప్రాంతంలో సైన్యం ఉన్నది. సైనిక స్థావరాలున్నాయి. ఇజ్రాయెల్ వంటి బలమైన శిష్య దేశాలు, సౌదీ వంటి మిత్ర దేశాలున్నాయి. వాటితో ప్రయోజనాలున్నాయి. ఇక్కడ యథాతథ స్థితి కొనసాగడం అమెరికాకు అవసరం. ఇక్కడి బలాబలాల సమతూకం చెదిరితే ప్రపంచవ్యాప్తంగా దాని ప్రభావం పడుతుంది.

యుద్ధమే జరిగితే ఇజ్రాయెల్‌కు అండగా నిలవక తప్పని స్థితి అమెరికాది. ఒకవేళ అలా నిలబడకపోయినట్టయితే ప్రపంచవ్యాప్తంగా అమెరికా కుదుర్చుకున్న వ్యూహాత్మక ఒప్పందాలు, ముఖ్యంగా చైనాకు వ్యతిరేకంగా ఇండో – పసిఫిక్‌లో కుదిరిన ఒప్పందాల్లో భాగస్వాములు అమెరికాను విశ్వసించకపోయే అవకాశం ఉంటుంది. సొంత దేశంలోని యూదు లాబీ అభీష్టానికి వ్యతిరేకంగా రాజకీయ నిర్ణయాలు అమెరికా తీసుకోగలదా అన్నది కూడా సందేహమే. కనుక యుద్ధంలో అమెరికా పాత్ర ఉంటుంది.

ఇజ్రాయెల్‌తో పాటు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్, ఖతార్ తదితర దేశాలు పశ్చిమాసియాలో అమెరికాకు సన్నిహితంగా ఉంటాయి. ఈ దేశాలతో అమెరికాకు బలమైన వాణిజ్య, సహకార సంబంధాలున్నాయి. యుద్ధం ఇజ్రాయెల్ వర్సెస్ అరబ్ ఘర్షణగా మారితే ఈ మిత్రదేశాలకు కొంత ఇబ్బందికరంగా పరిణమించవచ్చు. గాజాపై ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా ఈ మధ్యకాలంలో అమెరికా విద్యార్థులు పెద్ద ఎత్తున గళం విప్పుతున్నారు. కాన్వొకేషన్ కార్యక్రమాలను పాలస్తీనా అనుకూల నినాదాలతో హోరెత్తించారు. దేశంలోని యూదు లాబీకి దీటుగా వ్యతిరేక శక్తులు కూడా బలపడుతున్న సూచనల నేపథ్యంలో ఈ యుద్ధం అధికార పార్టీ డెమోక్రట్ల పుట్టిని ఎన్నికల్లో ముంచినా ముంచవచ్చు.

ఏ రకంగా ఆలోచించినా యుద్ధ నివారణే అమెరికాకు ప్రస్తుత అవసరం. అందుకు ఇరాన్‌ను నియంత్రించవలసిన అవసరం ఉన్నది. రష్యా సహకారంతో చైనా ఈ పని చేయాలని అమెరికా కోరిక. చైనాకు 'బెల్ట్ అండ్ రోడ్ ఇన్షియేటివ్'లో భాగమైన మౌలిక వసతుల ప్రాజెక్టులపై ఈ దేశాల్లో ఒప్పందాలున్నాయి. పశ్చిమాసియా యుద్ధం ఆర్థిక కారణాల రీత్యా చైనాకు కూడా ఆమోదయోగ్యం కాదని అమెరికా అంచనా. పశ్చిమాసియా సంక్షోభంలో అమెరికా కూరుకొనిపోయినట్లయితే ఇండో – పసిఫిక్‌లో తమను దిగ్బంధం చేసే ప్రయత్నాలు వెనకడుగు వేస్తాయని చైనా దౌత్య నిపుణులు అంచనా వేసుకుంటే ఆశ్చర్యపడవలసిన పనిలేదు. ఇస్మాయెల్ హనియా హత్యను కూడా చైనా గట్టిగానే ఖండించింది. ఈ కోణంలో చూసినప్పుడు యుద్ధ నివారణకు చైనా చొరవ చూపే అవకాశాలు చాలా తక్కువ.

పెత్తందారీ దేశాల ఎత్తుగడలు ఏ రకంగా ఉన్నా పశ్చిమాసియా ఇప్పుడు పేలడానికి సిద్ధంగా ఉన్న ఒక మందుపాతర లాగా కనిపిస్తున్నది. పర్షియా, మెసపుటోమియా, ఫొనీషియన్, ఈజిప్టు నైలునదీ నాగరికతలు విలసిల్లిన చారిత్రక ధన్యభూమి ఇప్పుడు దగ్ధగీతాన్ని వినిపిస్తున్నది. ప్రపంచ జనాభాలో పశ్చిమాసియా వాటా రెండున్నర శాతం దాటదు. కానీ 30 శాతం ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్న ప్రాంతం ఇదే! సగటున తొమ్మిది శాతం జీడీపీని ఈ దేశాలు ఆయుధాల కోసం తగలేస్తున్నాయి. రష్యా మార్కెట్ ఇరాన్, సిరియాలు మాత్రమే! మిగతా మార్కెటంతా అమెరికాదే! ఈ దేశాలు ఆయుధాల మీద ఏటా వెచ్చిస్తున్న ఐదు లక్షల కోట్ల రూపాయల్లో భీముని వాటా అమెరికాదే. ఒకపక్క తుపాకులు చేరవేస్తూ, 'కాల్చుకోకండి ప్లీజ్... జస్ట్ ఆడుకోండి' అంటే కుదురుతుందా? అందుకే అమెరికా శాంతి ప్రబోధాలకు పెద్దగా విలువ ఉండదు.

vardhelli1959@gmail.com

యుద్ధమే జరిగితే ఇజ్రాయెల్‌కు అండగా నిలవక తప్పని స్థితి అమెరికాది. ఒకవేళ అలా నిలబడకపోయినట్టయితే ప్రపంచవ్యాప్తంగా అమెరికా కుదుర్చుకున్న వ్యూహాత్మక ఒప్పందాలు, ముఖ్యంగా చైనాకు వ్యతిరేకంగా ఇండో – పసిఫిక్‌లో కుదిరిన ఒప్పందాల్లో భాగస్వాములు అమెరికాను విశ్వసించకపోయే అవకాశం ఉంటుంది. సొంత దేశంలోని యూదు లాబీ అభీష్టానికి వ్యతిరేకంగా రాజకీయ నిర్ణయాలు అమెరికా తీసుకోగలదా అన్నది కూడా సందేహమే. కనుక యుద్ధంలో అమెరికా పాత్ర ఉంటుంది.

ఇజ్రాయెల్‌తో పాటు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్, ఖతార్ తదితర దేశాలు పశ్చిమాసియాలో అమెరికాకు సన్నిహితంగా ఉంటాయి. ఈ దేశాలతో అమెరికాకు బలమైన వాణిజ్య, సహకార సంబంధాలున్నాయి. యుద్ధం ఇజ్రాయెల్ వర్సెస్ అరబ్ ఘర్షణగా మారితే ఈ మిత్రదేశాలకు కొంత ఇబ్బందికరంగా పరిణమించవచ్చు. గాజాపై ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా ఈ మధ్యకాలంలో అమెరికా విద్యార్థులు పెద్ద ఎత్తున గళం విప్పుతున్నారు. కాన్వొకేషన్ కార్యక్రమాలను పాలస్తీనా అనుకూల నినాదాలతో హోరెత్తించారు. దేశంలోని యూదు లాబీకి దీటుగా వ్యతిరేక శక్తులు కూడా బలపడుతున్న సూచనల నేపథ్యంలో ఈ యుద్ధం అధికార పార్టీ డెమోక్రట్ల పుట్టిని ఎన్నికల్లో ముంచినా ముంచవచ్చు. ఏ రకంగా ఆలోచించినా యుద్ధ నివారణే అమెరికాకు ప్రస్తుత అవసరం.

పశుపక్ష్యాదులకూ లెక్కలు తెలుసు!

విశ్లేషణ



కె.బి.గోపాలం

సంగీత జ్ఞానం అని ఒక మాట ఉంది. భక్తి లేకుండా సంగీత జ్ఞానం లేదు అంటాడు త్యాగరాజు. ఆ సంగతి పక్కన పెడితే స్వర జ్ఞానం, తాళజ్ఞానం అని సంగీతంలో రెండు భాగాలు. ఇక అక్షర జ్ఞానం అని మరొక మాట ఉంది. అంటే చదవడం, రాయడం రావడం అన్నమాట. మరి అంకెల మాట ఏమిటి?

అందరికీ ఏదో ఒక రకంగా లెక్కపెట్టడం తెలిసే ఉంటుంది. చివరకు పిల్లలకు కూడా పంపకంలో తమకు అన్యాయం జరిగిన సంగతి అర్థం అవుతుంది.

ఈ రకంగా మొత్తం మీద అందరికీ అంకెల గురించిన తెలివి ఉంటుంది. అది అనుకోకుండానే వస్తుంది. మనిషి మెదడుకు అంకెలు అర్థమవుతాయి, వాటి మధ్యన లంకె తెలుస్తుంది.

అయితే ఈ జ్ఞానం ఉన్నది ఒక్క మనుషులకే కాదు అంటున్నారు. చీమల నుంచి మొదలు తేనెటీగల దాకా ఇంకా పైజాతి జంతువుల వరకు అన్నింటికీ అంకెల గురించి తెలుసు అంటున్నారు. కోతులు, సాలెపురుగులు కూడా కొన్ని అంకెలనైనా తెలుసుకుంటాయి అంటారు పరిశోధకులు. తేనెటీగలు బయలుదేరి తేనె సేకరణ కోసం తిరుగుతూ ఏ ప్రాంతంలో ఎక్కువ పువ్వులు ఉన్నదీ సులభంగా అర్థం చేసుకుంటాయి. కోతులకు ఏ చెట్టు మీద పండ్లు ఎక్కువ ఉన్నాయో తెలుస్తుంది. ఎదుటి గుంపు గర్జనలను గుర్తించి క్రూర మృగాలు శత్రువుల సంఖ్యను తెలుసుకుంటాయి. జంతువులన్నీ ఆ రకంగా విషయాలు తెలుసుకుంటే గాని వాటి బతుకు సులభంగా సాగదు అంటారు ఆంద్రియాస్ నీడర్. ఆయన జర్మనీలోని 'ట్యూబింజెన్' విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు.

సంఖ్యను గుర్తించే ఈ వెసులుబాటు జంతు జాతుల చరిత్రలో అత్యంత ప్రారంభ కాలంలోనే మొదలైంది అంటున్నారు పరిశోధకులు. అయితే మరి కొత్తగా ఈ సంగతిని గురించి ఎందుకు పట్టించుకోవాలి అన్నది ప్రశ్న.

ఒక్కసారి చూచి గుర్తుంచుకోగలిగిన అంకెల విషయంలో మనుషులకు పరిమితులు ఉన్నట్టు పరిశోధకులు గమనించారు. నాలుగు వరకు మాత్రమే సులభంగా గుర్తుంటాయి అంటున్నారు. ఒకచోట నాలుగు పుస్తకాలు ఉంటే సులభంగా గుర్తించగలుగుతాం. అంతకన్నా ఎక్కువగా ఉంటే లెక్కపెట్టవలసి వస్తుంది. ఏ విషయంలో అయినా ఇదే పరిమితి. ఇందులో కూడా రెండు అంచెలు ఉంటాయి.



ముందు సంఖ్య నిర్ణయం అవుతుంది. ఆ తరువాత ఆ సంఖ్య సరైనదేనా అని లెక్క తేలుతుంది.

క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో పెడ్రో పినైరో షాగాస్ ఈ విషయంలో ఆసక్తికరమైన అంశాలను తెలియజేశారు. ఇక ఏ అంకె లేకుండా... అంటే సున్నా అన్న భావన ఉన్నచోట కూడా లెక్కింపు అవసరమే అంటున్నారు. అసలు అంకెలు అన్నింటిలోకి సున్నా అన్నది చాలా గొప్పది అంటారు నీడర్. చిన్న చిన్న అంకెలు నేర్చుకున్న తర్వాత కూడా సున్నా అనే భావన నేర్చుకోవడానికి చిన్నపిల్లలకు కొంత కాలం పడుతుంది అని పరిశోధకులు గమనించారు. ఏదో ఉంది అని చెప్పడం, వాటిని లెక్కించడం వింతగా తోచదు కానీ ఏమీ లేని చోట సున్నా అన్న భావన రావడం గొప్ప విషయం.

నీడర్ బృందం వారు తమ పరిశోధన ద్వారా కోతులు, తేనెటీగలు, కాకులకు కూడా '0' అన్న విషయం తెలుసునని కనుగొన్నారు. ఈ అంశం గురించి కొంత కాలం క్రితమే 'క్వాంటా' అనే పరిశోధన పత్రికలో వ్యాసాలు వచ్చాయి.

చాలావరకు జంతువులు, లేదంటే జంతువులు అన్నింటికీ సంఖ్యాజ్ఞానం ఉంది అని సులభంగానే తెలుస్తుంది కానీ దానికి పరిమితి ఎక్కడ అన్న ప్రశ్న చిత్రమైనది. ఆస్ట్రేలియాలోని డికెన్స్ యూనివర్సిటీలో కృషి చేస్తున్న స్కార్లెట్ హోవర్డ్ ఈ అంశం గురించి పరిశోధిస్తున్నారు. జంతువు అంకెల పరిమితి మనం ఇంతకుముందు అనుకున్న ప్రకారం కాక మరీ ఎక్కువగా ఉందని కనుగొన్నారు. సున్నా అంటే ఒకటి కన్నా తక్కువ అని తెలుసునట. వాటికి కూడికలు, గుణకారాలు కూడా తెలుసునట. నిజానికి మనిషి పరిణామం చాలా కాలం తర్వాత జరిగింది. మనిషికి కూడా ఈ లెక్కలన్నీ తెలిశాయి. ఇది మొత్తం ప్రాణి ప్రపంచంలోనే ఉన్న విషయం అని పరిశోధకులకు తెలిసింది.

మనుషులు ఒకసారి చూచినా, విన్నా ఎనిమిది అంకెల వరకు సులభంగా గుర్తించగలుగుతారని కొంత కాలం క్రితమే తెలుసు. ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ నంబర్లు 10 అంకెలు ఉంటాయి. కనుక వాటిని ఒకసారి విని గుర్తుంచుకోవడం కష్టం అవుతున్నదట. కొంతకాలం క్రితం ఫోన్ నంబర్లలో 8 కన్నా తక్కువ అంకెలు ఉండేవి. అప్పట్లో సులభంగా గుర్తుండేవట!

ఇటువంటి విషయాలను గురించి మనం సాధారణంగా ఆలోచించం. అది సైంటిస్టుల పని అనుకుంటాం. నిజానికి ఈ విషయాలు అందరికీ సంబంధించినవి మరి!

వ్యాసకర్త సైన్స్ అంశాల రచయిత

ఉండాల్సిన దృష్టికోణం

మనం ఏ రంగు కళ్ళజోడు పెట్టుకుంటే ఆ రంగులోనే ఈ ప్రపంచం కనిపిస్తుంది అని చెప్తుంటారు. అంటే మనం ఏ దృక్కోణంలో ప్రపంచాన్ని చూస్తే అదే విధంగా మనకు అది కనిపిస్తుందన్నమాట. ఇందుకు బుద్ధుని కాలం నాటి ఒక ఉదాహరణ పరిశీలిద్దాం.

బుద్ధుడి శిష్యుడొకడు తమ విహారం నుంచి ధమ్మ (ధర్మ)ప్రచారం చేయడం కోసం పొరుగూరికి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాడు. అప్పుడు బుద్ధుడు అతనిని పిలిచి ఆ రోజు ధర్మ ప్రచారానికి ఎక్కడికెళుతున్నావని అడిగాడు. శిష్యుడు తాను వెళ్లదలచుకున్న ప్రదేశం చెప్పాడు. 'ఆ ప్రాంతంలో ఉన్న వారు నిన్ను తిడితే ఏం చేస్తావ'ని బుద్ధుడు అడిగాడు. 'నేను సంతోషిస్తాను' అన్నాడు శిష్యుడు. 'ఎందుకని' బుద్ధుడి ప్రశ్న. 'ఫరవాలేదే వాళ్ళు నన్ను కొట్టకుండా తిట్లతో విడిచిపెట్టార'ని సంతోషిస్తా'నన్నాడు శిష్యుడు.

జ్యోతిర్మయం

'సరే, ఒకవేళ నిన్ను వాళ్ళు కొడితే ఏం చేస్తావు' అని అడిగాడు బుద్ధుడు. 'అరెరే! వీళ్ళెంత మంచివారో, ఆయుధాలతో కాకుండా చేత్తోనేగా కొట్టారనుకుంటాన'న్నాడు శిష్యుడు. 'ఒకవేళ వారు ఆయుధాలతో దాడి చేస్తే అప్పుడేం చేస్తావన్న'ది బుద్ధుడి ప్రశ్న. 'ఆహా! వీళ్ళెంత మంచివారో, వారు నన్నీ లోకం నుంచి తప్పించడానికి ఎంత మంచి పని చేశారో అని అనుకుంటాన'న్నాడు శిష్యుడు.

అంతట బుద్ధుడు అతని వంక చూసి ఆశీర్వదించి సాగనంపాడు. ఆ శిష్యుడి దృష్టిలో ఈ ప్రపంచంలో అందరూ మంచివారే. ఆ మేరకు అతను పరిపక్వత చెందాడన్న మాట!

అయితే కొందరి దృష్టి వేరేగా ఉంటుంది. ఎదుటివారు మంచి చేసినా దాన్ని అపార్థం చేసుకుంటారు. మంచిని మంచిగా గ్రహించడం వారికి తెలీదు.

చూసే చూపును బట్టే లోకం కనిపిస్తుందన్నది సుస్పష్టం.

– యామిజాల జగదీశ్

సవరణ: ఆగస్టు 3, శుక్రవారం నాటి ఎడిటోరియల్ పేజీలో 'వైజ్ఞానిక వేగుచుక్కలు' శీర్షిక కింద రుక్మాబాయి పేరుతో ప్రచురితమైన ఫొటో ఆనందీబాయి జోషీదిగా గమనించగలరు.



ఆ వంద మందీ బెస్ట్ ఫ్రెండ్సే

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
చిన్ననాటి స్కూల్ మిత్రులను గుర్తుచేసుకున్న మంత్రి

సాక్షి, హైదరాబాద్: తనతో పాటు చిన్ననాటి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న దాదాపు వందమంది తనకు బెస్ట్ ఫ్రెండ్సేనని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. ప్రత్యేకంగా ఒక్కరే బెస్ట్ ఫ్రెండ్ అంటూ లేరని. అందరం కలిసిమెలిసి ఉంటామన్నారు. కరీంనగర్ సరస్వతీ శిశుమందిర్‌లో చదువుకున్న క్లాస్‌మేట్స్ అంతా ఇప్పటికీ ఏడాదికి కనీసం రెండుసార్లైనా కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటామని పేర్కొన్నారు. తాను ఎప్పుడు ఎన్నికల బరిలోకి దిగినా తన మిత్రులంతా కూడా తమ వంతు సహాయ, సహకారాలను అందించడంతో పాటు తన గెలుపునకు కృషి చేయడాన్ని మరిచిపోలేనన్నారు. ఆదివారం స్నేహితుల రోజు (ఫ్రెండ్‌షిప్‌డే) సందర్భంగా...సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడుతూ, తమ పాఠశాల రోజులు, క్లాస్‌మేట్స్, మిత్రులను సంజయ్ గుర్తుచేసుకున్నారు. తన స్నేహితులంతా కూడా వివిధ స్థాయిల్లో, హోదాల్లో, చిన్నా పెద్ద వ్యాపారాలు, ఉద్యోగాల్లో ఉన్నా శిశుమందిర్ కార్యక్రమాలు, ఏవైనా ఫంక్షన్లు, పుట్టినరోజులు ఇలాంటి సందర్భాల్లో కలుసుకుంటూ ఉంటామని చెప్పారు. గత పదిహేనేళ్ల నుంచి ప్రతీ ఏడాది తామంతా తప్పనిసరిగా కలుసుకుని చిన్ననాటి అనుభవాలు, అప్పటి అల్లరిచేష్టలను గుర్తుచేసుకుంటామని తెలిపారు. 'సరస్వతీ శిశు మందిర్ పూర్వ విద్యార్థులు'గా తామంతా కుటుంబసభ్యుల్లా ఉంటామని, కలిసి వివిధ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు కలిసి భోజనం చేస్తుంటామని తెలిపారు. తన కంటే రెండేళ్లు పెద్ద అయిన సంజయ్‌తో పాటు ఆయన సోదరుడు బండి సంపత్‌కుమార్ కూడా అదే స్కూల్లో చదువుకున్నారు. దీంతో అన్నయ్య ఫ్రెండ్స్ అంతా తనకు కూడా మిత్రులేనని ఆయన పేర్కొన్నారు. శిశుమందిర్‌లో చదువుతున్నప్పుడే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శాఖతో సంజయ్‌కు అనుబంధం ఏర్పడి అందులోనే విద్యార్థిగా కొనసాగారని సంపత్ తెలిపారు. సంజయ్ పుట్టినరోజు సందర్భంగా...వారి క్లాస్‌మేట్స్ స్వచ్ఛందంగా అన్నదానంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని తెలిపారు. మిత్రులంతా కలుసుకున్నపుడు తమ హోదాలు, వయసు మరిచిపోయి చిన్నపిల్లలుగా మారిపోయి, జోక్స్, ఆట పట్టించడం వంటివి చేస్తూ ఆనందిస్తారని సంపత్ తెలియజేశారు.


మిత్రులతో బండి సంజయ్

ప్రభుత్వం వెంటనే కులగణన చేపట్టాలి

• మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘాల నేతలు

లక్డీకాపూల్ (హైదరాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచైనా కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయిస్తామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దీని కోసం తెలంగాణ ఉద్యమం తరహాలో మరోసారి పోరాడుతామని పేర్కొన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ కులసంఘాలు, బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే కులగణనను చేపట్టాలన్నారు. దీని ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి.. ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ మాట్లాడుతూ.. కులగణన విషయంలో కాంగ్రెస్ పార్టీయే హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కులగణన కోసం ఈ నెల 10న ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన బీసీల సత్యాగ్రహ దీక్షలో పార్టీలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలసి ఆయన సత్యాగ్రహ దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు.

డెంగీతో గర్భిణి మృతి


అక్షిత

ములుగు రూరల్: డెంగీ జ్వరంతో నిండు గర్భిణి మృతి చెందింది. ములుగు జిల్లా జాకారంలో శనివారం జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలివి. జాకారం గ్రామానికి చెందిన మంచోజు రాజేంద్ర ప్రసాద్ భార్య అక్షిత(25) 9 నెలల గర్భిణి. ములుగు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటోంది. ఆమె నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ములుగులో వైద్యం చేయించుకుంటున్నా జ్వరం తగ్గకపోవడంతో నర్సంపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు డెంగీతోపాటు పచ్చకామెర్లు సోకినట్టు తెలిపారు. తల్లి, బిడ్డకు ప్రమాదమని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి కడుపులో బిడ్డ చనిపోయిందని, శస్త్రచికిత్స చేసి మృత శిశువును తీశారు. అనంతరం చికిత్స పొందుతూ అక్షిత కూడా మృతి చెందింది.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకం

• తీర్పుపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ
• ఆ తర్వాత వర్గీకరణకై కమిటీ కోసం సీఎంకు విజ్ఞప్తి
• మంత్రి దామోదర రాజనర్సింహ


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర. చిత్రంలో మోత్కుపల్లి, కాలే యాదయ్య, సంపత్ తదితరులు

సనత్‌నగర్ (హైదరాబాద్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు చరిత్రాత్మకమైందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై వాదనలు వినిపించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రముఖ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాను పంపించి బలమైన వాదనలు వినిపించేలా చేశారని గుర్తు చేశారు. 'ఎస్సీ వర్గీకరణ–మాదిగల భవిష్యత్తు' అనే అంశంపై శనివారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో మాదిగ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మేధావుల సమావేశం జరిగింది. ప్రొఫెసర్ జి.మల్లేశం అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, రాష్ట్రాలు ఎస్సీ, ఎస్టీల వర్గీకరణను చేసుకోవచ్చని తీర్పు రావడం ద్వారా అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టులో వాదనలకు పూర్తిగా సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సభ ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేసిందన్నారు. న్యాయనిపుణులతో ఒక కమిటీ వేసి సుప్రీంకోర్టు తీర్పుపై అధ్యయనం చేసిన నివేదిక సీఎంకు అందజేస్తామని చెప్పారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిని మాదిగ ఎమ్మెల్యేలందరూ కలిసి ఒక కమిటీ వేయాల్సిందిగా కోరతామని, ఆ కమిటీ సూచనల మేరకు ఎస్సీ వర్గీకరణ చట్టం తీసుకురావాలన్నారు. అంతేకాకుండా త్వరలో పెద్దఎత్తున మాదిగల సమ్మేళనం పేరుతో ఒక బహిరంగ సభను ఏర్పాటుచేసి సీఎంను ఆ సభకు ఆహ్వానించి సన్మానించనున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అయ్యేవరకు జాతి పెద్దలుగా అందరం కలసికట్టుగా ముందుకుసాగుదామన్నారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ, మాదిగలకు తగిన ప్రాధాన్యతనిచ్చి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మొట్టమొదటి నేత ఎన్టీఆర్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వేముల వీరేశం, మందుల సామేల్, లక్ష్మీకాంతరావు, కాలే యాదయ్య, ప్రొఫెసర్ కాశీం, కొండ్రు పుష్పలీల, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, పిడమర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల తర్వాతే స్థానిక ఎన్నికలు

• ఎంపీ ఆర్.కృష్ణయ్య, మాజీ ఐఏఎస్ చిరంజీవులు డిమాండ్


దీక్షలో ఆర్.కృష్ణయ్య, చిరంజీవులు

ముషీరాబాద్ (హైదరాబాద్): రాష్ట్రంలో కులగణన చేపట్టి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో బీసీ కులగణన సాధన కోసం నిరాహార దీక్ష జరిగింది. ఆర్.కృష్ణయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ సింహాద్రి దీనికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు దాటినా కులగణన ప్రక్రియ చేపట్టకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కుట్రలు పన్నుతున్నారన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవి మాట్లాడుతూ సకల జనుల సర్వే ఆధారంగా వెంటనే కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ సింహాద్రి మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. బీసీ సంఘాల నేతలు గుజ్జ సత్యం, నీల వెంకటేశ్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

ఆ వర్సిటీల్లో రిజర్వేషన్ల అమలు తర్వాతే అడ్మిషన్లు చేపట్టాలి

• బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కొత్తగా అనుమతులు ఇచ్చిన ఐదు ప్రైవేట్ యూనివర్సిటీలలో రిజర్వేషన్లను అమలు చేశాకే అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్‌నాయక్ డిమాండ్ చేశారు. యూజీసీ నియమ నిబంధనల ప్రకారం... ప్రభుత్వ వర్సిటీలలో రిజర్వేషన్ల నిబంధనలకు అనుగుణంగా ఈ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగించాలని శనివారం ఓ ప్రకటనలో సూచించారు. గత ప్రభుత్వ హయాంలో శ్రీనిధి, గురునానక్, ఎంఎన్ఆర్, కావేరి, నిక్మార్ వంటి ఇంజనీరింగ్ కళాశాలల అనుమతులు రిజర్వేషన్ల విధానాన్ని ప్రస్తావించకుండానే బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపించడాన్ని తప్పుబట్టారు. దీని ద్వారా రాష్ట్రంలోని గిరిజనులు, వెనుకబడిన తెగలకు తీవ్ర అన్యాయం జరిగిందని పెద్ద ఎత్తున వివాదం అయ్యాకే అప్పటి గవర్నర్ తిరస్కరించారని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఆమోదించి గవర్నర్ ప్రతిపాదనకు పంపించడం గర్హనీయమన్నారు.

ఎస్సీ డిక్లరేషన్ అమలుపై బీజేపీ ఎస్సీ మోర్చా ఆందోళన

• 5,6,7 తేదీల్లో ఎమ్మార్వో ఆఫీసుల ఎదుట నిరసనలకు పిలుపు

సాక్షి,హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ చేవెళ్లలో చేసిన ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు చేయాలని డిమాండ్ చేస్తూ...ఈ నెల 5, 6, 7 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనలకు బీజేపీ ఎస్సీ మోర్చా పిలుపునిచ్చింది. రాష్ట్ర బడ్జెట్‌లో 'తెలంగాణ ఎస్సీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్'లో సుమారు రూ.3,500 కోట్లు కోత విధించడాన్ని తప్పు బట్టింది. ఎన్నికలకు ముందు ప్రకటించిన (అంబేడ్కర్ అభయహస్తం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి రుణాలు, షెడ్యూల్డ్ కులాల సాంఘిక సంక్షేమ వసతి గృహాల పునఃనిర్మాణం మొదలైన అంశాలు) వంటి వాటికి కేటాయింపులు చేయకపోవడం పట్ల మండిపడింది. ప్రభుత్వపరంగా సానుకూలం స్పందన రాని పక్షంలో...ఈ నెల 17న చేవెళ్లలో మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించింది. శనివారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీలో పార్టీనేతలు బంగారు శ్రుతి, డా.జి. మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కేలండర్‌పై రాజకీయం సిగ్గుచేటు

• రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల పాలనలో ఉద్యోగ నియామకాలను తుంగలో తొక్కిన బీఆర్ఎస్ పార్టీ నేతలు, కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ కేలండర్‌పై రాజకీయం చేయడం సిగ్గుచేటని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ వ్యాఖ్యానించారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధులు చనగాని దయాకర్, లింగం యాదవ్‌లతో కలసి ఆయన మాట్లాడుతూ ఉద్యోగాలు భర్తీ చేయలేని వారు కూడా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కేటీఆర్ ఏ లైబ్రరీకి వస్తారో చెప్తే తాము కూడా వస్తామని, అక్కడే ఉద్యోగాల భర్తీపై చర్చిద్దామని అన్నారు. దయాకర్ మాట్లాడుతూ నిరుద్యోగుల గురించి ఆలోచన చేసిన తర్వాతే సీఎం రేవంత్‌రెడ్డి జాబ్ కేలండర్ విడుదలకు నిర్ణయం తీసుకున్నారన్నారు. లింగం యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ద్రోహం చేసిందన్నారు.

పొలంలోనే కుప్పకూలిన రైతు

• వరద కాలువ కోసం పొలాన్ని సర్వే చేసిన అధికారులు
• భూమి పోతుందని బెంగపెట్టుకుని గుండెపోటుతో మృతి


మొండయ్య

హుస్నాబాద్: పొలం పనులు చేస్తున్న క్రమంలో ఓ రైతు గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన తిప్పట్ల మొండయ్య (58)కు వ్యవసాయమే జీవనాధారం. తనకు 27 గుంటల భూమి ఉంది. ఇందులో నుంచి కొంతభాగం వరద కాలువ కోసం ఇటీవల అధికారులు భూమిని సర్వే చేశారు. ఉన్న భూమి కాలువలో పోతే ఎలా బతకాలని బెంగ పెట్టుకున్నాడు. ఉదయం ఎప్పటిలాగే మొండయ్య పొలం పనులు చేస్తుండగానే గుండెపోటు వచ్చి కుప్పకూలిపోయాడు. పక్కనే పనిచేస్తున్న వారు గమనించి వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించగా మొండయ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

బాలుడిపై వీధికుక్క దాడి

మేడ్చల్: పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో ఇంటిముందు ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల బాలుడిని వీధికుక్క కరిచి గాయపరిచింది. మండలంలోని రాయిలాపూర్‌కు చెందిన రమేశ్ పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో నివసిస్తున్నాడు. రమేశ్ కుమారుడు చరణ్ (8) శనివారం ఉదయం తమ ఇంటిముందు ఉండగా.. అటు వెళ్తున్న కుక్క దాడి చేసింది. బాలుడి మర్మాంగాలపై కరిచి గాయపరిచింది. దీంతో బాలుడిని వెంటనే పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయితే, బాలుడికి చికిత్స విషయంలో ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వహించారని, డీఎంఅండ్‌హెచ్‌వో, అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చరణ్ తల్లిదండ్రులు తెలిపారు.

గోదావరి బోర్డు సమావేశం 13కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఏపీ ప్రభుత్వ విజ్ఞప్తితో ఈ నెల 6న జరగాల్సిన గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం 13వ తేదీకి వాయిదా పడింది. గోదావరిపై తెలంగాణ నిర్మిస్తున్న సమ్మక్కసాగర్, సీతమ్మసాగర్ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన డీపీఆర్‌లకు అనుమతుల జారీపై ఈ సమావేశంలో చర్చించి, కేంద్ర జలసంఘం ఆమోదం కోసం పంపించాల్సి ఉంది. ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ (జనరల్) పదవీ విరమణ చేయనుండటంతో పాటు ఈ ప్రాజెక్టులపై ఏపీ ప్రభుత్వ అభిప్రాయాన్ని తెలుసుకోవాల్సి ఉన్న నేపథ్యంలో సమావేశాన్ని సెప్టెంబర్ తొలివారానికి వాయిదా వేయాలని ఆ రాష్ట్ర జలవనరుల శాఖ విజ్ఞప్తి చేసింది. అయినప్పటికీ 13వ తేదీకి వాయిదావేస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది.

9న గోదావరి–కావేరీ అనుసంధానంపై సమావేశం

గోదావరి–కావేరీ నదుల అనుసంధానంపై తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలపై చర్చించడానికి ఈనెల 9న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని జలసౌధలో నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఎన్‌డబ్ల్యూడీఏ) సమావేశం జరగనుంది. ప్రాజెక్టు డీపీఆర్‌పై తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలపై చర్చించనున్నారు. గోదావరిపై ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మించి నీటిని తరలించాలని ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించగా, తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఇచ్చంపల్లి వద్ద బరాజ్ కడితే 24 కిలోమీటర్ల దిగువన తుపాకులగూడెం (సమ్మక్క సాగర్) బరాజ్ వద్ద వరదలను నియంత్రించడం సాధ్యం కాదని తెలంగాణ వాదిస్తోంది. సమ్మక్కసాగర్ నుంచి నీటిని తరలించి నదుల అనుసంధానం చేపట్టాలని కోరుతోంది.

యుద్ధమేఘాలు!

మధ్య ప్రాచ్యానికి తరలుతున్న అమెరికా విమానవాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్



క్షిపణి దాడిలోనే హనియె చనిపోయారు

- ఇరాన్ వెల్లడి
- ప్రతీకారం తప్పదని ఇజ్రాయెల్‌కు హెచ్చరిక

జెరూసలేం: హమాస్ రాజకీయ విభాగం చీఫ్ ఇస్మాయిల్ హనియె మృతికి స్వల్ప శ్రేణి క్షిపణి దాడే కారణమని ఇరాన్ సైన్యంలో అత్యంత కీలకమైన రివల్యూషనరీ గార్డ్స్ విభాగం ప్రకటించింది. అమెరికా మద్దతుతోనే ఇజ్రాయెల్ ఈ దాడికి తెగబడిందని శనివారం ఆరోపించింది. ''హనియె బస చేసిన భవనాన్ని 7 కిలోల బరువున్న పేలుడు పదార్థంతో కూడిన రాకెట్ తాకింది. దాంతో భవనం ధ్వంసమైంది'' అని తెలిపింది. యుద్ధోన్మాద ఇజ్రాయెల్‌కు తగు సమయంలో తగు రీతిలో దీటుగా బుద్ధి చెబుతామని హెచ్చరించింది. అయితే దాడి జరిగిన ప్రాంతం తదితరాలకు సంబంధించిన వివరాలను మాత్రం వెల్లడించలేదు.

మధ్యప్రాచ్యంలో అమెరికా భారీ మోహరింపులు

- భారీ యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్ల తరలింపు

టెల్‌అవీవ్/వాషింగ్టన్: పశ్చిమాసియాపై యుద్ధమేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నాయి. హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియె హత్య, అందుకు దీటైన ప్రతీకారం తప్పదన్న ఇరాన్ హెచ్చరికలు అగ్గి రాజేశాయి. ఇజ్రాయెల్‌పై ఇరాన్ దూకుడు చర్యలకు దిగితే అడ్డుకునేందుకు అమెరికా అదనపు యుద్ధ నౌకలు, బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ క్రూయిజర్లు, డిస్ట్రాయర్లు, ఎఫ్–22 ఫైటర్ జెట్ స్క్వాడ్రన్‌ను మధ్యప్రాచ్యానికి తరలిస్తోంది. పసిఫిక్ సముద్రంలో ఉన్న విమానవాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌ను కూడా తరలించాల్సిందిగా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ఆదేశించారు. మిసైల్ డిఫెన్స్ బలగాలకు కూడా సర్వసన్నద్ధంగా ఉండాలంటూ ఆదేశాలు వెళ్లాయి. ఇరాన్ సమీపంలో భూతల బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థలను మోహరించే ప్రయత్నాలు కూడా జోరందుకున్నాయి. 40 ఎఫ్ఏ–18 సూపర్ హార్నెట్, ఎఫ్–35 అటాక్ ప్లేన్లతో కూడిన విమానవాహక నౌక థియోడర్ రూజ్‌వెల్ట్ అరేబియా తీర సమీపంలో; 30 యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, 4,500 మంది మరైన్లు, నావికా దళ సభ్యులతో కూడిన యూఎస్ఎస్ వాస్ప్ కూడా తూర్పు మధ్యధరా సముద్రంలో పహారా కాస్తున్నాయి.

మరో హమాస్ నేత హతం

శనివారం గాజాపై వైమానిక దాడుల్లో హమాస్ సైనిక విభాగ కీలక నేత హైథమ్ బలిదీతో పాటు డజన్లకొద్దీ పాలస్తీనియన్లు మరణించినట్టు సమాచారం. వెస్ట్‌బ్యాంక్‌లో 9 మంది పాలస్తీనా తీవ్రవాదులను మట్టుబెట్టినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది.

ఇజ్రాయెల్ కోసం ఎందాకైనా: అమెరికా

ఇజ్రాయెల్‌కు దన్నుగా నిలిచేందుకు అవసరమైతే మరిన్ని చర్యలూ చేపడతామని పెంటగాన్ తాజాగా ప్రకటించింది. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణ నెలకొనడం ఈ ఏడాది ఇప్పటికే ఇది రెండోసారి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ దేశవ్యాప్త హై అలర్ట్ ప్రకటించింది. అయితే ఉద్రిక్తలు పెరగడం ఎవరికీ మంచిది కాదని పెంటగాన్ అధికార ప్రతినిధి సబ్రీనాసింగ్ అన్నారు. మధ్యప్రాచ్యంలో తాజా పరిస్థితులపై ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యొవ్ గాలంట్‌తో లాయిడ్‌సుదీర్ఘంగా ఫోన్లో మాట్లాడినట్టు తెలిపారు.

ఆరు ప్రాణాలు నిలబెట్టారు

వయనాడ్‌లో కొండ గుహలో చిక్కుకున్న గిరిజన కుటుంబం

- ఐదు రోజులుతిండిలేక నలుగురు చిన్నారులు, తల్లిదండ్రులు విలవిల
- ఎనిమిది గంటలు శ్రమించి రక్షించిన కేరళ అటవీ సిబ్బంది



బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మోహన్‌లాల్

వయనాడ్: దట్టమైన అడవిలో అదొక కొండ గుహ.. చుట్టూ చిమ్మచీకటి.. ఒకటి నుంచి నాలుగేళ్ల వయసున్న నలుగురు చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఐదు రోజులపాటు అక్కడే తలదాచుకున్నారు. తాగడానికి వర్షపు నీరు తప్ప తినడానికి తిండి లేదు. ఆకలితో అలమటించిపోయారు. అటవీ సిబ్బంది 8 గంటలపాటు శ్రమించి ఆ కుటుంబాన్ని రక్షించారు. ఆరుగురి ప్రాణాలను కాపాడారు. కేరళలో వరద బీభత్సానికి సాక్షిగా నిలిచిన వయనాడ్ జిల్లాలోని అట్టమల అడవిలో జరిగిన ఈ సాహసోపేతమైన ఆపరేషన్ తాలూకు వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అటవీ సిబ్బందే అసలైన హీరోలంటూ జనం ప్రశంసిస్తున్నారు.

వయనాడ్‌లో పనియా జాతి గిరిజనులు అధికంగా ఉంటారు. ఇతర సామాజికవర్గాలకు దూరంగా జీవిస్తుంటారు. అటవీ ఉత్పత్తులను విక్రయించి జీవనోపాధి పొందుతుంటారు. అందుకోసం గిరిజన దంపతులు నలుగురు పిల్లలను వెంట తీసుకుని కొండల్లోకి వెళ్లారు. భీకర వర్షం మొదలవడంతో కొండ గుహలో తలదాచుకున్నారు. వర్షం తగ్గకపోవడం, కొండచరియలు విరిగిపడుతుండడంతో కిందికొచ్చే సాహసం చేయలేకపోయారు. ఆహారం కోసం వెతుకుతూ తల్లి ఐదు రోజుల తర్వాత కిందికి రావడంతో అధికారులు గమనించారు. గుహలో నలుగురు పిల్లలు, భర్త ఉన్నారని చెప్పడంతో అటవీ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. భారీ వర్షం, అడుగడుగునా రాళ్లు, బురదలో అడుగువేయడమే కష్టమవుతున్నా గుహకు చేరుకున్నారు. ముందుగా ఆకలితో నీరసించిపోయిన చిన్నారుల కడుపు నింపారు. వాళ్లను తాళ్లతో తమ ఒంటికి కట్టుకొని జాగ్రత్తగా తీసుకొచ్చారు. ఆ క్రమంలో కొండపై నుంచి తాళ్ల సాయంతో దిగాల్సి వచ్చింది. ఆ ఫొటోలను సోషల్ మీడియాలో జనం విపరీతంగా షేర్ చేశారు.

350 మందికిపైగా మృతులు!

వయనాడ్ విపత్తు మృతుల సంఖ్య 350 దాటినట్లు తెలుస్తోంది. శనివారం అధికారులు మాత్రం 218 మంది చనిపోయినట్లు వెల్లడించారు. నిర్వాసితులకు సురక్షిత ప్రాంతంలో టౌన్‌షిప్ ఏర్పాటుచేసి ఇళ్లు కట్టిస్తామని సీఎం పినరయి విజయన్ చెప్పారు. ప్రకటించారు.

మోహన్ లాల్ రూ.3 కోట్ల విరాళం

ప్రముఖ సినీ నటుడు మోహన్‌లాల్ శనివారం వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. భారత ప్రాదేశిక సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్ హోదా ఉన్న ఆయన బాధితులను పరామర్శించారు. సహాయక సిబ్బంది సేవలను కొనియాడారు. వరద విలయానికి నామరూపాల్లేకుండాపోయిన నివాసాలను చూసి చలించిపోయారు. పునరావాస చర్యలకు రూ.3 కోట్ల విరాళం ప్రకటించారు.



5 రోజులుగా గుహలో చిక్కిన చిన్నారులను సురక్షితంగా తీసుకొస్తున్న సిబ్బంది

న్యాయప్రక్రియతో జనం విసుగెత్తిపోయారు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్



న్యూఢిల్లీ: దేశంలో కోర్టులకు సంబంధించిన వ్యవహారాలు, సుదీర్ఘంగా సాగే న్యాయ వ్యవస్థ ప్రక్రియతో ప్రజలు విసుగెత్తిపోయారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. వివాదాల పరిష్కారానికి లోక్ అదాలత్‌లు చక్కటి ప్రత్యామ్నాయ వేదికలని చెప్పారు. వాటిని ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించారు. శనివారం సుప్రీంకోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్ వారోత్సవంలో ఆయన మాట్లాడారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాలను, కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకొనే అవకాశం ఉందని, ఇరుపక్షాల అంగీకారంతో రాజీ పడొచ్చని వెల్లడించారు. న్యాయస్థానాల్లో న్యాయం చేకూర్చే ప్రక్రియ కక్షిదారులకు ఒక శిక్షగా మారిపోయిందని, ఇది నిజంగా న్యాయమూర్తులకు ఆందోళన కలిగించే విషయమని జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలని ఆకాంక్షించారు.

బీజేపీ అధికార జిహాద్‌కు పాల్పడుతోంది: ఉద్ధవ్



పుణే: ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు రాజకీయ పార్టీలను చీల్చడం వంటి చర్యలతో కేంద్రంలోని బీజేపీ అధికార జిహాద్‌కు పాల్పడుతోందని శివసేన(యూబీటీ) ఉద్ధవ్ ఠాక్రే మండిపడ్డారు. శనివారం ఆయన పుణేలో జరిగిన పార్టీ ర్యాలీలో మాట్లాడారు. ఈ సందర్భంగా తనను ఔరంగ జేబ్ ఫ్యాన్ క్లబ్ అధ్యక్షుడంటూ గత నెలలో హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఆ బీజేపీ అగ్ర నేత అఫ్గాన్ రాజు అహ్మద్ షా అబ్దాలీ రాజకీయ వారసుడంటూ ఎద్దేవా చేశారు. మూడో పానిపట్ యుద్ధంలో మరాఠాలను అబ్దాలీ ఓడించాడు. మరోవైపు మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఫడ్నవీస్‌నూ ఉద్ధవ్ పరోక్షంగా హెచ్చరించారు. 'రాజకీయాల్లో నువ్వైనా ఉండాలి, లేదా నేనైనా ఉండాలి..తేల్చుకుందాం'అంటూ సవాల్ విసిరారు. 'కొందరు నేను సవాల్ విసిరానని అనుకుంటున్నారు. నల్లులతో సవాల్ చేయాల్సిన అవసరమే లేదు. వాటిని నలిపేస్తాను'అని అన్నారు.

ట్రంప్‌కు భద్రత కల్పించడంలో విఫలమయ్యాం

అమెరికా సీక్రెట్ సర్వీస్ విభాగం ఒప్పుకోలు



కింబర్లీ చియాటిల్

వాషింగ్టన్: పెన్సిల్వేనియాలో జూలై 13వ తేదీన ఎన్నికల ర్యాలీ సమయంలో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం ఘటన తమ వైఫల్యమేనని అమెరికా సీక్రెట్ సర్వీస్ విభాగం పేర్కొంది. ఆయనకు భద్రత కల్పించడంలో వైఫల్యానికి తమదే బాధ్యతని తెలిపింది. బట్లర్ ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తున్న ట్రంప్‌పై ఓ యువకుడు కాల్పులకు పాల్పడటం తెల్సిందే. ఆ ఘటన నుంచి ఆయన త్రుటిలో తప్పించుకున్నారు. ఒక బుల్లెట్ మిల్లీమీటర్ దూరం నుంచి దూసుకెళ్లగా, మరో బుల్లెట్ ఆయన చెవిని గాయపర్చింది. అప్పటి ఘటనకు బాధ్యత వహిస్తూ సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ కింబర్లీ చియాటిల్ రాజీనామా చేయగా, ఆమె స్థానంలో రొనాల్డ్ రోవె తాత్కాలిక డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

పంజాబ్ సీఎం పారిస్ యాత్రకు కేంద్రం నిరాకరణ



చండీగఢ్: పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ ఫ్రాన్స్ వెళ్లేందుకు కేంద్రం అనుమతివ్వలేదని అధికార వర్గాలు తెలిపాయి. ఒలింపిక్స్‌లో ఆడే భారత హాకీ జట్టుకు మద్దతు తెలిపేందుకు ఆయన పారిస్ వెళ్లాలనుకున్నట్టు వివరించాయి. ''ఆగస్టు 3 నుంచి 9 దాకా పారిస్ వెళ్లేందుకు మాన్ అనుమతి కోరారు. జెడ్‌ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న మాన్‌కు ఇంత త్వరగా ఆ స్థాయి భద్రతను కల్పించడం అసాధ్యమని శుక్రవారం కేంద్రం సమాచారమిచ్చిందన్నారు. ఆగస్టు 4 నుంచి 7 దాకా అమెరికాలోని కెంటకీలో జరిగే అసెంబ్లీ స్పీకర్ల సదస్సులో పాల్గొనేందుకు తనకు కూడా కేంద్రం అనుమతివ్వలేదని పంజాబ్ అసెంబ్లీ స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వాన్ చెప్పారు. తనతోపాటు కర్ణాటక, కేరళ, హిమాచల్ స్పీకర్లకు అనుమతి నిరాకరించిన కేంద్రం మేఘాలయ స్పీకర్‌కు మాత్రం ఓకే చెప్పిందన్నారు.

9/11 దాడుల సూత్రధారి నేరాంగీకార ఒప్పందం తిరస్కరించిన రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్

అవి మరణశిక్ష కేసులేనని స్పష్టీకరణ



9/11 ప్రధాన సూత్రధారి ఖాలిద్ షేక్ మహ్మద్

వాషింగ్టన్: సుమారు 3 వేల మందిని బలి తీసుకున్న 2001, సెప్టెంబర్ 11 దాడులకు పథకం వేసిన ఖాలిద్ షేక్ మహ్మద్ పెట్టుకున్న నేరాంగీకార ఒప్పందాన్ని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ తోసిపుచ్చారు. వీరిపై కేసులను మరణ శిక్ష విధించిన కేసులుగా తిరిగి పునరుద్ధరించే ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ఖాలిద్ షేక్, అతడి అనుచరులు వాలిద్ బిన్ అట్టాష్, ముస్తాఫా అల్ హౌసవిలు ప్రస్తుతం గ్వాంటానమో బే జైల్లో ఉన్నారు. అప్పటి దాడులకు తమదే బాధ్యతంటూ వీరు పెట్టుకున్న అర్జీని అక్కడి యుద్ధ నేరాలను విచారించే కోర్టు జడ్జి సుసాన్ ఎస్కల్లియర్ ఆమోదించారు. ఈ ఒప్పందం మేరకు వీరిపై ఉన్న మరణశిక్ష యావజ్జీవంగా మారేందుకు మార్గం ఏర్పడింది. ఈ మేరకు అప్పటి ఘటనలో చనిపోయిన మూడు వేల మంది కుటుంబాలకు ఉత్తరాలు పంపారు. దీనిపై బాధిత కుటుంబాలతోపాటు ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ మండిపడింది. ఆ ముగ్గురికీ మరణ శిక్ష పడాల్సిందేనని పట్టుబట్టింది. దీంతో మంత్రి ఆస్టిన్ రంగంలోకి దిగారు. తాజా పరిణామపు ప్రాధాన్యం దృష్ట్యా తుది నిర్ణయం తీసుకునే అధికారం తనకుందంటూ, ఆ ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

సోమాలియాలో ఉగ్రదాడి.. 32 మంది మృతి

మొగదిషు: సోమాలియా రాజధాని మొగదిషులో హోటల్‌పై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 32 మంది చనిపోగా మరో 63 మంది గాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం లిడో బీచ్‌లోని హోటల్ సమీపంలో ఆత్మాహుతి బాంబర్ తనను పేల్చేసుకున్నాడు. అనంతరం ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడ్డారు. ఒక జవాను మృతి చెందగా, మరొకరు గాయపడ్డారని అధికారులు తెలిపారు. మిగతా బాధితులంతా సామాన్యు లేనన్నారు. ఇది తమ పనేనని అల్‌కాయిదా అనుబంధ అల్ షబాబ్ ప్రకటించుకుంది.

మీరే సంధానకర్తలు

గవర్నర్ల సదస్సులో రాష్ట్రపతి

న్యూఢిల్లీ: కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య గవర్నర్లు అనుసంధానకర్తలుగా వ్యవహరించాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సూచించారు. శనివారం ముగిసిన గవర్నర్ల రెండు రోజుల సదస్సులో ఆమె ప్రసంగించారు. శాఖల మధ్య మరింత సమన్వయానికి చర్యలపై సదస్సులో చర్చించినట్టు రాష్ట్రపతి భవన్ పేర్కొంది. మెరుగైన పనితీరుకు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సమాచారాన్ని పొందేందుకు, నిరంతర సంప్రదింపులకు సాగించడంలో గవర్నర్లు సంశయించరాదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సూచించారు. రాజ్‌భవన్‌లలో ఆదర్శ పాలనా నమూనాను రూపొందించడానికి గవర్నర్లు కృషి చేయాలని ప్రధాని మోదీ సూచించారు. గవర్నర్లు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, డిజిటైజేషన్‌ను ప్రోత్సహించాలని కోరారు.


కోల్‌కతాను ముంచెత్తిన వానలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. తీవ్ర అల్పపీడనం కారణంగా శనివారం కురిసిన భారీ వర్షాలతో కోల్‌కతాతోపాటు పరిసర హౌరా, సాల్ట్‌లేక్, బారక్‌పోర్‌ల్లోని పలుప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. అయితే, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడలేదని అధికారులు తెలిపారు. కోల్‌కతా విమానాశ్రయం లోపల కూడా నీరు నిల్చినప్పటికీ విమాన సర్వీసులు కొనసాగాయన్నారు. పార్కింగ్ ప్రాంతాల్లో నిల్చిన నీటిని పంపులతో తోడి వేసినట్లు చెప్పారు. వచ్చే 24 గంటలు కూడా విస్తారంగా వానలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమ్ బర్ధమాన్ జిల్లాలో కాజీ నజ్రుల్ ఇస్లాం విమానాశ్రయంలో భారీగా వాన నీరు చేరడంతో రాకపోకలను నిలిపేశారు.

ఆహార మిగులు దేశంగా భారత్

అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థికవేత్తల సదస్సులో మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: భారత్ ఆహార మిగులు దేశంగా మారిందని, ప్రపంచ ఆహార, పౌష్టికాహార భద్రతకు పరిష్కారాలను అందించేందుకు కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. భారత ఆర్థిక విధానాలకు వ్యవసాయమే కేంద్ర బిందువని, ఆహార భద్రతకు చిన్న రైతులే అతి పెద్ద బలమని స్పష్టంచేశారు. శనివారం ఢిల్లీలో 32వ అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థికవేత్తల సదస్సులో ఆయన మాట్లాడారు. 65 ఏళ్ల క్రితం వ్యవసాయ రంగంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్న భారత్ నేడు ఆహార మిగులు దేశంగా మారిందని హర్షం వ్యక్తం చేశారు. పాలు, పప్పులు, సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిలో ప్రపంచంలో అగ్రస్థానంలో ఉందని, ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పత్తి, చక్కెర, టీ, చేపల ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉందని



తెలిపారు. ప్రపంచ సంక్షేమానికి భారత్‌ను 'విశ్వ బంధు'గా అభివర్ణించారు.

ప్రకృతి సాగుతో సానుకూల ఫలితాలు

ప్రకృతి వ్యవసాయాన్ని భారీగా ప్రోత్సహించడంతో దేశంలో సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయని మోదీ తెలిపారు. సుస్థిరమైన, ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోగల సాగు విధానాలపై ఈ బడ్జెట్‌లో ప్రత్యేకంగా దృష్టి పెట్టామన్నారు. పంటల పరిశోధన, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. గడిచిన పదేళ్లలో భిన్న వాతావరణ పరిస్థితులను తట్టుకోగలిగే దాదాపు 1,900 కొత్త వంగడాలను రైతులకు అందజేసినట్లు చెప్పారు. సాంప్రదాయ రకాల కంటే 25 శాతం తక్కువ నీరు అవసరమయ్యే వరి రకాలను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. భారత తృణధాన్యాల బుట్టను ప్రపంచంతో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

సాంకేతికత పరిజ్ఞానంతో అనుసంధానం

వ్యవసాయాన్ని ఆధునిక సాంకేతికత పరిజ్ఞానంతో అనుసంధానిస్తున్నామని మోదీ వెల్లడించారు. సోలార్ ఫార్మింగ్ మొదలుకుని ఈ–నామ్ తదితరాలను ఉదాహరించారు. సంప్రదాయ రైతుల నుండి అగ్రికల్చర్ స్టార్టప్‌ల వరకు, సహజ వ్యవసాయం నుండి ఫార్మ్ వ్యవసాయం వరకు వివిధ వ్యవసాయ, అనుబంధ రంగాల ఆధునీకరణ గురించి వివరించారు. పదేళ్లలో 90 లక్షల హెక్టార్లను మైక్రో ఇరిగేషన్ కిందకు తీసుకొచ్చామన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఒక్క క్లిక్‌తో 10 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాలకు డబ్బు బదిలీ చేస్తున్నామన్నారు. పంటల సర్వే కోసం డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తెచ్చామని చెప్పారు. తమ ప్రభుత్వం చేపట్టిన ఆధునిక చర్యలు భారతదేశంలోని రైతులకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా ప్రపంచ ఆహార భద్రతను బలోపేతం చేస్తాయన్నారు. అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థికవేత్తల సదస్సుకు 70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ సదస్సు జరుగుతుంది.

'ఫాక్స్'లో అయితేనే డిబేట్!

- ఏబీసీకి రాను: ట్రంప్ మెలిక
- ఇదెక్కడి పలాయనవాదం?
- దుయ్యబట్టిన హారిస్ వర్గం



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థులైన డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ మధ్య అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రెసిడెన్షియల్ డిబేట్ జరిగే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. సెప్టెంబర్ 10న ఏబీసీ చానల్లో హారిస్‌తో జరగాల్సిన డిబేట్ నుంచి తప్పుకుంటున్నట్టు ట్రంప్ ప్రకటించారు. ''నిజానికది జో బైడెన్‌తో జరగాల్సిన డిబేట్. ఆయన ఎన్నికల బరి నుంచి తప్పుకున్నందున ఆ డిబేట్ కూడా రద్దయినట్టే'' అని వాదించారు. ఈ మేరకు సొంత సోషల్ మీడియా హాండిల్ 'ట్రూత్'లో తాజాగా ట్రంప్ పలు పోస్టులు పెట్టారు. ఫాక్స్ న్యూస్ చానల్లో అయితేనే డిబేట్‌కు వస్తానంటూ మెలిక పెట్టారు. ''సెప్టెంబర్ 4న పెన్సిల్వేనియాలో ఫాక్స్ స్టూడియోలో హారిస్ చర్చకు రావాలి. ఖాళీ స్టూడియోలో కాకుండా కిక్కిరిసిన ప్రేక్షకుల నడుమ డిబేట్ చేద్దాం'' అని సవాలు విసిరారు. దీనిపై హారిస్ వర్గం మండిపడింది. పిరికితనంతో డిబేట్ నుంచి ట్రంప్ పారిపోతున్నారంటూ ఎద్దేవా చేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ రాకపోయినా కేవలం హారిస్‌తో ఏబీసీ డిబేట్ కొనసాగుతుందా అన్నది చూడాల్సి ఉంది. డెమొక్రాట్ల తరఫున అధ్యక్షుడు బైడెన్‌కు బదులు హారిస్ అధ్యక్ష రేసులో అడుగు పెట్టినప్పటి నుంచీ ఆమెతో డిబేట్‌కు ట్రంప్ వెనకా ముందాడుతూ వస్తున్నారు. తామిద్దరి గురించీ అమెరికన్లకు ఇప్పటికే అంతా తెలుసంటూ వ్యాఖ్యలు చేశారు. కానీ తనతో డిబేట్‌కు రావాల్సిందేనని హారిస్ పట్టుబడుతున్నారు.

గూగుల్‌పై ట్రంప్ మండిపాటు

తన వార్తలను, ఫొటోలను గూగుల్ సెన్సార్ చేస్తోందని, ప్రజలకు వాస్తవాలు చేరనివ్వడం లేదని ట్రంప్ మండిపడ్డారు. తనకు సంబంధించిన వార్తలను, సమాచారాన్ని ఫేసుబుక్‌లో సెన్సార్ చేసినందుకు సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ తనకు క్షమాపణ చెప్పారన్నారు.

అల్లుడ్ని కాల్చి చంపిన రిటైర్డ్ ఐపీఎస్

కోర్టు సముదాయంలోనే ఘటన

చండీగఢ్: పంజాబ్‌లో మాల్వీందర్ సింగ్ సిద్ధు అనే మాజీ ఐపీఎస్ అధికారి దారుణానికి పాల్పడ్డారు. సొంత అల్లున్ని కోర్టు ఆవరణలోనే కాల్చి చంపారు. మాల్వీందర్ కుమార్తె, ఐసీఏఎస్ అధికారి హర్‌ప్రీత్ సింగ్ దంపతుల మధ్య విడాకుల వ్యవహారం నడుస్తోంది. రెండు కుటుంబాలు శనివారం చండీగఢ్ జిల్లా కోర్టు సముదాయానికి వచ్చారు. వాష్ రూం చూపించాలంటూ హర్‌ప్రీత్‌ను మాల్వీందర్ పక్కకు తీసుకెళ్లారు. ఒక్కసారిగా కాల్పులకు దిగడంతో హర్‌ప్రీత్ అక్కడికక్కడే చనిపోయారు. పోలీసులు మాల్వీందర్‌ను అరెస్ట్ చేసి, తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

9 నుంచి 15 వరకు 'హర్ ఘర్ తిరంగా'

ఇళ్ల వద్ద జాతీయ జెండా ఎగురవేయాలని అమిత్ షా పిలుపు



సాక్షి, న్యూఢిల్లీ: 'హర్ ఘర్ తిరంగా'ప్రచారంలో భాగంగా ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు ప్రతీ ఒక్కరూ తమ ఇళ్ల వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతేగాక ప్రజలు త్రివర్ణ పతాకంతో దిగిన సెల్ఫీలను 'హర్ ఘర్ తిరంగా'వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని శనివారం ఆయన 'ఎక్స్'లో కోరారు. ప్రధాని మోదీ ప్రారంభించిన హర్ ఘర్ తిరంగా ప్రచారం రెండేళ్లలో జాతీయ ఉద్యమంగా మారిందని అమిత్ షా పేర్కొన్నారు.

కేదార్‌నాథ్‌లో సాగుతున్న సహాయక చర్యలు

సురక్షిత ప్రాంతాలకు 10 వేల మంది తరలింపు

రుద్రప్రయాగ్/సిమ్లా: ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో చిక్కుకుపోయిన తీర్థయాత్రికుల కోసం మూడు రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 10,500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కేదార్‌నాథ్, భింబలి, గౌరీకుండ్‌ల్లో చిక్కుకుపోయిన మరో 1,500 మందిని బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. వారంతా సురక్షితంగానే ఉన్నారని స్పష్టం చేసింది. యాత్రికులను తరలించేందుకు వైమానిక దళం చినూక్, ఎంఐ–17 హెలికాప్టర్లను శుక్రవారం రంగంలోకి దించింది. పర్వత మార్గంలో కుండపోతగా కురిసిన వర్షాల కారణంగా పలువురు గల్లంతైనట్లు వస్తున్న వార్తలను అధికారులు ఖండించారు. శుక్రవారం లించోలిలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తిని యూపీలోని సహరాన్‌పూర్‌కు చెందిన శుభమ్ కశ్యప్‌గా గుర్తించారు. భారీ వర్షాల కారణంగా గౌరీకుండ్–కేదార్‌నాథ్ ట్రెక్కింగ్ మార్గంలో 25 మీటర్ల మేర రహదారి కొట్టుకుపోయింది. అడ్డంకులను తొలగించి, రహదారిని పునరుద్ధరించే వరకు వేచి ఉండాలని రుద్రప్రయాగ్ యంత్రాంగం యాత్రికులను కోరింది.

హిమాచల్‌లో ఆ 45 మంది కోసం గాలింపు

హిమాచల్ ప్రదేశ్‌లోని కులు, సిమ్లా, మండి జిల్లాల్లో వరద బీభత్సంలో గల్లంతైన 45 మంది కోసం గాలింపు కొనసాగుతోంది. మండి జిల్లా రాజ్‌బన్ గ్రామంలో రాతి కింద చిక్కుకున్న వ్యక్తిని గుర్తించారు. కులు జిల్లా సమెజ్ గ్రామంలో గల్లంతైన పోయిన 30 మంది కోసం డ్రోన్ల సాయంతో గాలిస్తున్నారన్నారు. శ్రీఖండ్ మహాదేవ్ ఆలయంలో చిక్కిన 300 మంది, మలానాలో చిక్కుకున్న 25 మంది పర్యాటకులు క్షేమంగా ఉన్నారని అధికారులు చెప్పారు.

కేదార్‌నాథ్ యాత్రికులను సురక్షితంగా తరలిస్తున్న భద్రతా సిబ్బంది



దేశవ్యాప్తంగా పెరిగిన ఖరీఫ్ సాగు



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం పెరిగిందని కేంద్ర వ్యవసాయ శాఖ తెలిపింది. వరి, పప్పులు, పెసర, రాగి, మొక్కజొన్న, నూనెగింజలు, చెరకు తదితర పంటలు కలిపి ఈ ఏడాది ఇప్పటి వరకు 904 లక్షల హెక్టార్లలో సాగైనట్లు ఓ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది ఇదే సమయానికి 879.22 లక్షల హెక్టార్లలోనే రైతులు పంటలను సాగు చేశారని పేర్కొంది. అదేవిధంగా, గత ఏడాది 263.01 లక్షల హెక్టార్లలో వరి సాగు కాగా ఈ ఏడాది 276.91 హెక్టార్లలో సాగు చేశారు. గతేడాది ఇదే సమయానికి 99.71 లక్షల హెక్టార్లలో పప్పు ధాన్యాలు సాగు జరగ్గా, ఈ ఏడాది 110.61 లక్షల హెక్టార్లకు పెరిగింది. వీటితో పాటు గతేడాది 174.53 లక్షల హెక్టార్లలో నూనెగింజల సాగవగా ఈసారి 179.69 లక్షల హెక్టార్లకు చేరినట్లు కేంద్రం తెలిపింది. గతేడాదితో పోలిస్తే ముతక తృణ ధాన్యాలు, చెరకు సాగు కూడా పెరిగింది. సాగు పెరగడంతో పప్పు, నూనెగింజల ధరలు తగ్గొచ్చని కేంద్రం అంచనా వేస్తోంది.

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 4 । ఆగస్టు । 2024





బుట్టబొమ్మా.. బుట్టబొమ్మా..

భారతీయ శాస్త్రీయ నృత్యాలు, ఒడిస్సీ, భరతనాట్యం, మణిపురి, రవీంద్రనాథ్ ఠాగూర్ శైలి, వివిధ జానపద రూపాలు, కళా ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో అలరించాయి. బెంగాలీ వంటకాలు, చేనేత హస్తకళా ఉత్పత్తులు ఆకట్టుకున్నాయి. శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో 'ఎస్ప్రిర్మితి' పేరుతో రెండ్రోజుల పాటు జరిగే సాంస్కృతిక ప్రదర్శనలను విశ్రాంత ఐఏఎస్ చందనాఖాన్, డాక్టర్ సుధీర్‌కుమార్ చౌదరిలు ప్రారంభించారు. శిల్పారామం, బెంగాలీస్ ఇన్ హైదరాబాద్ సంయుక్తాధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

– మాదాపూర్



ఫరియా హొయలు

తారల తలుక్కు

69వ ఫిల్మ్‌ఫేర్ సౌత్-2024 అవార్డుల ప్రదానోత్సవంలో తారలు తళుక్కున మెరిశారు. టాలీవుడ్, మాలీవుడ్, కోలీవుడ్‌లకు చెందిన పలువురు సినీ తారలు సందడి చేశారు.. కార్యక్రమానికి ఫరియా అబ్దుల్లా, సందీప్ కిషన్ హోస్ట్‌గా వ్యవహరించారు.

- వివరాలు
సిటీ ప్లస్‌లో▸

ఒక్క రోజులో చిక్కిన 309 మంది మందుబాబులు

సాక్షి, సిటీబ్యూరో: ఒక్క రోజులోనే 309 మంది మందుబాబులు పోలీసులకు చిక్కారు. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పోలీసులు వారాంతాల్లో స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ (డీడీ)లు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 2న నిర్వహించిన డీడీలో ఏకంగా 309 మంది నిషాచరులు పట్టుబడ్డారు. ఇందులో 261 మంది ద్విచక్ర వాహనదారులు కాగా.. 11 మంది త్రీవీలర్లు, 36 మంది ఫోర్ వీలర్లు, ఒకరు భారీ వాహనదారులు ఉన్నారు. పోలీసులకు చిక్కిన మందుబాబుల్లో 33 మందిలో బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్‌ట్రేషన్ (బీఏసీ) మోతాదు 200 ఎంజీ/100 ఎంఎల్, 550 ఎంజీ/100 ఎంఎల్‌గా నమోదయింది. ఆయా నిషాచరులను పోలీసులు న్యాయస్థానంలో హాజరుపరిచారు.

కళ్లెదుటే కన్నుమూసిన కుమారుడు

- తండ్రికి తీవ్ర గాయాలు
- రాంగ్ రూట్‌లో వచ్చి కారు బీభత్సం
- బాలుడి దుర్మరణం



శివసూర్య

గోల్కొండ: రాంగ్ రూట్‌లో వచ్చిన కారు ఓ బాలుడి ప్రాణాలను బలిగొన్న ఘటన శనివారం ఉదయం గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గోల్కొండ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంబాగ్‌కు చెందిన రమేష్, సంగీతల కుమారుడు శివసూర్య గోల్కొండ సమీపంలోని తరుణ్ టాలెంట్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం రమేష్ కుమారుడు శివసూర్యను తీసుకొని బైక్‌పై స్కూల్‌కు బయలుదేరారు. ఇంతలో రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు రమేష్ బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్‌తో పాటు శివసూర్యకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి వచ్చి స్పృహ కోల్పోయిన శివసూర్యకు సీపీఆర్ నిర్వహించారు. అనంతరం ఆసుపత్రికి తరలించగా బాలుడు అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కారు నడుపుతున్న శ్రీనాథ్ షేక్‌పేట్ మారుతీనగర్ కాలనీలో ఉంటూ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నట్లు తెలిసింది. స్నేహితులతో కలిసి పార్టీ చేసుకుని కారులో తిరిగి వస్తున్న శ్రీనాథ్ మద్యం మత్తులో ఉన్నాడని ఘటన స్థలంలో ఉన్న ప్రజలు అంటున్నారు. ప్రమాదానికి కారణమైన కారు పల్టీలు కొట్టిందని, మత్తులో ఉన్న శ్రీనాథ్ అత్యంత స్పీడ్‌లో ఉండి అదుపు చేయకపోవడంతోనే ఈ ప్రమాదం సంభవించిందని పోలీసులు చెబుతున్నారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

ప్రత్యక్ష నరకం మీరెప్పుడైనా చవిచూశారా? అయితే.. ఉప్పల్- నారపల్లి రహదారిలో ప్రయాణించండి నరకం ఎలా ఉంటుందో తెలుస్తుంది. ఆరేళ్లుగా వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు, వ్యాపారులు తిప్పలు పడుతూనే ఉన్నారు. వరంగల్ జాతీయ రహదారిలో ఉప్పల్- నారపల్లి మధ్య 6.2 కిలో మీటర్ల మేర చేపట్టిన కారిడార్ ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో నిత్యం నరకాన్ని అనుభవించాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దుమ్మూ ధూళి.. బురద.. కంకర తేలి గుంతలు ఏర్పడి.. వానొస్తే రోడ్డుపై కుంటలను తలపిస్తున్నాయి. ఎక్కడ గొయ్యి ఉందో తెలియక ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుర్గతి పట్టింది. ఆరేళ్లుగా ఈ దురావస్థతోనే ప్రజలు కాలం వెళ్లబుచ్చుతుండటం శాపంలా పరిణమించింది. ఎంతటి దయనీయ పరిస్థితి దాపురించిందో ప్రజాప్రతినిధులు అర్థం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. తమ గోడు ఎవరితో చెప్పుకోవాలో తెలియక కొట్టుమిట్టాడుతున్నారు ఉప్పల్ ఫ్లై ఓవర్ నిర్మాణ బాధితులు. ఇప్పటికైనా ఏళ్లుగా పడుతున్న నరకం నుంచి తమను గట్టెక్కించాలని వేడుకొంటున్నారు.

– ఉప్పల్

6.2 కిలో మీటర్ల మేర గుంతలమయం | కంకర తేలి ఛిద్రమైన రహదారి

అడుగుకో అగాధం.. అంతా వివాదం | అర్ధాంతరంగా ఆగిపోయిన కారిడార్ పనులు

- నిమిషానికి 960–1000 వాహనాల రాకపోకలు
- దుమ్మూ ధూళితో వేలాది కోట్ల రూపాయల వ్యాపారాలకు దెబ్బ
- ఆరేళ్లుగా వాహనదారులు, స్థానికులకు తప్పని తిప్పలు
- ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి



ఛిద్రమైన ఉప్పల్ రహదారి

ఎన్నాళ్లీ నరకం?

ఆరేళ్లుగా పూర్తికాని ఉప్పల్- నారపల్లి ఫ్లైవంతెన

వరంగల్ జాతీయ రహదారిలో ఉప్పల్ నుంచి నారపల్లి వరకు 6.2 కిలో మీటర్ల మేర 148 పిల్లర్లతో ఫ్లై ఓవర్ పనులకు అప్పటి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్ట్ వ్యయం రూ.625 కోట్లు. 2018 జులైలో ప్రారంభమైన పనులు 2020 జూన్‌లో పూర్తి కావాలి. కానీ.. పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో 6.2 కి.మీ మేర రోడ్డంతా గుంతలమయంగా మారింది. దీంతో ప్రజలు, వాహనదారులు నిత్యం ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తున్నారు. ఈ రహదారిలో నిమిషానికి దాదాపు 960 నుంచి 1000 వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఉప్పల్ కూడా ఒకటి. దీంతో రోడ్డు సరిగా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అనేక మంది అమాయకులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు సైతం కోల్పోయిన ఘటనలున్నాయి.

అభివృద్ధి శరవేగం.. ఇటు అధ్వానం..

ఉప్పల్ నుంచి నల్ల చెరువు వరకు రోడ్డుకు ఇరు వైపులా ఉన్న వర్తక, వాణిజ్య దుకాణాలు రోడ్డు వెడల్పు పనులతో తీవ్రంగా నష్టపోయాయి. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నల్ల చెరువు వరకు రోడ్డుకు ఇరువైపులా 450 షాపులు ఉన్నాయి. ఫ్లై ఓవర్ నిర్మాణంతో రోడ్డు సరిగా లేని కారణంగా వ్యాపారాలు పూర్తిగా దెబ్బ తిన్నాయని వ్యాపారులు లబోదిబోమంటున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల జాబితాల్లో ఉప్పల్ మొదటి స్థానంలో ఉంది. ఒకవైపు మెట్రో రైలు.. మినీ శిల్పారామం, స్కైవాక్ వంతెన, ఉప్పల్ టు నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం.. ఇలా ఎటు చూసినా అన్నివిధాలా ఉప్పల్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. కానీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల్లో జాప్యంతో ఇక్కడి ప్రజలు, వాహనదారులు, వ్యాపారులు ఆరేళ్లుగా నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. కేవలం రెండేళ్లలో పూర్తి కావాల్సిన నిర్మాణానికి అనేక అడ్డంకులు రావడంతో పనులు నిలిచి పోయాయి. దీంతో ఇక్కడి ప్రజలకు ఎదురు చూపులే మిగిలాయి.

కాంట్రాక్టు రద్దు చేశారా?

ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల కాంట్రాక్టును గాయత్రీ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ దక్కించుకున్న విషయం విదితమే. కానీ.. పనుల్లో తీవ్ర జాప్యం కారణంగా సదరు సంస్థ గడువులోగా పూర్తి చేయడంలో పూర్తిగా విఫలమైంది. దీంతో సదరు కాంట్రాక్టును ప్రభుత్వం రద్దు చేసినట్లు ప్రకటించింది. మరో సంస్థకు మిగిలిన పనులను అప్పగించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

బిజినెస్ నిల్..

వరంగల్ జాతీయ రహదారి ఉప్పల్ మార్గంలో స్టేషనరీ, వస్త్ర, వాణిజ్య షాపులు, పూజా సామగ్రి, కిరాణా, ఆటోమొబైల్, ఫర్నిచర్, స్వీట్ దుకాణాలు, హోటళ్లు తదితర అనేక వ్యాపారాలు మనుగడ పొందుతున్నాయి. కాగా.. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల కారణంగా దుమ్మూ ధూళితో వ్యాపారాలు దెబ్బ తిన్నాయి. రోడ్లు వేయక పోవడం, విద్యుత్ స్తంభాలను మార్చకపోవడం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచక పోవడంతో వందలాది మంది వ్యాపారులు అవస్థలు పడుతున్నట్లు వర్తక సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



ఉప్పల్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ రద్దీ

ఆరేళ్లుగా వ్యాపారాలు నిల్..



కారిడార్ నిర్మాణ పనులు ప్రారంభించినప్పటి నుంచి రోడ్డు లేక దుమ్ము కొట్టుకుపోవడంతో గిరాకీ లేక అవస్థలు పడుతున్నాం. 90 శాతం గిరాకులు దెబ్బతిన్నాయి. వ్యాపారులమంతా తీవ్రంగా నష్టపోయాం.

– శేఖర్ సింగ్, ఉప్పల్ వర్తక సంఘం ప్రతినిధి


రోడ్డుపైకి రావాలంటే సాహసం చేయాల్సిందే..



ఉప్పల్ రోడ్డు మీదకు రావాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. ఏళ్లుగా పాడైపోయిన రోడ్ల మీద వాహనం నడిపి ఆరోగ్యం పోగొట్టుకోవాల్సి వస్తోంది. ఎవరికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. మా బాధలను పట్టించుకునే వారే లేకుండాపోయారు. స్కూల్ పిల్లలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

– శ్రీనివాస్ గౌడ్, స్కూల్ కరస్పాండెంట్

గత ప్రభుత్వ అశ్రద్ధతోనే..



అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అశ్రద్ధ వల్లనే రోడ్డు ఎటూ కాకుండా పోయింది. ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పని చేయాలి. కాని పార్టీలను దృష్టిలో పెట్టుకుని కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరితగతిన ముందుకు వచ్చి నిర్ణయం తీసుకోవాలి.

– మేకల శివారెడ్డి, ఉప్పల్ పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్

తాగునీటికి బేఫికర్!

జలాశయాల్లో సమృద్ధిగా నీరు

- ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం
- రెండు చోట్ల అత్యవసర పంపింగ్ ఎత్తివేత

ప్రధాన రెండు జలాశయాల్లో నీటి మట్టం ఇలా

ప్రధాన జలాశయం	పూర్తి నీటి మట్టం	ప్రస్తుతం	గతేడాది (అడుగుల్లో)
నాగార్జున సాగర్	590.000	544.100	514.900
శ్రీపాద ఎల్లంపల్లి	885.000	883.800	853.100



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహా నగరంలో తాగునీటి సరఫరాకు ఇక ఎలాంటి ఢోకా ఉండబోదు. నగరానికి తాగునీరు అందించే ప్రధాన జలాశయాలైన నాగార్జున సాగర్, శ్రీపాద ఎల్లంపల్లిలలో సమృద్ధిగా జలాలు వచ్చి చేరాయి. దీంతో జలమండలి అధికారులు రెండు జలాశయాల్లో ఏర్పాటు చేసిన అత్యవసర పంపింగ్ మోటార్లను తొలగించి గ్రావిటీ ద్వారా జలాల తరలింపు ప్రక్రియ ప్రారంభించారు. కృష్ణా, గోదావరి బేసిన్‌లో భారీ వర్షాలు కురుస్తుండటంతో సాగర్, ఎల్లంపలి జలాశయాల్లో నీటి మట్టం భారీగా పెరిగింది. వాస్తవంగా గతేడాది కృష్ణా, గోదావరి బేసిన్‌లో సరైన వరద నీరు వచ్చి చేరకపోవడంతో నాగార్జునసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి జలాశయాల్లో నీటి మట్టం పూర్తిగా పడిపోయింది. సుదీర్ఘ కాలం తర్వాత రెండు జలాశయాల్లో అత్యవసర మోటార్లు ఏర్పాటు చేసి డెడ్ స్టోరేజీ నీటిని అత్యవసర పంపింగ్ ప్రక్రియ చేపట్టారు. తాజాగా జలాశయాల్లో నీటి మట్టం పెరగడంతో అత్యవసర పంపింగ్ మోటార్లను తొలగించారు.

జలాశయాలే ఆధారం..

మహా నగరానికి తాగునీటి అవసరాలకు జలాశయాల సరఫరానే ఆధారం. ప్రధాన జలాశయాలైన నాగార్జున సాగర్, శ్రీపాద ఎల్లంపల్లి జలాశయాల నుంచే సుమారు 75 శాతానికిపైగా నీటి తరలింపు ఉంటుంది. నాగార్జున సాగర్ జలాశయం నుంచి కృష్ణా తాగు నీటి సరఫరా పథకం ఫేజ్– 1, 2, 3 ద్వారా రోజువారీ 270 ఎంజీడీల నీటిని తరలిస్తున్నారు. గోదావరి బేసిన్‌లోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెకు గోదావరి నీటి సరఫరా పథకం–1 ద్వారా 168 ఎంజీడీల నీరు తరలిస్తున్నారు. ప్రస్తుతం రెండు జలాశయాల్లో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం సాగర్‌లో 196.970 టీఎంసీలు, శ్రీపాద ఎల్లంపల్లిలో 15.907 టీఎంసీల నీరు ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు రావడంతో నీటిమట్టం మరింత పెరిగే అవకాశాలున్నాయి.

వజ్రాలంటే ఇష్టం

సినీనటి కాజల్

బంజారాహిల్స్: తనకు వజ్రాలతో చేసిన నగలంటే ఎంతో ఇష్టమని సినీనటి కాజల్ అగర్వాల్ అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్- 36లోని నీరూస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన త్యోహార్ సిల్వర్ జ్యువెలరీ స్టోర్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కాజల్ మాట్లాడుతూ.. స్వర్ణాభరణాల ధరలు పెరిగిన ప్రస్తుత సమయంలో సిల్వర్ జ్యువెలరీతో ఎన్నో విభిన్న రకాల డిజైన్లు తయారవుతున్నాయని.. ఇవి అందరికీ అందుబాటులో ఉంటున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో త్యోహార్ ఫౌండర్ సుచితా అహూజా, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గ్యారెత్ ఓవెన్ తదితరులు పాల్గొన్నారు.



18 కి.మీ.. | 295 ఎకరాలు

రావిర్యాల టు నెట్ జీరో సిటీ వరకు సర్వే షురూ

- ఆరు లేన్లు.. 200 అడుగుల విస్తీర్ణంతో రహదారి
- భూసేకరణకు సర్వే చేపట్టిన రెవెన్యూ యంత్రాంగం
- ఎలివేటెడ్ రోడ్డుతో పాటు మెట్రోలైన్ విస్తరణ సైతం..



సాక్షి, సిటీబ్యూరో: రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ముచ్చర్లలో నిర్మించతలపెట్టిన ఫోర్త్ సిటీకి చేరుకునే రాచమార్గానికి రెవెన్యూ యంత్రాంగం సర్వే చేపట్టింది. ఔటర్ రింగ్‌రోడ్డు రావిర్యాల ఎగ్జిట్ 13 నుంచి కొంగరకలాన్, ఎలిమినేడు, తిమ్మాపూర్, రాచలూరు, పంజగూడల మీదుగా మీర్‌ఖాన్‌పేట వరకు 18 కిలోమీటర్లు.. ఆరులేన్లు.. 200 అడుగుల విస్తీర్ణంలో విశాలమైన ఎలివేటెడ్ కారిడార్ రోడ్డును నిర్మించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే.

ఇటీవల బేగరికంచెలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ శంకుస్థాపనకు విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే రోడ్డు సర్వే పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. ఆ మేరకు రెవెన్యూ అధికారులు శనివారం శాటిలైట్ సర్వే పనులు షురూ చేశారు.

రైతులు అభ్యంతరం చెబుతారా?

- ఈ రోడ్డుకు ఇబ్రహీంపట్నం మండలంలో 103 ఎకరాలు, కందుకూరు మండలంలో 192 ఎకరాల చొప్పున మొత్తం 295 ఎకరాల భూమి అవసరమని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇప్పటికే ఈ మార్గం నుంచి రోడ్డు కూడా ఉంది. ఇరువైపులా అదనంగా మరికొంత భూమిని సేకరించి, విస్తరింప జేస్తే సరిపోతుంది. భూ సేకరణతో పాటు ఖర్చు కూడా తక్కువ అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు వెంటే మెట్రోలైన్ వేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రైవేటు పట్టా భూముల నుంచి రోడ్డు నిర్మాణం ఖర్చుతో కూడిన వ్యవహారం.
- భూ సేకరణ విషయంలో రైతుల నుంచి పలు అభ్యంతరాలు వ్యక్తం అయ్యే అవకాశమూ లేకపోలేదు. విలువైన ఈ భూములను రోడ్డుకు ఇచ్చేందుకు నిరాకరించే అవకాశం ఉంది. దీంతో సాధ్యమైనంత వరకు తక్కువ ఖర్చుతో ప్రభుత్వ భూముల నుంచే ఈ రహదారిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ఈ ప్రతిపాదిత రోడ్డు మార్గం నుంచే ఎయిర్‌పోర్టు వరకు మెట్రోలైన్ సేవలను విస్తరించనున్నట్లు ప్రకటించడంతో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తోంది.

నాలుగేళ్లలో మారనున్న రూపురేఖలు..

అన్నీ సవ్యంగా జరిగితే వచ్చే ఏడాది నాటికి ఈ రోడ్డు పనులు ఓ దశకు చేరుకోనున్నాయి. నాలుగేళ్లలో ఈ ప్రాంత రూపురేఖలను పూర్తిగా మారిపోయి.. న్యూయార్క్‌కు దీటైన అద్భుత నగరం కళ్లముందు ఆవిష్కృతమయ్యే అవకాశముంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో నిన్న మొన్నటి వరకు స్తబ్దుగా ఉన్న రియాల్టీ రంగం మళ్లీ కదలిక వచ్చింది. కాగా.. ఇప్పటికే మంజూరై, పలు సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన యాచారం నుంచి ప్రతిపాదిత నగరం వరకు నిర్మించతలపెట్టిన 12 కిలోమీటర్లు.. వంద అడుగుల విస్తీర్ణం (మొత్తం 118 ఎకరాలు) రోడ్డు పనుల్లోను కదలిక తీసుకొచ్చింది. తాజాగా రోడ్లు భవనాలశాఖ అధికారులు గతంలో చేసిన సర్వేను, రోడ్డు మ్యాప్‌ను ఇటీవల పరిశీలించడం కొసమెరుపు.

నగరంలో నేడు..

- ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ జర్నలిస్ట్ అవార్డు ప్రదాన కార్యక్రమం.. రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10.30గంటలకు
- అపోలో హాస్పిటల్ గ్రూప్ రీజనల్ సీఈఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం యాదవల్లి ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హోటల్ దస్పల్లా కన్వెన్షన్ సెంటర్‌లో 'ది రిసిలీయంట్ పాత్' పుస్తకావిష్కరణ సాయంత్రం 5.45 గంటలకు
- బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళంపల్లి బాలమురళీ కృష్ణ 94వ జయంతి వేడుకలు.

ప్రతి దరఖాస్తుపై దృష్టి సారించండి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం

సాక్షి, సిటీబ్యూరో: తహసీల్ కార్యాలయాలకు వచ్చే ప్రతి దరఖాస్తును పరిశీలించి సమస్యను పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుండి వచ్చిన ప్రతి దరఖాస్తును తేదీ వారీగా నమోదు చేసి అదే రోజు సంబంధిత సెక్షన్లకు అందజేయాలన్నారు. ప్రజా పాలన సేవా కేంద్రంలో ఎలాంటి లోటుపాటు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్ పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

అమృత్ ఎస్టీపీలకు మహర్దశ

- రూ. 3849.10 కోట్ల నిధులు మంజూరు
- 39 మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో వంద శాతం మురుగు శుద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద మంజూరు చేసిన 39 మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం రూ. 3849.10 కోట్ల నిధులకు పరిపాలన మంజూరు ఇచ్చింది. ఓఆర్ఆర్, జీహెచ్ఎంసీ పరిధిలోని స్థానిక సంస్థలతో పాటు మూసీ నది ప్రక్షాళన కోసం వీటిని నిర్మించనున్నారు. మొత్తం ఎస్టీపీల్లో ఒక ఎస్టీపీ పీపీపీ మోడ్ లో, మిగిలిన 38 ఎస్టీపీలను హైబ్రిడ్ అన్యూయిటీ మోడల్ (హమ్)విధానంలో నిర్మించనున్నారు.ఇవి అందుబాటులోకి వస్తే.. 972 ఎంఎల్డీల మురుగును శుద్ధి చేయవచ్చు.

రెండు ప్యాకేజీల్లో

అమృత్ మురుగుశుద్ధి కేంద్రాల నిర్మాణ పనులు రెండు ప్యాకేజీల్లో పూర్తి చేయనున్నారు. ప్యాకేజీ-1లో 16 ఎస్టీపీలును, ప్యాకేజీ-2లో 22 ఎస్టీపీలు నిర్మిస్తారు. నిర్మాణ సంస్థ ఎస్టీపీలను నిర్మించి 15 ఏళ్లపాటు నిర్వహణకు చేపట్టనుంది. మొత్తం ఎస్టీపీల నిర్మాణ వ్యయం రూ. 2569.81 కోట్లు కాగా, 15ఏళ్లపాటు నిర్వహణకు రూ. 1279.29 కోట్లు అంచనా వ్యయం కానంది. ఎస్టీపీల ప్రాజెక్టుల నిర్మాణ వ్యయంలో కేంద్రం 30శాతం, రాష్ట్రం 30 శాతం, నిర్మాణ సంస్థ 40 శాతం నిధులు సమకూర్చనుంది.



ఇప్పటికే మురుగు నీటి శుద్ధి కోసం..

ఇప్పటికే వంద శాతం మురుగునీటి శుద్ధి లక్ష్యంగా ఎస్టీపీల పనులుసాగుతున్నాయి. సుమారు 1259.50 ఎంఎల్డీల మురుగు నీటిని శుద్ధి చేసేందుకు మొత్తం రూ.3866.41 కోట్ల అంచనా వ్యయంతో మూడు ప్యాకేజీల్లో 31 కొత్త మురుగు నీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీ) నిర్మాణ పనులు చేపట్టారు. అందులో కొన్నింటి నిర్మాణాలు పూర్తయి ప్రారంభం కాగా,మిగతా వాటి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం అమత్ పథకం కింద కొత్త ఎస్టీపీల నిర్మాణం కానున్నాయి.

అమృత్ ఎస్టీపీలు ఇలా..

నిర్మించే ప్రాంతం	సామర్థ్యం (ఎంఎల్డీల్లో)
ఉప్పుబావి	100.00
తిమ్మక్కచెరువు	98.50
పీర్జాదిగూడ	61.00
నాగారంలేక్	47.50
హైదరాబాద్ పబ్లిక్ స్కూల్	36.50
నల్లచెరువు-2	36.50
హైదర్షాకోట్	36.50
మాసబ్ చెరువు	36.50
కొర్రెముల	34.50
నార్సింగ్	34.50
బాపుఘాట్ సంగం	31.00
కుంట్లూర్	31.50
అమీన్‌పురా	28.00
తెల్లాపూర్	31.00
యంమనంపేట	26.00
ఇక్రిశాట్	24.50
ఉమ్దాసాగర్	23.50
ఈదుల చెరువు	23.50
గంధిగూడెం	22.50
ఫతేనగర్-2	20.00
చిత్రపురి కాలనీ	20.00
సాధన చెరువు	20.00
గుర్రం చెరువు	19.50
మీర్‌పేట	18.00
నవకుంట లేక్	14.50
పల్లెచెరువు	13.50
బాచుగూడెం	12.50
రావిర్యాల	12.00
కొండపల్లి	9.00
పోతయ్యపల్లి లేక్	7.50
గౌరెల్లి	7.00
చేర్యాల లేక్	6.50
బొంగులూర్	5.50
కాప్రా	5.50
బండ్లగూడ	5.50
కాముని లేక్	2.50
గౌడవల్లి	1.50
కొత్వాల్ చెరువు	1.00

సతీశ్ రెడ్డికి నేడు పురస్కారం ప్రదానం

సాక్షి, సిటీబ్యూరో: రక్షణ శాఖ మంత్రి శాస్త్రీయ సలహాదారు, డీఆర్డీవో మాజీ చైర్మన్, ప్రముఖ శాస్త్రవేత్త జి.సతీశ్‌రెడ్డి తెలుగు వైభవ పురస్కారం అందుకోనున్నారు. ఈ అవార్డును మండలి వెంకట కృష్ణారావు 99వ జయంతి సందర్భంగా అందజేయనున్నారు. ఆదివారం ఏపీలోని అవనిగడ్డలో ఉన్న గాంధీక్షేత్రంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.వి.దుర్గాప్రసాద్ రావు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. ఈ సభకు అధ్యక్షుడిగా ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి గ్రంధి భవానీ ప్రసాద్ హాజరుకానున్నారు.

నేడు టూరిజం ప్లాజాలో చర్చా కార్యక్రమం

లక్డీకాపూల్: నూతన ఆర్వోఆర్ చట్టం -2024 ముసాయిదాపై చర్చా కార్యక్రమాన్ని ఆదివారం బేగంపేట్ టూరిజం ప్లాజాలో నిర్వహించనున్నట్లు తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ప్రజలకు సులభంగా, వేగంగా సేవలు అందించేందుకు ప్రభుత్వం భూసంస్కరణలకు శ్రీకారం చుట్టిందని, దీనిలో భాగంగా నూతన ఆర్వోఆర్ చట్టాన్ని తేనుందన్నారు.

9న మేడారంలో 'మొక్క ముడుపు' పండుగ



లక్డీకాపూల్: కలుషితమవుతున్న మేడారాన్ని పరిరక్షించుకునే క్రమంలో ఈ నెల9న మొక్క ముడుపు పండుగను నిర్వహించనున్నట్టు స్థానిక సంస్థ కన్వీనర్ కె.నీల్(అనిల్) తెలిపారు. సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల జాగృతికి గల ఆవశ్యకతను గుర్తు చేయడమే లక్ష్యంగా ఈ వేడుకను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మేడారంలో అడవి సంరక్షణ, ప్రకృతి, విష–సంస్కృతి కాలుష్యం, పెరుగుతున్న అనారోగ్యం, మత్తు బానిసత్వం, నిర్వీర్యమవుతున్న యువత, హరిత పరిశ్రమ, ఉద్యోగాల లేమి వంటి సమస్యలు పట్టి పీడిస్తున్నాయన్నారు. ఆయా సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లే క్రమంలో మొక్క ముడుపు పండగను ఆదర్శవంతంగా నిర్వహించనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో పర్యావరణ నిపుణులు ఎం. సూర్యనారాయణ, అభ్యుదయవాదులు సుధీర్, ప్రకాష్, ఆకాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆదరించాల్సిన సీఎం కించపర్చారు'

టీపీఎఫ్‌టీ అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ

లక్డీకాపూల్ : ప్రైవేట్ టీచర్లను కించపరుస్తూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం (టీపీఎఫ్‌టీ) అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. బతకలేక బడిపంతుళ్లమైన తమకు అండగా నిలవాల్సిన ముఖ్యమంత్రి తమ మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ప్రైవేటు టీచర్లు నల్లబ్యాడ్జీలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులను, ప్రైవేట్ టీచర్లను వేర్వేరుగా చూస్తూ మాట్లాడిన సీఎం ఆలోచన చేయాలన్నారు. రూ.8 వేలు జీతంతో పని చేస్తున్న ప్రైవేట్ టీచర్ దగ్గరికి వచ్చి రూ.80 వేలు జీతం తీసుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన పిల్లవాడి చదువు గురించి మాట్లాడుతున్న విషయాన్ని గుర్తించాలన్నారు. అంతేందుకు ప్రజాప్రతినిధుల పిల్లలు, మనవళ్లు కూడా ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్నారన్నారు. గత ప్రభుత్వాల నిర్వాకం వల్ల ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు రాక, ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న మక్కువతో చాలీచాలని జీతాలపై ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా పని చేస్తూ రాష్ట్ర విద్యాభివృద్ధికి ప్రైవేటు టీచర్లు ప్రధాన భూమికను పోషిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకుని ప్రైవేట్ టీచర్ల బతుకులపై ఆలోచన చేయాలన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని తమకు అండగా నివాల్సిందిగా సీఎంను కోరారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి డి. నవీన్ కుమార్, జిల్లా నాయకు లు అమీరుద్దీన్, ముజీబ్ ఖాన్‌లు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌ను ఆ పార్టీ నాయకులే నమ్మడం లేదు'


కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీని నమ్మే స్థితిలో ఆ పార్టీ నాయకులే లేరని, అందుకే స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి స్పష్టం చేశారు. రహమత్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్ బస్తీకి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఉమర్ తన అనుచరులతో కలసి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎన్ రెడ్డి మా ట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెడ్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీ నా యకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆయన గుర్తు చేశారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ షేక్ సాబేర్, రవిశంకర్, మన్సూర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీ 5 వీసాతో అమెరికా గ్రీన్ కార్డు చాలా సులువు

మల్లెల గ్లోబల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు ఆదిత్య


మాట్లాడుతున్న మల్లెల గ్లోబల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు మల్లెల ఆదిత్య

లక్డీకాపూల్ : ఎంతోమంది భారతీయులు అమెరికాలో స్థిరపడాలని కోరుకుంటారని అలాంటి వారి కోసం ఈవీ5 వీసా ఎంతో అనువుగా ఉంటుందని మల్లెల గ్లోబల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు మల్లెల ఆదిత్య తెలిపారు. సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడూతూ ఈ వీసా ద్వారా అమెరికాలో వర్క్ పర్మిట్, నిబంధనలతో కూడిన గ్రీన్ కార్డు పొందడమే కాకుండా.. ఐదు సంవత్సరాల లోపల శాశ్వత గ్రీన్ కార్డును సొంతం చేసుకోవచ్చన్నారు. దేశ వ్యాప్తంగా తమ చదువు, ఉద్యోగం ఇంకా వివిధ కారణాలతో ఎంతోమంది అమెరికా వైపు చూస్తుంటారని పేర్కొన్నారు. అయితే అమెరికా వీసా పొందడం అంత సులువు కాదని అందరికీ తెలిసిన విషయమేనన్నారు. కానీ అమెరికాలోని ఫెడరల్ గవర్నమెంట్ ప్రవేశపెట్టిన కొన్ని రకాల ప్రాజెక్టుల్లో ఆ దేశ ఎదుగుదలలో ఇన్వెస్ట్ మెంట్ ద్వారా భాగస్వామ్యంతో గ్రీన్‌కార్డ్ సులువైందన్నారు. ఈ విషయంలో మల్లెల గ్లోబల్ ఆర్గనైజేషన్ లీగల్, ఫైనాన్షియల్ అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో కిరణ్ అండ్ అసోసియేట్స్ రియాల్టర్స్ సంస్థ ప్రతినిధి కిరణ్ వేదాంతం, ఈ బి5 ఫైవ్ గ్రీన్ కార్డు కన్సల్టెంట్ వైభవ్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మెటీరియల్ వితరణ



బంజారాహిల్స్: యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ సైఫాబాద్‌కు సాయికృష్ణ అల్యూమినియం ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ మన్నయం కృష్టారెడ్డి స్పోర్ట్స్ మెటీరియల్‌ను స్పాన్సర్ చేశారు. అలాగే మున్ముందు సైఫాబాద్ సైన్స్ కళాశాల గర్ల్స్, బాయ్స్ హాస్టల్ల విద్యార్థులకు అవసరమైన స్పోర్ట్స్ మెటీరియల్‌ను అందించి తనవంతుగా మరింత సహకారం అందిస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా కృష్టారెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ అభినందించి శాలువాతో సత్కరించారు. జ్ఞాపికను ప్రదానం చేశారు.

కామారెడ్డి బీజేపీ ఎస్టీ మోర్చా ఇన్‌చార్జిగా రమేశ్‌నాయక్


రమేశ్ నాయక్

రహమత్‌నగర్ : బీజేపీ ఎస్టీ మోర్చా కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జిగా రహమత్‌నగర్ డివిజన్ ఇందిరానగర్‌ఫేజ్1 బస్తీకి చెందిన బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి బర్మవత్ రమేశ్‌నాయక్ నియామకమయ్యారు. ఈ మేరకు ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డా. కళ్యాణ్ నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రమేశ్ నాయక్ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో పర్యటించి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర బీజేపీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి


పాఠశాలలో సమస్యలు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

రహమత్‌నగర్: బోరబండ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తొందరలోనే పరిష్కరిస్తామని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు లంకల దీపక్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కొలన్ సత్యనారాయణ, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు కుమార్‌నాయక్, షర్మిల జాదవ్, జిల్లా నాయకుడు శరణ్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ తదితరులు శనివారం సైట్.3 లోని బాలికల గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా లంకల దీపక్‌రెడ్డి మాట్లాడుతూ బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలలో అనేక మౌలిక సమస్యలను తమ దృష్టికి వచ్చాయని వాటన్నింటికి ఆయాశాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. గురుకుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కనువిందుగా 'ఉత్సవ్'

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో 'ఉత్సవ్' పేరిట శనివారం నిర్వహించిన ప్రతిభా దర్శన్ కనువిందు చేసింది. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసే లక్ష్యంగా కొనసాగిన ఈ కార్యక్రమంలో యూకేజీ విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. నాటికలు, నృత్యాలు, నృత్య నాటికలను ప్రదర్శించి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ప్రధానోపాధ్యాయురాలు విధుమోహన్ మాట్లాడుతూ మన సంస్కృతి, నాగరికతలను ప్రతిబింబించేలా ఎంతో నైపుణ్యంతో యూకేజీ విద్యార్థులు వివిధ ప్రదర్శనలు నిర్వహించారన్నారు. దీని ద్వారా వారిలో నైపుణ్యం వెలికితీయడం జరిగిందన్నారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ యూకేజీ విద్యార్థుల ప్రదర్శన ఎంతో అద్భుతంగా ఉందన్నారు. పండుగ జరుపుకోవడంలో ముఖ్య ఉద్దేశాన్ని చిన్నారులు తెలియజేసిన తీరు అబ్బురపరిచిందన్నారు.




జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

వాకర్లు, సందర్శకులకు మధురానుభూతి!

- కనువిందుగా... కేబీఆర్ జీహెచ్‌ఎంసీ వాక్‌వే
- అరుదైన వృక్ష జాతులు.. ఆకట్టుకుంటున్న థీమ్ పార్కులు..
- ఓపెన్ జిమ్‌లు.. వెలుగులు జిమ్ముతున్న రాక్ లైటింగ్


కేబీఆర్ వాక్‌వేలో ఔషధ మొక్కలతో కూడిన పంచతత్వ గార్డెన్..


ఓపెన్ జిమ్..


ఫౌంటెన్‌తో కూడిన రాక్ లైటింగ్..

బంజారాహిల్స్: వాటర్ ఫౌంటెన్లు..కలువ పూల కొలనులు..రంగురంగుల పూల మొక్కలు..అరుదైన వృక్ష జాతులు.. పరుగులీడే మయూరాలు.. అరుదైన జాతి మొక్కలతో థీమ్ పార్కులు.. అడుగడుగునా విద్యుత్ దీపాలు.. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును ఆనుకుని ఆరు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న జీహెచ్‌ఎంసీ వాక్‌వే పచ్చదనం, పరిశుభ్రతతో ఇటు వాకర్లను, అటు సందర్శకులను ఆకట్టుకుంటుంది. గడిచిన రెండేళ్లుగా కేబీఆర్ జీహెచ్‌ఎంసీ వాక్ వేపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి కనువిందు చేసే రీతిలో తీర్చిదిద్దారు. అడుగడుగునా అరుదైన పూలమొక్కలు, వృక్ష జాతులు వాకర్లను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కేబీఆర్ పార్కు ప్రధాన గేటుకు రెండు వైపులా గేట్ల నుంచి ఈ వాక్ వేలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. మొన్నటి వరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా పనిచేసిన రోనాల్డ్‌రోస్ పలుమార్లు ఈ వాక్ వేలో పర్యటించి సంబంధిత యూబీడీ అధికారులకు మొక్కలు నాటాలని, ఇంజినీర్లకు వాక్‌వేను తీర్చిదిద్దాలని ఆదేశాలు ఇవ్వడంతో ఆరు నెలల్లోనే ఈ పార్కు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ పార్కును సుందరంగా తీర్చిదిద్దడంలో అధికారులు అంకిత భావంతో పనిచేశారు. దీంతో ఇక్కడ పచ్చదనం పరిఢవిల్లుతోంది. పార్కు మొత్తంలో 10 వరకు థీమ్ పార్కులు ఏర్పాటు చేశారు. ఔషధ మొక్కలు, సువాసనలు వెదజల్లే వృక్ష జాతులు, కంటికి ఇంపుగా కనిపించే పూల మొక్కలు ఈ థీమ్ పార్కుల్లో కనువిందు చేస్తున్నాయి. అధికారులు పార్కు రక్షణ కోసం ప్రత్యేకంగా సెక్యూరిటీ గార్డులను కూడా నియమించారు. సుమారుగా 25మంది తోటమాలిలు ఆరు కిలమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ వాక్‌వేలో పచ్చదనాన్ని కాపాడుతూ మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నారు. దీనికితోడు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ సైతం వాక్‌వే పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. పలుమార్లు పర్యటించి మరిన్ని ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.


థీమ్‌గార్డెన్‌లో అరుదైన మొక్కలు..

పూర్తిగా ఉచితం..

కేబీఆర్ జీహెచ్‌ఎంసీ వాక్‌వే ఆరు కిలోమీటర్ల మేర సర్వాంగ సుందరంగా ముస్తాబు కాగా ఇందులోకి ప్రవేశం పూర్తిగా ఉచితం. ఉదయం 4.30 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 9 గంటల వరకు పార్కులోకి అనుమతిస్తారు.

థీమ్ పార్కులు ఇవే..

బట్టర్‌ఫ్లై గార్డెన్, బోగన్‌విల్లా గార్డెన్, వెదురు గార్డెన్, పామ్ ఐటమ్ గార్డెన్, పంచతత్వ గార్డెన్, ఎగ్జోరా గార్డెన్, ఫైకస్ గార్డెన్, హెర్బల్ గార్డెన్ తదితర థీమ్ పార్కులు ఉన్నాయి. వీటికి తోడు ఇటీవలనే ఈ వాక్‌వేలో 3453 వివిధ జాతుల మొక్కలను, చెట్లను నాటారు. అదనంగా ఓపెన్ జిమ్ కూడా వాకర్లను ఆకట్టుకుంటుంది.

వెలుగులు జిమ్ముతున్న రాక్ లైటింగ్..

కేబీఆర్ పార్కు గేటు నెంబర్–5 వద్ద సహజ సిద్ధంగా ఏర్పడ్డ భారీ బండరాయిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ బండపై ఫౌంటెన్ ఏర్పాటు చేసి రంగురంగుల లైట్లు అమర్చడంతో సరికొత్త రూపును సంతరించుకుంది. రాక్ లైటింగ్ పేరుతో దీనిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ వాక్‌వేకే ఈ రాక్ లైటింగ్ మరో ఆకర్షణగా నిలిచింది.

వాటర్‌వర్క్స్ ఎండీకి విజ్ఞప్తి


వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ నాయుడునగర్ ఎస్‌డబ్ల్యూడీ నాలా లైన్‌లో నూతన 500ఎంఎం దయా సీవరేజీ లైన్‌ను కనెక్ట్ చేయడాన్ని నిలిపివేయాలంటూ వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీని కలసి ఆమె వినతిపత్రాన్ని సమర్పించారు.

ఎస్‌బీఐ రివార్డ్ పాయింట్స్ పేరుతో సైబర్ మోసాలు

హిమాయత్‌నగర్: ఎస్‌బీఐ రివార్డ్ పాయింట్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు ఎస్‌బీఐ ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. మీ బ్యాంక్ ఖాతాకు రివార్డ్స్ పాయింట్స్ వచ్చాయని, వాటిని క్లెయిమ్ చేసుకునేందుకు ఎస్‌బీఐ రివార్డ్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ ఓ ఫేక్ మెసేజ్ సర్క్యులేట్ అవుతుందని, దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఈ నకిలీ సందేశాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని, వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను గుర్తుతెలియని వ్యక్తులతో పంచుకోవద్దని నగర సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

చిరకాల స్వప్నం నెరవేరింది


కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నేతలు

వెంగళరావునగర్: గత 30 ఏళ్ళ చిరకాల స్వప్నం నెరవేరిందని, ఉద్యమ కెరటం మందకృష్ణ రుణం తీర్చుకోలేనిదని పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని లక్ష్మీనరసింహనగర్ బస్తీ, యూసుఫ్‌గూడ అంబేద్కర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో దళిత నేత మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయా నేతలు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును స్వాగతిస్తూ, న్యాయమూర్తులకు, మంద కృష్ణ మాదిగకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నేతలు పి.ఎల్.ప్రకాశ్ మాదిగ, రామారావు మాదిగ, పల్లె నర్సింగరావు మాదిగ, నర్సింగ్‌దాస్ మాదిగ, సత్యనారాయణ మాదిగ, యాదయ్య మాదిగ, వెంకటస్వామి మాదిగ, వెంకటేష్ మాదిగ, స్వామి మాదిగ, శివకుమార్‌దాస్ మాదిగ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కళాకృతులు


బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12 చర్చి రోడ్డులో ఉన్న సీసీటీలో ఆకట్టుకుంటున్న కళాకృతులు

ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్– 12 లోని ఎమ్మెల్యే కాలనీ చర్చి రోడ్డులో ఉన్న క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ హాల్‌లో ఏర్పాటు చేసిన బారో మార్కెట్‌లో దేశ నలుమూలల నుంచి వచ్చిన హస్త కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకున్న కళాకృతులు నగర మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 2వ తేదీన ప్రారంభమైన ఈ ప్రదర్శన నాల్గో తేదీ (ఆదివారం) వరకు కొనసాగుతుంది. ఆదివారం ఉదయం 11 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆకట్టుకునే డిజైనర్ ఆభరణాలు, ప్రత్యేక అలంకరణలో ఆకృతు లు, చీరలు, హ్యాండీక్రాఫ్ట్స్ ఈ ప్రదర్శనలో ఆకట్టుకుంటున్నాయి. దేశంలోని ప్రఖ్యాత డిజైనర్లు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిస్తున్నారు.

చిన్నారులకు అన్నప్రాశన


అన్నప్రాశన నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫాతిమా

ఫిలింనగర్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఐసీడీఎస్ షేక్‌పేట సూపర్‌వైజర్ ఫాతిమా ఫిలింనగర్‌తో పాటు షేక్‌పేట అంగన్‌వాడీ కేంద్రాల్లో పర్యటించి అన్నప్రాశన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గౌతంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ పుష్పలత ఆధ్వర్యంలో అన్నప్రాశన కార్యక్రమం జరిగింది.

ఆర్టీసీ ఎండీకి వినతి


వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ నేతలు

హిమాయత్‌నగర్: ఆర్టీసీని తక్షణం ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికుల గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూ ఐఎన్‌టీయూసీ యూనియన్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు యూనియన్ నేతలు సయ్యద్ మహ్మద్, అబ్రహాంలు శనివారం ఆర్టీసీ ఎండీ సజ్జనర్‌ని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తింపు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలన్నారు. ఎన్నికలు నిర్వహించే వరకు కార్మికుల వెల్ఫేర్ కమిటీ పెట్టాలని కోరారు. కండక్టర్ల మీద మహాలక్ష్మి పథకం వల్ల నమోదైన కేసులను తక్షణమే ఆపాలని కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.

యూకే 'వృత్తి, విద్యాంశాల'పై అవగాహన సదస్సు


కార్యక్రమంలో మాట్లాడుతున్న గ్లోబల్ ట్రీ ప్రతినిధులు

పంజగుట్ట: ప్రముఖ విదేశీ విద్యా కన్సల్టెన్సీ గ్లోబల్ ట్రీ, నెట్‌వర్క్ ఆఫ్ ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అలుమ్ని–యూకే (ఎన్ఐఎస్ఏయూ–యూకే) సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఎన్ఐఎస్ఏయూ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్‌భవన్ రోడ్డులోని విల్లామేరీ ఉమెన్ డిగ్రీ కళాశాల వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల ఉపాధి, యూకే విశ్వవిద్యాలయ అవకాశాలపై అవగాహన కల్పించారు. గ్లోబల్ ట్రీ వ్యవస్థాపకులు, ఎండీ శ్రీకర్ ఆలపాటి, ఎన్ఐఎస్ఏయూ చైర్‌పర్సన్ సనం అరోరా, విల్లామేరీ కాలేజ్ ప్రిన్సిపాల్ రేవతి, మాథూర్ హార్పర్ ఆడమ్ యూనివర్శిటీ ప్రతినిధులు ప్యానెల్ చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకర్ మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలపై సంపూర్ణమైన అవగాహన కల్పిస్తూ విజయవంతమైన భవిష్యత్తు నిర్మాణం కోసం నిపుణుల సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు వృత్తిపరంగా అంతర్జాతీయ సంస్థలతో, విద్యాపరంగా విశ్వవిద్యాలయాలతో అనుసంధానం చేయడానికి కృషి చేస్తామన్నారు. యూకే, లండన్‌లోని పూర్వ విద్యార్థులతో మాట్లాడడం, వీసా ప్రక్రియలు, కేరీర్ అనుకూలంశాల గురించి తెలియజేశారు. ఇంపీరియల్ కాలేజ్ లండన్, కింగ్స్ కాలేజ్ లండన్, బ్రూనెల్ విశ్వ విద్యాలయం, వార్విక్ హాంప్టన్ విశ్వవిద్యాలయం, నార్తంబ్రియా లండన్ వంటి అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలతో అనుసంధానాన్ని సమకూర్చనున్నామని చె ప్పారు. ఎన్ఐఎస్ఏయూ–యూకే చైర్‌పర్సన్ సనమ్ అరోరా మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలకు అవకాశాల వేదికగా ఈ ఈవెంట్‌ను రూపొందించామని తెలిపారు.

'మైన్ ఎన్ యువర్స్' ప్రారంభం



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఏర్పాటు చేసిన మైన్ ఎన్ యువర్స్ లైఫ్ స్టైల్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ శనివారం ప్రారంభమైంది. ఈ ఎగ్జిబిషన్‌ను నటి తేజస్వి మదివాడతో పాటు పలువురు మోడల్స్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రెండు రోజులు పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో వెడ్డింగ్ జ్యువెలరీతో పాటు ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఉత్పత్తులు, డిజైనరీ వస్త్రాలు అందుబాటులో ఉంచుతున్నట్లు ఈ ఎగ్జిబిషన్ రెండు రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు.

మున్సిపల్ సిబ్బందిని పెంచాలి

లిబర్టీ: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్‌లో పారిశుధ్య సిబ్బందిని, మున్సిపల్ సిబ్బందిని పెంచాలని లేబర్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డి.ప్రీతంసింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మున్సిపల్ శాఖను గ్రేటర్ హైదరాబాద్ శాఖ సమీక్ష సమావేశం నిర్వహించి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో పారిశుధ్య సిబ్బందిని కార్మికులను రెగ్యూలర్ సిబ్బంది సంఖ్యను పెంచి సేవలను విస్తృతం చేయాలని కోరారు. లిబర్టీ కూడలి వద్ద ఉన్న యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో జనాభా కోటికి పైగా చేరుకుందని జనాభాకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బంది మున్సిపల్ కార్యాలయంలో సేవలు అందదించేందుకు వివిధ విభాగాల్లో సిబ్బందిని నియమించాలని ఆయన విన్నవించారు. ఈ సమావేశంలో డి.దిలీప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దళితుబంధు పథకాన్ని యథాతథంగా కొనసాగించాలి

లిబర్టీ: దళితబంధు పథకం అమలు కోసం రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి నిధులు కేటాయించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అన్నింటా వెనుకబడి దయనీయ జీవితాలు వెళ్లదీస్తున్న దళితులకు ఉపాధి కల్పించేందుకు 2024–25 వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం సవరించి రూ. 15 వేల కోట్ల రూపాయలు కేటాయించి దళితులను ఆదుకోవాలని విన్నవించారు. లిబర్టీ ప్లాజాలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హుజూరాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా ఎన్నికల్లో గెలవాలన్న నెపంతో తూతూమంత్రంగా దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి ఎన్నికల గెలిచిన తర్వాత చేతులు దులుపుకుందని ఆరోపించారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో దుర్భర జీవితాలు వెళ్లదీస్తున్న వారికి చేయూతనివ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఉపాధి కల్పిస్తే ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు సమాజంలో సమన్నత స్థానంలో జీవనం సాగిస్తారని ఆయన స్పష్టం చేశారు.

నకిలీ బంగారంతో రుణం తీసుకుని మోసం

వెంగళరావునగర్: నకిలీ బంగారంతో రుణం తీసుకుని బ్యాంకును మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వెంగళరావునగర్‌కాలనీలోని ఈఎస్ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో వల్లూరి ప్రదీప్ చౌదరి 2022 ఆగస్టు 5వ తేదీన తన రెండు ఉంగరాలు తాకట్టుపెట్టి రూ.1.18 లక్షలు రుణం తీసుకున్నాడు. ఏడాది తర్వాత దానిని తిరిగి తీసుకోవడం, లేదా రెన్యువల్ చేయాల్సి ఉంది. అయితే ప్రదీప్ చౌదరి ఆ పని చేయలేదు. నిర్ణీత సమయంలో గోల్డ్ తిరిగి తీసుకోకపోతే కస్టమర్‌కు నోటీసులు పంపి వేలం వేస్తారు. అదే విధంగా ప్రదీప్ చౌదరికి తెలియజేసినా పట్టించుకోలేదు. బ్యాంకు నిబంధనల ప్రకారం వాటిని వేలం వేయడానికి నిర్ణయించి సదరు రింగ్స్‌ను పరిశీలించగా నకలీవని తేలింది. అతనిని సంప్రదించగా అందుబాటులోనికి రాలేదు. దీంతో ఏడాది కాలంలో బ్యాంకుకు రూ.1.37 లక్షల వరకు నష్టం వచ్చింది. నకిలీ రింగ్స్‌తో మోసం చేసి రుణం తీసుకున్న ప్రదీప్ చౌదరిపై చర్యలు తీసుకోవాలని బ్యాంకు మేనేజర్ ఎస్.పురుషోత్తంరెడ్డి శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఇందిరానగర్ కల్లు కాంపౌండ్ సమీపంలో ఓ యువకుడి అనుమానాస్పదంగా మృతి చెందడం స్థానికంగా కలకలం సృష్టించింది. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఇందిరానగర్ బస్తీ దవాఖానా సమీపంలో నివసించే గంపల యాదమ్మ కొడుకు జి. ప్రదీప్‌కుమార్ (25) కొంతకాలంగా కల్లుకు అలవాటుపడి సమీపంలోని కల్లు కాంపౌండ్‌కు వెళ్లి రోజూ రాత్రికి ఇంటికి తిరిగివచ్చేవాడు. ఎప్పటిలాగే శుక్రవారం సాయంత్రం కూడా ఇందిరానగర్ కల్లు కాంపౌండ్‌కు వెళ్లాడు. అర్ధరాత్రి దాకా రాకపోయేసరికి తల్లితో పాటు అతడి సోదరి సమీప ప్రాంతాల్లో గాలించారు. కల్లు కాంపౌండ్ సమీపంలో సోదరుడు కోసం వెతుకుతుండగా అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో కాంపౌండ్ ఆవరణలో అనుమానాస్పదంగా మృతిచెంది కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన పోలీసులు విచారణ జరిపి ప్రదీప్‌కుమార్ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఇందిరానగర్ కల్లు కాంపౌండ్‌ను సీజ్ చేశారు. ఇదిలా ఉండగా ఇటీవలే ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు కొన్ని కల్లు కాంపౌండ్‌లలో మత్తుపదార్థాలు కలిపి కల్లును విక్రయిస్తున్నట్లుగా తేలడంతో వాటిని మూసివేశారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్, ఆదివారం, 4, ఆగస్టు, 2024









యే దోస్తీ హమ్ నహీ తోడేంగే
తోడేంగే దమ్ మగర్
తేరా సాత్ నా చోడేంగే.. అంటూ నాటి షోలే సినిమాలో ఆనంద్ బక్షి..రచించిన ఈ పాట మొదలుకొని.. ఆ మధ్య కాలంలో వచ్చిన..
దోస్త్ మేరా దోస్త్ తూ హై మేరీ జాన్
వాస్తవం రా దోస్త్ నువ్వే నా ప్రాణం
బతుకు తీపి పాటలో మధుర స్వరాలం మనం
స్నేహమనే మాటలో చెరో అక్షరం మనం
నిదరలో ఇద్దరమూ ఒకేలా కలగంటం
నిజంలో ప్రతి క్షణం కళలకే కల అవుతాం..
అంటూ భువన చంద్ర రచించిన ఈ పాట వరకూ స్నేహం గొప్పతనాన్ని తెలిపేవే.. ఇలాంటి అనేక పాటలు స్నేహంలోని మాధుర్యాన్ని తెలియజేస్తాయి..

నిజమే మరి నాటి నుంచి నేటి తరం వరకూ లవర్స్ లేని వాళ్లు ఉంటారేమో గానీ.. స్నేహితులు లేని వాళ్లు దాదాపు ఉండరనే చెప్పొచ్చు.. ప్రతి ఒక్కరికీ ఎంతో కొంత మంది ప్రాణ స్నేహితులు ఉంటారు. వీరికి కులం, మతం, ప్రాంతం, భాష, ఆస్తి, అంతస్తు, పేద ధనిక వంటి బేధాలు అడ్డురావు.. మనం ఫోన్ చెయ్యగానే..'అరేయ్ చెప్పరా మామా' అనేంత క్లోజ్ నెస్ వారి మధ్య ఉంటుంది. స్నేహాన్ని పంచుకుంటూ, పెంచుకుంటూ.. కష్టాలు, కన్నీళ్లు, ఆనందాలు, సరదాలూ అన్నీ వారితో పంచుకునే వాళ్లే నిజమైన ఫ్రెండ్స్. నేడు అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా.. అలాంటి కొందరు దోస్తులకు సంబంధించిన కొన్ని ప్రేరణాత్మక విషయాలు..





దోస్త్.. మేరా దోస్త్..
స్నేహం అజరామరం.. చరిత్రాత్మకం


అరవింద్ జాషువా, పీజీ.విందా

కల సాకారం కోసం
తపించే స్నే‘హితుడు’..

ప్రస్తుతం సినిమాటోగ్రాఫర్‌గా రాణిస్తున్న పీజీ.విందా (అష్టాచెమ్మా, సమ్మోహనం, జెంటిల్మన్..ఫేం) నిజమైన హితుడు అని చెప్పాలి. తన కల సాకారంతో పాటు మిత్రులందిరివీ కలిపి మన కలలను సాకారం చేయాలని ఆరాటపడతాడు. సిటీలోని జేఎన్‌టీయూలో చదివేటప్పుడు నాకు సహాధ్యాయి. ఇద్దరికీ కళలపట్ల ఆసక్తి, ఏదో సాధించాలన్న తపన.. మా స్నేహబంధంతో పాటు బలపడుతూ వచ్చింది. బేగంపేట్‌లో ఓ చిన్న గదిలో అద్దెకుంటూ చాలీ చాలని డబ్బులతో బిస్కట్లు, సమోసాలతో కడుపు నింపుకుంటూ.. బహుశా ఇవన్నీ ఎదిగే క్రమంలో చాలా మందికి అనుభవమే కావచ్చు. కానీ.. మా లాంటి స్నేహం మాత్రం అతి కొద్దిమందికే దక్కింది అని సగర్వంగా చెప్పగలను. దర్శకులు శేఖర్ కమ్ములకు నన్ను పీజీ.విందా పరిచయం చేసి కాస్ట్యూమ్ డిజైనర్‌గా అవకాశం ఇప్పించకపోతే.. బహుశా సినీ రంగానికి దూరంగానే ఉండేవాడినేమో. నాలాంటి మరికొంత మంది స్నేహితుల కలల సాకారానికి కూడా సాయం అయ్యాడు. అందుకే ఎందరో ఫ్రెండ్స్.. కానీ కొందరే స్నే‘హితులు’.. అలాంటివారిలో బెస్ట్ పీజీ.విందా.

– అరవింద్ జాషువా, ఫ్యాషన్ డిజైనర్, తెలుగు సినీ దర్శకుడు

ఆలోచనలు, మనస్తత్వాలు ఒక్కటే..

బాపట్లలో బీటెక్ చదువుకునే రోజుల్లో పీవీకే జగన్నాథరావుతో స్నేహం ఏర్పడింది. ఇద్దరి ఆలోచనా విధానం, మనస్తత్వాలు సమాంతరంగా ఉంటాయి. అప్పటి నుంచి మా మధ్య వ్యక్తిగత విషయాలంటూ ఏమీ ఉండవు. ఉద్యోగ రీత్యా నేను హైదరాబాద్‌లో ఉన్నా. ఆయన అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కళాశాలలో ప్రిన్సిపల్ సైంటిస్ట్, యూనివర్శిటీ హెడ్‌గా స్థిరపడ్డారు. కుటుంబం, పిల్లలు, ఉద్యోగం, వ్యక్తిగత వివరాలు అన్నీ పంచుకుంటాం. వీలు చిక్కినప్పుడు కలుస్తుంటాం. కష్టసుఖాల్లో ఒకరికి ఒకరం అండగా నిలబడతాం. వివాహం, ఇతర కార్యక్రమాలు చేపట్టినపుడు తప్పనిసరిగా చర్చించి ఒక నిర్ణయాన్ని తీసుకుంటాం. ఇప్పటికీ ఆయనే నా బెస్ట్ ఫ్రెండ్. దాదాపు 20 ఏళ్లకుపైగా మా స్నేహం కొనసాగుతోంది.

– పీడబ్ల్యూ జాన్సన్, అసిస్టెంట్ డైరెక్టర్, తెలంగాణ వ్యవసాయ శాఖ, హైదరాబాద్.





గోల్కొండ: రాజకీయాల్లో ఒకేసారి ప్రవేశించి అంచలంచలుగా ఎమ్మెల్యే స్థాయికి ఎదిగామని కార్వాన్, బహదూర్‌పురా ఎమ్మెల్యేలు కౌసర్ మోహియుద్దీన్, మహ్మద్ ముబీన్ అంటున్నారు. రోజు రోజుకు తమ స్నేహ బంధం బలపడుతుందని 'ఫ్రెండ్‌షిప్ డే' సందర్భంగా 'సాక్షి'తో తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు. 40 ఏళ్ల క్రితం మజ్లీస్ కార్యకర్తలుగా కార్వాన్ నుంచి కౌసర్ మోహియుద్దీన్ తన రాజకీయ జీవితం ప్రారంభించారు. అదే సమయంలో పాత నగరం ఆగాపూరా నుంచి మహ్మద్ ముబీన్ రాజకీయ అరంగేట్రం చేశారు. ఆ సమయంలో ఇద్దరూ చురుకైన యువ కార్యకర్తలుగా పార్టీ అధిష్టానం మెప్పుపొందారు. దివంగత మజ్లీస్ అధినేత సలావుద్దీన్ ఓవైసీతో పాటు ప్రస్తుత అధినేత అసదుద్దీన్ ఓవైసీకి నమ్మిన బంటులుగా మారారు. అయితే ముందుగా ఎమ్మెల్యే పదవి వరించింది మాత్రం కౌసర్ మోహియుద్దీన్‌కు. వరుసగా మూడోసారి కౌసర్ ఎమ్మెల్యేగా విజయం సాధించగా ముబీన్ మొదటిసారి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే మెహియుద్దీన్ సతీమణి గోల్కొండ వెస్ట్, నానల్‌నగర్ నుంచి కార్పొరేటర్‌గా విజయం సాధించగా ముబీన్ మాత్రం ఆగాపూరా నుంచి రెండుసార్లు, శాస్త్రీపురం నుంచి

విడదీయరాని స్నేహ బంధం..

ఒకసారి కార్పొరేటర్‌గా గెలిచారు. ప్రస్తుత అసెంబ్లీలో గెలిచిన ఇద్దరూ ఒకే రోజు ఒకే సారి ఒకే సమయంలో ఆప్తమిత్రులుగా అసెంబ్లీలో అడుగు పెట్టడం విశేషం. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ తాము ప్రాధాన్యం ఇస్తామంటారు. 40 ఏళ్ల తమ స్నేహ బంధంలో ఏనాడూ పొరపచ్చాలు రాలేదని వారు స్పష్టం చేశారు.


కౌసర్ మోహియుద్దీన్, మహ్మద్ ముబీన్

‘ఆధునిక హైదరాబాద్’
ఆ ఇద్దరు మిత్రులు
రాజు, ప్రధాని మధ్య వెల్లివిరిసిన స్నేహబంధం
ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్, నాటి ప్రధాని ఫక్రుల్‌ముల్క్...


ఫక్రుల్ ముల్క్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ఒక అందమైన నగరం. నాలుగు వందల ఏళ్ల చారిత్రక సోయగం. ప్రేమ పునాదులపై వెలసిన భాగ్యనగరం ఇది. విభిన్న మతాలు, భాషలు, సంస్కృతులు ఒకే పాదు నుంచి పూచిన పూలై వికసించాయి. వైవిధ్య భరితమైన స్నేహ సంబంధాలు వెల్లివిరిశాయి. హైదరాబాద్ అంటేనే ఆత్మీయమైన నగరం. ఎంతో మంది గొప్ప స్నేహితులు ఈ నేలపైన పుట్టిపెరిగారు. చరిత్రను సృష్టించారు. ఆదర్శప్రాయమైన స్నేహితులుగా నిలిచారు. నిజాం నవాబుల కాలంలో రాజులకు, ఉన్నతాధికారులకు మధ్య చక్కటి స్నేహ సంబంధాలు ఉండేవి. ఆధునిక హైదరాబాద్ నిర్మాణాన్ని, అభివృద్ధిని పరుగులు పెట్టించిన దార్శనికుడు ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్, ఆయన దగ్గర ప్రధానమంత్రిగా పనిచేసిన నవాబ్ ఫక్రుల్‌ముల్క్ బహదూర్. ఇద్దరూ గొప్ప స్నేహితులుగా చరిత్రలో నిలిచిపోయారు. హైదరాబాద్ అభివృద్ధికి వారిద్దరూ కలిసి ప్రణాళికలను రూపొందించారు. హైదరాబాద్ చరిత్రను మలుపు తిప్పారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదర్శప్రాయమైన, అజరామరమైన వారి స్నేహంపైన 'సాక్షి' ప్రత్యేక కథనం ఇది.

అది స్వర్ణయుగం..

ఆ ఇద్దరి స్నేహం హైదరాబాద్ చరిత్రలో స్వర్ణయుగం. మీర్ మహబూబ్ అలీఖాన్ ఆధునిక హైదరాబాద్ నగరానికి బాటలు పరిచిన గొప్ప పాలకుడు. ఆయన ఆశయాన్ని, ఆలోచనలను ఆచరణలో పెట్టిన పరిపాలనాదక్షుడు ఫక్రుల్‌ముల్క్.


మీర్ మహబూబ్ అలీఖాన్

విధినిర్వహణ దృష్ట్యా ప్రధానమంత్రి. ఇద్దరి అభిరుచులు చాలా వరకూ ఒకేవిధంగా ఉండేవి. 1892 నుంచి 1901 ఫక్రుల్‌ముల్క్ ప్రధానిగా పనిచేశారు. ఇంచుమించు సమయస్కులు కావడం వల్ల వారి మధ్య స్నేహం ఏర్పడింది. నాలుగు దశాబ్దాల పాటు ఆ స్నేహం కొనసాగింది.. బహుముఖ ప్రజ్ఞాశాలి, గొప్ప ప్రతిభావంతుడైన ఫక్రుల్‌కు సంగీతం, సాహిత్యం అంటే ఎంతో ఇష్టం. మహబూబ్ అలీఖాన్ కూడా గొప్ప సాహిత్యాభిరుచి కలిగిన వ్యక్తి. ఇద్దరూ కలిసి కవి సమ్మేళనాలు, ముషాయిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వేడుకల్లో పాల్గొనేవారు. ఉర్దూ సాహిత్య వికాసం కోసం మహబూబ్ అలీ ఎంతో కృషి చేశారు. ఆధునిక విద్యకు శ్రీకారం చుట్టింది ఆయనే. ఎంతోమంది కవులను, కళాకారులను. పండితులను ప్రోత్సహించారు. ఇద్దరు ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా నిలిచారు. అనాథలు, నిస్సహాయులను ఆదుకొనేందుకు ఫక్రుల్ స్వచ్ఛంద సంస్థలకు ధారాళంగా విరాళాలు ఇచ్చేవారు. నిజాంకు అత్యంత సన్నిహితమైన వ్యక్తిగా అనేక సమావేశాల్లో, విధానపరమైన అంశాల్లో కీలకంగా వ్యవహరించారు.

ఎర్రమంజిల్ ఒక కళాఖండం..

ఆ ఇద్దరి అపురూపమైన, ఆదర్శప్రాయమైన స్నేహానికి చిహ్నంగా ఫక్రుల్ అద్భుతమైన ఎర్రమంజిల్ ప్యాలెస్‌ను కట్టించాడు. ఇండో యూరోపియన్ శైలిలో నిర్మించిన ఈ రాజమందిరం అద్భుతమైన మాన్యుమెంట్‌గా నిలిచింది. ఎత్తయిన ప్రదేశంలో ఈ అందమైన ప్యాలెస్‌ను కట్టించారు. 1890లో నిర్మాణ పనులు ప్రారంభించగా పదేళ్ల పాటు పనులు కొనసాగాయి. 1900లో ఈ భవన నిర్మాణం పూర్తయింది. దేశంలోని మొఘల్, కుతుబ్‌షాహీ వాస్తు శిల్పాన్ని, యురప్‌లోని విక్టోరియన్, గోథిక్ నిర్మాణ శైలిని మేళవించి ఈ చారిత్రక కట్టడాన్ని నిర్మించారు. ఫక్రుద్దీన్ నివాస మందిరం ఇది. సభలు, సమావేశాలు, వేడుకలు, విందులు, వినోదాలతో ఈ ప్యాలెస్ నిత్యం సందడిగా ఉండేది.

'విజన్ హైదరాబాద్' లక్ష్యంగా...

భావితరాల అవసరాలను, నగర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. 'విజన్ హైదరాబాద్' లక్ష్యంగా ఇద్దరూ కలిసి అనేక నిర్మాణాలను కొనసాగించారు. రహదారులను నిర్మించారు. కొత్త భవనాలను కట్టించారు. నాటి సంపన్నులు, నవాబుల పిల్లల ఉన్నత చదువుల కోసం 1887లోనే నిజామ్స్ కళాశాలను నిర్మించారు. అనంతర కాలంలో అన్ని వర్గాలకూ చేరువైంది. బాలికల విద్య కోసం మహబూబియా కళాశాల, హైకోర్టు భవనం, అసెంబ్లీ హాల్, రైల్వే నిర్మాణం, టెలిఫోన్, బ్యాంకింగ్ వ్యవస్థ, తాగునీటి వ్యవస్థ వంటి కార్యక్రమాలు మహబూబ్ అలీ హయాంలో చేపట్టినవే. స్కూళ్లు, కళాశాలలు కట్టించారు. ఈ నిర్మాణాలన్నింటిలోనూ నిజాంకు ఫక్రుల్ కుడిభుజంగా నిలిచారు.










తారల తలుక్కు..
69వ ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డుల ప్రదానోత్సవంలో సినీ తారల సందడి..

69వ ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఈ వేడుక శనివారం జరిగింది. ఈ వేడుకల్లో టాలీవుడ్, మాలీవుడ్, కోలీవుడ్ తారలు సందడి చేశారు. ఈ వేడుకలకు నటులు ఫరియా అబ్దుల్లా, సందీప్ కిషన్ హోస్ట్‌గా వ్యవహరించారు. టాలీవుడ్‌లో బెస్ట్‌కొరియోగ్రఫీ అవార్డును దసరా సినిమాకు గాను ప్రేమ్ రక్షిత్ సొంతం చేసుకున్నారు. ఇక బెస్ట్ సినిమాటోగ్రఫీ అవార్డును కూడా దసరా సినిమాకు గాను సత్యన్ సూర్యన్ దక్కించుకున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో







ఎన్నికల్లో భారీగా అవకతవకలు

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో 12.5 శాతం ఓట్లు పెరిగాయి

- ఈసీ ప్రకటించిన ఓట్ల లెక్కలకు, తుది ఓటింగ్ శాతానికి మధ్య భారీ తేడా
- ఈవీఎంల యుగంలోనూ ఇంత వ్యత్యాసాలా?
- ఈ ఎన్నికల ఫలితాలు సరైనవేనా?
- కాంగ్రెస్ పార్టీ నేత సందీప్ దీక్షిత్

సాక్షి, న్యూఢిల్లీ: ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సంఘం తొలుత ప్రకటించిన ఓట్ల శాతం కంటే.. తుది ఓటింగ్ 12.5 శాతం పెరగడం పట్ల ఆ పార్టీ నేత సందీప్ దీక్షిత్ విస్మయం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో సందీప్ దీక్షిత్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఓట్ ఫర్ డెమోక్రసీ అనే సంస్థ నివేదికను ఉటంకిస్తూ ఆయన పలు ఆరోపణలు చేశారు. ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించిన ఓట్ల లెక్కలకు, తుది ఓటింగ్ శాతానికి మధ్య భారీ తేడా ఉందన్నారు. ఈవీఎంల యుగంలోనూ ఇంత వ్యత్యాసాలు ఉండటం పట్ల ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇలా వచ్చిన ఎన్నికల ఫలితాలు సరైనవేనా అని నిలదీశారు. ఇంత వ్యత్యాసం ఉండటం మొత్తం ఎన్నికల ప్రక్రియ పైనే పలు ప్రశ్నలను లేవనెత్తుతోందన్నారు. కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఒడిశాలో కూడా 12.5 శాతం ఓట్లు పెరిగాయన్నారు.

ఎన్నికల అవకతవకలతో బీజేపీకి అదనంగా 79 సీట్లు..

ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడటం ద్వారా బీజేపీ 79 సీట్లు అదనంగా గెలుచుకుందని సందీప్ దీక్షిత్ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ శాతం పెరుగుదలకు సంబంధించి రిగ్గింగ్ జరిగిందని అనుమానం వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రాథమిక గణాంకాలతో పోలిస్తే తుది ఓటింగ్ శాతంలో గణనీయంగా వ్యత్యాసాలు ఉండటంపై కేంద్ర ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలన్నారు. పోలింగ్ రోజుల్లో ఎన్నికల సంఘం ప్రకటించిన ఓట్ల లెక్కలకు, తుది ఓటింగ్ శాతానికి మధ్య భారీ వ్యత్యాసం ఉందని పలు సంస్థలు కూడా విశ్లేషించాయన్నారు. జాతీయ స్థాయిలో సగటు వ్యత్యాసం 4.7 శాతం ఉంటే ఎన్నికల ఫలితాలు సరైనవేనా అని సందీప్ దీక్షిత్ ప్రశ్నించారు. ప్రతి దశలో ఓటింగ్ ముగిశాక చాలా రోజుల తర్వాత కానీ ఆ దశకు సంబంధించిన ఓటింగ్ శాతాన్ని ఎన్నికల సంఘం ప్రకటించలేదని గుర్తు చేశారు. ఈవీఎంలతో ఓటింగ్ ప్రారంభమైనప్పుడు, ప్రతి రెండు గంటలకు బూత్‌లో ఎంత ఓటింగ్ జరిగిందనే సమాచారాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉంటుందన్నారు.



ఈసీ వివరణ ఇవ్వకపోతే కోర్టుకెళ్తాం..

ఇంటర్‌నెట్ వంటి సాంకేతిక సమస్యలతో సమాచారం ఇవ్వడంలో ఆలస్యమైందని కేంద్ర ఎన్నికల సంఘం చెబుతోందని సందీప్ దీక్షిత్ మండిపడ్డారు. ఈసీ విడుదల చేసిన డేటాలో వ్యత్యాసం పలు ప్రశ్నలను లేవనెత్తుతోందన్నారు. 2019లోనూ ఈ విధంగానే డేటా విడుదలలో ఆలస్యం జరిగిందని గుర్తు చేశారు. ఓట్ ఫర్ డెమోక్రసీ నివేదిక ప్రకారం.. దేశంలోని 79 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం పెరుగుదల.. బీజేపీ తక్కువ ఓట్ల తేడాతో గెలిచిన దాని కంటే ఎక్కువగా ఉందన్నారు. ఈ నివేదికపై కేంద్ర ఎన్నికల సంఘం నుంచి సంతృప్తికర సమాధానాలు, వివరణ రాకపోతే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

‘కృష్ణా’లో సిరుల పంట

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకటించాల్సి వచ్చింది. ప్రస్తుతం బేసిన్ పరిధిలోని జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, మూసీ తదితర ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీటి లభ్యత ఉండటంతో.. అన్ని ప్రాజెక్టుల కింద పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందనుంది. జూన్‌లో వర్షాకాలం మొదలవగా.. రెండు నెలల్లోనే శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు నిండిపోయాయి. ఎగువ నుంచి కృష్ణాలో భారీ వరద కొనసాగుతోంది. దీనితో పరీవాహక ప్రాంతంలో ఆయకట్టుకు ఈ ఏడాది ఎలాంటి ఢోకా లేకుండా పోయింది. నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారమే నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు సాగునీటి విడుదలను ప్రారంభించడం గమనార్హం. సాగర్ నుంచి ఇంత ముందే నీళ్ల విడుదల చేయడం గత పదేళ్లలో ఇది రెండోసారి. 2021లో సైతం ఆగస్టు 2వ తేదీనే సాగర్ నుంచి సాగునీటి విడుదల ప్రారంభించారు.

గోదావరిలో లోయర్ మానేరు దిగువన కష్టమే..!

గోదావరి నదిలో పైనుంచి వరదలు పెద్దగా రాక.. ఎగువన ఉన్న ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఆశించిన మేరకు లేకుండా పోయింది. ఈ క్రమంలో లోయర్ మానేరు ప్రాజెక్టు వరకు ఉన్న ఆయకట్టు వరకే నీటి సరఫరాపై స్కివం కమిటీ నిర్ణయం తీసుకుంది. దాని దిగువన ఉన్న ప్రాజెక్టులతో పాటు సింగూరు ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీటి సరఫరాపై మరో 15 రోజుల తర్వాత సమావేశమై.. అప్పటి నీటి లభ్యత ఆధారంగా నిర్ణయాలు తీసుకోనున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలుకాగా.. ప్రస్తుతం 42.81 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. ఎగువ నుంచి కాస్త వరద కొనసాగుతోంది. దీనితో ఈ ప్రాజెక్టు కింద మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. సింగూరు ప్రాజెక్టు నుంచి ఘనపూర్ ఆనికట్‌కు నీళ్లను తరలించి దాని కింద ఉన్న 21వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు.

ఖరీఫ్‌లో సాగునీరు సరఫరా చేయనున్న ఆయకట్టు వివరాలివీ..

గోదావరి బేసిన్ పరిధిలో..

ప్రాజెక్టు	ఆయకట్టు (ఎకరాల్లో)
శ్రీరాంసాగర్ స్టేజీ-1	4,27,566
కడెం	66,000
అలీసాగర్	46,507
గుత్ప ఎత్తిపోతల	33,925
నిజాంసాగర్	1,24,254
దేవాదుల	2,08,311
కుమ్రంభీం	14,200
కాళేశ్వరం	98,570
మంథని లిఫ్టు	10,000
ఎగువ మానేరు	13,000
ఘన్‌పూర్	21,625
బొగ్గులవాగు	3,200
సాత్నాల	24,000
మత్తడివాగు	8,500
స్వర్ణ	8,945
గడ్డెన్నవాగు	9,500
రాలివాగు	2,200
వట్టివాగు	1,500
రామడుగు	6,104
కౌలాస్‌నాలా	9,000
బోచారం	10,300
నల్లవాగు	5,800
రామప్ప	6,780
లక్నవరం	8,784
వల్లూరువాగు	7,500
పెద్దవాగు	500
తాలిపేరు	24,700
సదర్‌మాట్	13,120
చౌట్పల్లి హన్మంతరావు	8,297
పాలెం	7,500
నీల్వాయి	8,000
కిన్నెరసాని	10,000

కృష్ణా బేసిన్ పరిధిలో..

ప్రాజెక్టు	ఆయకట్టు (ఎకరాల్లో)
జూరాల	1,09,296
ఆర్డీఎస్	54,000
నాగార్జునసాగర్	6,44,961
మూసీ	30,000
కోయిల్‌సాగర్	35,600
భీమా	1,46,668
నెట్టెంపాడు	12,000
కల్వకుర్తి	2,93,851
ఏఎమ్మార్పీ ఎస్‌ఎల్‌బీసీ	2,66,461
పాకాల	23,193
ఎల్‌టీ బయ్యారం	7,200
ఆసిఫ్‌నగర్	15,245
డిండి	22,975
వైరా	17,390
లంకసాగర్	7,350

కృష్ణమ్మ పరవళ్లు

సాక్షి, హైదరాబాద్: కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువన ఆల్మట్టి నుంచి నాగార్జునసాగర్ దాకా నదిలో భారీ ప్రవాహం కొనసాగుతోంది. పైన ప్రాజెక్టులన్నీ నిండిపోవడంతో వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తున్నారు. దీనితో నాగార్జున సాగర్‌లోకి శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో 3 లక్షల క్యూసెక్కులకుపైగా వరద కొనసాగుతోంది. శ్రీశైలం నుంచి నీటి విడుదలను పెంచిన నేపథ్యంలో.. సాగర్‌కు వరద మరింత పెరిగిపోనుంది. సోమవారం సాయంత్రానికల్లా ప్రాజెక్టు పూర్తిగా నిండి గేట్లు ఎత్తే అవకాశముంది. కృష్ణా ప్రధాన పాయలో వస్తున్న వరదకుతోడు తుంగభద్రలోనూ భారీ ప్రవాహం ఉండటంతో.. ఈ వరద మరికొన్ని రోజుల పాటు కొనసాగనుందని అధికారులు చెప్తున్నారు.



శ్రీశైలం డ్యామ్ పది గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న కృష్ణమ్మ

కృష్ణా ప్రాజెక్టుల్లో నీటి నిల్వ, వరద వివరాలివీ..

ప్రాజెక్టు	గరిష్ట మట్టం	గరిష్ట నిల్వ	ప్రస్తుత మట్టం	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
ఆల్మట్టి	1,705	129.72	1692.16	72.89	3,13,000	2,75,000
నారాయణపూర్	1,615	37.64	1608.30	28.88	2,60,000	2,56,271
జూరాల	1,045	9.66	1043.05	8.45	2,90,000	2,70,452
శ్రీశైలం	885	215.81	882.50	202.04	4,33,088	5,52,641
నాగార్జునసాగర్	590	312.05	565.00	244.15	3,03,741	39,741

(శనివారం సాయంత్రం 6 గంటలకు.. నీటి మట్టం అడుగుల్లో.. నిల్వ టీఎంసీల్లో.. ఇన్‌ఫ్లో/అవుట్‌ఫ్లో క్యూసెక్కులలో)

ఆగిన సిరిమువ్వల సవ్వడి..

యామినీ కృష్ణమూర్తి శివైక్యం

వయోభారం, అనారోగ్య సమస్యలతో తుదిశ్వాస విడిచిన నాట్య మయూరి

సాక్షి, న్యూఢిల్లీ/మదనపల్లె/అమరావతి: ప్రముఖ భరతనాట్య, కూచిపూడి, ఒడిస్సీ నృత్య కళాకారిణి, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ యామినీ కృష్ణమూర్తి (84) కన్నుమూశారు. వయసు రీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో ఏడు నెలలుగా బాధపడుతున్న ఆమె ఢిల్లీలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. ఆమె పార్థివదేహాన్ని ఢిల్లీ గ్రీన్‌పార్క్‌లోని డి-బ్లాక్‌లో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు గ్రీన్‌పార్క్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు వెల్లడించారు. చాలా ఏళ్లుగా ఢిల్లీలోనే ఉంటూ ప్రదర్శనలు ఇస్తున్న కృష్ణమూర్తి ఈ ఏడాది జనవరిలో వయోభార సంబంధిత సమస్యలతో అపోలో ఆస్పత్రిలో చేరారు. అప్పట్నుంచి ఆస్పత్రి ఐసీయూలోనే వైద్యులు చికిత్స అందిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఆరోగ్యం విషమించి తుదిశ్వాస విడిచారు.

17వ ఏట తొలి ప్రదర్శన

యామిని పూర్తిపేరు యామినీ కృష్ణమూర్తి పూర్ణతిలకం. చిత్తూరు జిల్లా మదనపల్లెలో 1940 డిసెంబర్ 20న ముంగర కృష్ణమూర్తి, లక్ష్మి దంపతులకు జన్మించారు. తండ్రి కృష్ణమూర్తి సంస్కృత పండితులు. నృత్యంపై ఉన్న మమకారంతో మదనపల్లెలోని ఓ డ్యాన్స్ మాస్టర్ వద్ద చిన్న వయసులోనే నాట్యం నేర్చుకొనేందుకు యామిని వెళ్లారు. ఆ తర్వాత కొంతకాలానికి తమిళనాడులోని చిదంబరంలో స్థిరపడ్డారు. తన తండ్రి ప్రోత్సాహంతో 5వ ఏట చెన్నైలోని రుక్మిణీదేవి అరండేల్ కళాక్షేత్రంలో భరతనాట్యం నేర్చుకోవడం ప్రారంభించారు. అనంతరం కూచిపూడి, ఒడిస్సీ కూడా అభ్యసించారు. ఎండీ రామనాథన్ వద్ద కర్ణాటక సంగీతం, కల్పక్కం స్వామినాథన్ దగ్గర వీణ నేర్చుకున్నారు. యామిని తన తొలి ప్రదర్శనను తన 17వ ఏట 1957లో చెన్నైలో ఇచ్చారు.

ఖండాంతరాలను దాటిన ప్రతిభ

యామిని భరతనాట్య ప్రతిభ ఖండాతరాలను దాటింది. 17 ఏళ్ల వయసులో తొలిసారి ఆస్ట్రేలియాలో భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ఆ తర్వాత అమెరికా, యూరోప్, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, న్యూజిలాండ్, ఇండోనేసియా, థాయ్‌ల్యాండ్, సింగపూర్, మయన్మార్ వంటి దేశాల్లో భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలతో మంత్రముగ్ధుల్ని చేశారు.



ఢిల్లీలో నృత్య కౌస్తుభ కల్చరల్ సొసైటీ యామినీ స్కూల్ ఆఫ్ డాన్స్ పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి యువతకు భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో శిక్షణ ఇస్తున్నారు. 2014లో మహిళా దినోత్సవం సందర్భంగా శాంభవి స్కూల్ ఆఫ్ డాన్స్ సంస్థ యామినికి నాట్య శాస్త్ర పురస్కారాన్ని అందించింది. ఢిల్లీలోని ఇందిరా ప్రియదర్శిని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మ్యూజిక్ అండ్ డాన్స్ అనే సంస్థకు డైరెక్టర్‌గా ఆమె కొన్నేళ్లు సేవలందించారు.

‘డకోటా’ ఫ్లైట్‌లో పాకిస్తాన్‌కు..

యామినీ కృష్ణమూర్తి నాట్యం గురించి తెలుసుకున్న పాకిస్తాన్ దేశస్తులు.. అక్కడ ప్రదర్శన నిమిత్తం ఆహ్వానించారు. దీంతో 1970లో ఆమె లాహోర్‌లో ప్రదర్శన ఇచ్చారు. ఆ సమయంలో భారత్ నుంచి ‘డకోటా’ ఫ్లైట్‌లో అతికష్టం మీద పాక్‌కు వెళ్లాల్సి వచ్చిందని పలు సందర్భాల్లో ఆమె ప్రస్తావించారు. భరత నాట్యం, కూచిపూడి నాట్యప్రదర్శలను చూసిన పాకిస్థానీలు మంత్రముగ్ధులై పలుమార్లు ఆమెను ఆహ్వానించడం విశేషం. ప్రముఖ సేవామూర్తి మదర్ థెరెసా చేతుల మీదుగా యామిని జ్ఞాపికను అందుకోవడం విశేషం.

వివాహం చేసుకోకుండా..

నాట్య రంగానికే జీవితాన్ని అంకితం చేసిన యామిని వివాహం చేసుకోలేదు. తన నృత్య జీవిత విశేషాలను, నృత్యం నేర్చుకొనే క్రమంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులు, నేర్పించిన గురువుల వివరాలతో ‘ఎ ప్యాషన్ ఫర్ డ్యాన్స్’ పేరుతో పుస్తకం రచించారు.

అనేక అవార్డులు ఆమె సొంతం

యామినీ కృష్ణమూర్తి దేశ, విదేశాల్లో కూచిపూడి నృత్యానికి ఎంతో పేరు, ప్రఖ్యాతలు తెచ్చిపెట్టారు. కర్ణాటక సంగీతం నేర్చుకున్న యామిని.. పాటపాడుతూ నృత్య ప్రదర్శనలు ఇచ్చేవారు. భరత నాట్యంలో యామిని ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆమెను 1968లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్, 2016లో పద్మవిభూషణ్ పురస్కారాలతో సత్కరించింది. టీటీడీ ఆస్థాన నర్తకిగానూ యామిని కొనసాగారు.

భాగ్యనగరంతో అనుబంధం

సాక్షి, హైదరాబాద్: యామినీ కృష్ణమూర్తికి హైదరాబాద్‌తో అనుబంధం ఉంది. సౌత్ ఇండియా కల్చరల్ అసోసియేషన్, కళాసాగర్ వంటి సంస్థలు ఏర్పాటు చేసిన అనేక సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆమె దశావతారం, కృష్ణ శబ్దం తదితర ప్రదర్శనలిచ్చి ప్రేక్షక లోకాన్ని మైమరిపించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన ఆమె నృత్య ప్రదర్శన హైదరాబాద్ కళాప్రియులకు సుపరిచితం. తెలుగు విశ్వవిద్యాలయం ఆమెను సిద్ధేంద్రయోగి పురస్కారంతో గౌరవించింది. 2012లో హైదరాబాద్ రవీంద్రభారతిలో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవాల్లో ప్రదర్శనలిచ్చారు.

ప్రముఖుల సంతాపం

ప్రముఖ భరతనాట్య విద్వాంసురాలు యామినీ కృష్ణమూర్తి మృతిపట్ల పలువురు కళాకారులు, రాజకీయ ప్రముఖులతోపాటు కేంద్ర సంగీత నాటక అకాడమీ, దాని అనుబంధ సంస్థలు సంతాపం వ్యక్తం చేశాయి. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఏపీ సీఎం చంద్రబాబు, పద్మశ్రీ డాక్టర్ జి. పద్మజారెడ్డి తదితరులు సంతాపం తెలిపారు. కళా రంగానికి ఆమె అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు.

కళారంగానికే ప్రత్యేక గుర్తింపు తెచ్చారు

యామినీ కృష్ణమూర్తి భరత నాట్య, కూచిపూడి నృత్య కళకు విశిష్ట సేవలందించారు. ఎంతో మంది యువతకు నాట్యం నేర్పించి దేశంలోనే కళా రంగానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారు. ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా.

-సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ

శాస్త్రీయ నృత్య రంగానికి తీరని లోటు

భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో ఎనలేని ప్రతిభ చాటి.. అత్యున్నత స్థాయికి ఎదిగిన ప్రముఖ నృత్య కళాకారిణి పద్మవిభూషణ్ డాక్టర్ యామినీ కృష్ణమూర్తి మరణం శాస్త్రీయ నృత్య రంగంలో తీరని లోటు. ఆమె తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణం. ఆమె ఆత్మకు శాంతి కలగాలి.

– వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత

అశాస్త్రీయంగా కాళేశ్వరం నిర్మాణం

- అందుకే మేడిగడ్డ బరాజ్ కుంగింది
- దివంగత వైఎస్సార్ ఇచ్చినట్టుగానే అందరికీ రుణమాఫీ
- మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, సీతక్క

భూపాలపల్లి: ‘ఇటీవల కొందరు కాళేశ్వరం వచ్చి వెళ్లి లేనిపోని ఆరోపణలు చేశారు. వారే కాళేశ్వరం ప్రాజెక్టును అశాస్త్రీయంగా నిర్మించి, బరాజ్‌లు కుంగిపోవడానికి కారణమై, ఇప్పుడు మాపై ఆరోపణలు చేసుడేంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం మాకు ఇష్టం లేకపోతే ఆనాడే మేం అడ్డుకునే వాళ్లం. కానీ వాళ్లు ఏదో చేస్తారనుకుంటే ఈ ప్రాంతానికి కనీసం ఒక్క ఎకరానికి కూడా నీరు అందించలేకపోయారు’ అని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్ వద్ద ఇండస్ట్రియల్ పార్కు పనులను శనివారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో కలిసి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడారు. గడిచిన పదేళ్లలో అధికారంలో ఉండి ఏం చేయని వారు ఇప్పుడు అసెంబ్లీలో రాద్ధాంతాలు చేస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం జాబ్ కేలండర్ తీసుకొచ్చిందని, స్కిల్ ఇండియా ద్వారా గ్రామీణ ప్రాంత యువతకు సైతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రతీ రైతుకు రుణమాఫీ జరిగిందని, అలాగే ఇప్పుడు కూడా అర్హులైన వారందరికీ రుణమాఫీ చేస్తామన్నారు. రుణమాఫీ అందని వారి గురించి ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్ హయాంలో కావాల్సినన్ని ఇళ్లు ఎలా మంజూరు అయ్యాయో, అలాగే ఇప్పుడు కూడా అలాగే చేస్తామని హామీ ఇచ్చారు. గత పాలకులు ధరణి పేరిట పేదల భూములు కాజేశారని, దీంతో వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ధరణితోనే బీఆర్‌ఎస్ పూర్తిగా దెబ్బతిందని, ఆ విషయాన్ని ఆ పార్టీ ఇప్పటికీ గ్రహించడం లేదన్నారు. నెలరోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల పేరిట బీఆర్‌ఎస్ మోసం చేసిందని, తాము మొదటి విడతలోనే 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేసి ఇందిరమ్మ రాజ్యం తీసుకువస్తామని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు.



ఇండస్ట్రియల్ పార్కు పనులకు శంకుస్థాపన చేస్తున్న శ్రీధర్‌బాబు, పొంగులేటి, సీతక్క

చదువులకూ ‘చంద్ర’ గ్రహణం!

- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో విద్యార్థులకు ఇక్కట్లు
- రెండు నెలలవుతున్నా పూర్తి స్థాయిలో అందని స్టూడెంట్ కిట్లు
- 60 శాతం విద్యార్థులకు కూడా చేరని యూనిఫారాలు
- కొలతల తేడాతో మూలకు చేరిన బూట్లు
- ప్రతిరోజు ఒక స్కూలు నుంచి మరో స్కూలుకు ‘సర్దుబాటు’
- ఏజెన్సీల మార్పుతో గందరగోళం.. రుచి మారిన మధ్యాహ్న భోజనం
- అన్ని స్కూళ్లలోనూ వేధిస్తున్న టీచర్ల కొరత

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఒక్క రూపాయీ గ్రాంట్ రాలే!

- గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద తొలి త్రైమాసికంలో ఏమీ ఇవ్వని కేంద్రం
- గత ఆర్థిక సంవత్సరంలో జూన్ నాటికి వచ్చిన గ్రాంట్లు రూ.2,317 కోట్లు
- రూ.50 వేల కోట్లకు చేరిన మూడు నెలల రాష్ట్ర పద్దు
- మొత్తం రాబడుల్లో 80శాతానికి పైగా పన్ను ఆదాయమే..
- అప్పులు తెచ్చింది రూ.13 వేల కోట్లు... అప్పుల కింద కట్టింది రూ.6 వేల కోట్లు
- ఒక్క జూన్ నెలలోనే రూ.6వేల కోట్లు అప్పు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం ముగిసిపోయింది. కానీ కేంద్రం నుంచి రాష్ట్రానికి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో ఒక్క రూపాయి కూడా రాలేదు. ఇప్పుడేకాదు చాలా ఏళ్లుగా రాష్ట్రానికి గ్రాంట్లు ఇచ్చే విషయంలో కేంద్రం శీతకన్ను వేస్తోందని.. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించిన దాంట్లో సగం కూడా నిధులను మంజూరు చేయడం లేదని అధికార వర్గాలు చెప్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలల్లో రూ.2,317 కోట్లు అయినా ఇవ్వగా.. ఈసారి అయితే ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం గమనార్హం. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో రూ.21 వేలకోట్లకుపైగా వస్తాయని బడ్జెట్‌లో అంచనా వేసుకుంది.


పన్నుల వసూళ్లతోనే..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్ 30వ తేదీ వరకు ఆదాయ, వ్యయాలపై రాష్ట్ర ప్రభుత్వం కాగ్‌కు ఇచ్చిన నివేదికలోని గణాంకాల ప్రకారం పన్ను రాబడులు ఆశించిన మేర వస్తున్నాయి. ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో పన్ను రాబడులు రూ.11,464 కోట్లు వచ్చాయి. మే నెలలో కొంత తగ్గి రూ.10,954 కోట్లు వచ్చినా, జూన్‌లో మళ్లీ పుంజుకుని రూ.12,190 కోట్లు వచ్చాయి.

మొత్తంగా మూడు నెలల్లో కలిపి అన్నిరకాల రాబడులు, పన్నుల్లో వాటా, అప్పులు కలిపి రూ.48,790.66 కోట్లు ఖజానాకు సమకూరగా.. అందులో రూ.34,609 కోట్లు పన్ను ఆదాయం కిందే అందాయి. అంటే మొత్తం రాబడిలో 80శాతానికిపైగా పన్నుల రూపంలోనే ఖజానాకు వచ్చినట్టు అర్థమవుతోంది.

మూడు నెలల్లో రూ.13,171 కోట్ల అప్పులు

ఇక ఈ మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.13,171 కోట్లు అప్పుల రూపంలో సమకూర్చుకుంది. ఏప్రిల్‌లో రూ.2,246 కోట్లు, మేలో రూ.5,133 కోట్లు, జూన్‌లో రూ.5,790 కోట్లు రుణాలు తీసుకుంది. ఈ మొత్తంలో సగం వరకు గతంలోని అప్పుల అసలు, వడ్డీలకు చెల్లించినట్టు కాగ్‌కు సమర్పించిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఏప్రిల్‌లో రూ.1,865 కోట్లు, మేలో రూ.1,864 కోట్లు, జూన్‌లో రూ.2,203 కోట్లు అప్పుల కింద చెల్లించారు. ఇక ఇతర ఖర్చుల విషయానికి వస్తే జీతాలకు రూ.11,026.69 కోట్లు చెల్లించారు. గత ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలల్లో చెల్లించిన దానికంటే ఇది రూ.1,300 కోట్లు అధికం. పింఛన్ల కోసం రూ.4,311.62 కోట్లు, సబ్సిడీల కింద రూ.3,354 కోట్లు చెల్లించారు. మొత్తం రాబడిలో రూ.45,320.12 కోట్లు ఖర్చయిందని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం 4-8-2024



క్లోజ్ ఫ్రెండ్స్

మాది ఎయిర్‌ఫోర్స్ బ్యాచ్

'ఎయిర్‌ఫోర్స్ బ్యాచ్' నుంచి ఎయిర్ బస్ దాకా... ఆఫర్‌లో ఫుడ్ ఆర్డర్ చేసుకున్న రోజుల నుంచి, ఫైవ్‌స్టార్ ఫుడ్ ఆర్డర్ చేసుకునే రోజుల దాకా... రెండు ఐదు రూపాయల కాయిన్స్ కోసం వెతికిన రోజుల నుంచి కోట్లు లెక్క పెట్టుకునే రోజుల దాకా... ఇద్దరూ విజయప్రయాణాలు చేశారు. ఇండస్ట్రీలో నిలిచారు. విజయ్ దేవరకొండ, తరుణ్ భాస్కర్... ఇద్దరూ మంచి స్నేహితులనే విషయం తెలిసిందే. 'ఫ్రెండ్‌షిప్ డే' సందర్భంగా వీరి స్నేహంలోని ముచ్చట్లను 'సాక్షి'తో తరుణ్ భాస్కర్ ప్రత్యేకంగా పంచుకున్నారు.

● విజయ్‌తో మీ స్నేహం మొదలైన రోజులను షేర్ చేసుకుంటారా?

తరుణ్ భాస్కర్: మహేశ్వరి చాంబర్స్‌లో నాకో ఆఫీస్ ఉండేది. వెడ్డింగ్ ఫిల్మ్స్, కార్పొరేట్ ఫిల్మ్స్, షార్ట్ ఫిల్మ్స్ చేసేవాళ్లం. 2011 అనుకుంటా. ఆ టైమ్‌లో థియేటర్ ఆర్టిస్ట్స్‌ని కలిసేవాడిని. అప్పుడే విజయ్‌ని కలిశా. పరిచయం బాగా పెరిగింది. 'డబ్బులు ఉన్నా లేకపోయినా ఫర్వాలేదు... షార్ట్ ఫిల్మ్స్ చేసేద్దాంరా' అని విజయ్ కాన్ఫిడెంట్‌గా అనేవాడు. ఒక షార్ట్ ఫిల్మ్ కూడా అనుకున్నాం కానీ కుదరలేదు. ఫైనల్లీ 'పెళ్ళి చూపులు' సినిమా చేశాం. అప్పట్లో మాది ఎయిర్‌ఫోర్స్ బ్యాచ్ (ఖాళీగా తిరిగేవాళ్లను అలా అంటుంటారు). ఇక 'పెళ్ళి చూపులు'ని ఒక ప్యాషన్‌తో చేశాం. నా వల్ల విజయ్‌కి హిట్ వచ్చింది.. విజయ్ వల్ల నాకు అనే ఫీలింగ్ లేదు. సాధించాం అనే పొగరు లేదు. మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేసుకుంటూ చేశాం. మా ప్యాషన్‌కి దక్కిన సక్సెస్ అనుకుంటాను.

● మీ జర్నీ ఇంతదాకా వచ్చిన విషయాన్ని అప్పుడప్పుడూ మాట్లాడుకుంటారా?

కోవిడ్ టైమ్‌లో విజయ్ ఫోన్ చేసి, 'అరేయ్... మనం ఎక్కడ స్టార్ట్ అయ్యాం... ఇంత దూరం వచ్చాం.. అస్సలు అనుకోలేదు కదరా... లైఫ్‌లో ఒక్కో పాయింట్ ఎలా టర్న్ అయిందో కదా. దీన్నే డెస్టినీ అంటారు' అని మాట్లాడుకున్నాం.

● అప్పట్లో మీ ఇద్దరూ డబ్బులు లేక ఇబ్బంది పడేవారా? డబ్బులు ఇచ్చి పుచ్చుకునేవారా?

డబ్బులంటే... ఒకరికొకరు ఇచ్చుకునే రేంజ్ ఎవరికీ ఉండేది కాదు. అయితే కలిసి బిజినెస్ చేద్దామని అనుకునేవాళ్లం. నాకు బాగా గుర్తున్న ఇన్సిడెంట్ ఏంటంటే... ఒకసారి ఏదో కొనడానికి విజయ్‌ని పది రూపాయలు అడిగాను. అప్పుడు 'పెళ్ళి చూపులు' సినిమా ట్రైల్ జరుగుతోంది. కారులో రెండు ఐదు రూపాయల బిళ్లల కోసం ఇద్దరం బాగా వెతికాం... దొరకలేదు (నవ్వుతూ). ఆ పరిస్థితి ఎప్పటికీ గుర్తుంటుంది.

మా కల ఒకటే

- విజయ్ దేవరకొండ

మేం ఇద్దరం చిన్నప్పట్నుంచి కలిసి పెరిగిన వాళ్లం కాదు... ఒకే స్కూల్‌లో చదువుకున్న వాళ్లమూ కాదు. నేను పుట్టపర్తిలో, తరుణ్ హైదరాబాద్‌లో చదువుకున్నాడు. ఎక్కడెక్కడో పెరిగినప్పటికీ మా ఇద్దరి కల (సినిమా) ఒకటే. నా 'ఎవడే సుబ్రమణ్యం' సినిమా చూసి, తరుణ్ నాతో 'పెళ్ళి చూపులు' సినిమా చేద్దాం అనుకున్నాడు. అప్పుడప్పుడే మా పరిచయం బలపడుతోంది. జేబులో రూపాయి లేకపోయినా చాలా కాన్ఫిడెంట్‌గా ఉండేవాళ్లం. ఎంతో నమ్మకంగా 'పెళ్ళి చూపులు' చేసి, సక్సెస్ అయ్యాం. ఆ సినిమా తర్వాత తరుణ్‌కి చాలా అవకాశాలు వచ్చినా, మళ్లీ కొత్తవాళ్ల తోనే చేద్దాం అనుకున్నాడు. తన మీద, తన స్క్రిప్ట్ మీద తనకు చాలా నమ్మకం. తరుణ్‌లో ఆ విషయం నాకు చాలా నచ్చుతుంది. ఏదైనా స్క్రిప్ట్‌తో నా దగ్గరకు రారా అంటుంటాను... వస్తా అంటాడు. ఎక్కడో స్టార్ట్ అయి, చాలా దూరం వచ్చిన మా ఈ జర్నీలో ఎన్నో కష్టాలు చూశాం... ధైర్యంగా ఎదుర్కొన్నాం. గొప్పగా ఏదో చేస్తాం అనే నమ్మకంతో ఉండేవాళ్లం. మాతో పాటు మా ఫ్రెండ్‌షిప్ కూడా పెరుగుతూ వచ్చింది. లైఫ్‌లో ఒక మంచి ఫ్రెండ్ ఉండటం అనేది చాలా హ్యాపీగా ఉంటుంది.

● మీ ఇద్దరి కుటుంబాల మధ్య అనుబంధం?

మేమంతా ఒక ఫ్యామిలీ అని మా ఇద్దరి ఇంట్లోనూ అనుకుంటారు. విజయ్ నాన్న ఎలాంటి ఫిల్టర్ లేకుండా నాతో మాట్లాడతారు... టైమ్ వేస్ట్ చేస్తున్నావని తిడుతుంటారు. ఆ ప్రేమ నాకు నచ్చుతుంది. అలాగే మా అమ్మ చేసే బిర్యానీ విజయ్‌కి చాలా ఇష్టం. మా ఇంటికి వచ్చినప్పుడు డైట్ అంతా గడప దగ్గరే పెట్టి లోపలికి వస్తాడు.

మీ బాయ్స్‌కి 'అడ్డా' ఉంటుంది కదా... అప్పట్లో మీ అడ్డా ఎక్కడ?

నెక్లెస్ రోడ్, మహేశ్వరి చాంబర్స్ దగ్గర చాయ్ బండి, ఆ పక్కన చైనీస్ ఫుడ్ సెంటర్. అక్కడే ఏదొకటి తింటూ సినిమాల గురించి మాట్లాడుకునేవాళ్లం. ఆ మధ్య అటువైపు వెళ్లినప్పుడు ఆ చాయ్ కేఫ్ దగ్గర థమ్సప్ లోగోలో విజయ్ థమ్సప్ తాగే ఫొటో కనిపించింది. అది ఫొటో తీసి, విజయ్‌కి పంపిస్తే ఎక్కడరా ఇది అని అడిగాడు. మనం ఒకప్పుడు కూర్చున్న కేఫ్ దగ్గర అన్నాను. మాకు అదో ఎమోషనల్ మూమెంట్. ఇక అప్పట్లో ఎక్కడ ఆఫర్‌లో ఫుడ్ ఉంటే అక్కడ తినేవాళ్లం (నవ్వుతూ). ఇప్పుడు ఆ ప్లేసెస్‌కి అంత ఫ్రీగా వెళ్లలేం. అందుకే ఇప్పుడు మాస్క్ లేకుండా సూపర్ మార్కెట్‌కి వెళ్లి ఓ పాల ప్యాకెట్ కొనుక్కురా దమ్ముంటే అని విజయ్‌తో అంటుంటాను. అది మాత్రం నా వల్ల కాదురా అంటాడు.

● మీరు, విజయ్ గొడవలు పడిన సందర్భాలు...

'పెళ్ళి చూపులు' అప్పుడు గొడవపడేవాళ్లం. నాకు ఎవరైనా సలహాలిస్తే నచ్చేది కాదు. ఇలా చేస్తే బాగుంటుందని క్రియేటివ్‌గా కొన్ని చెప్పేవాడు విజయ్. అక్కడ గొడవలు పడేవాళ్లం. ఫైనల్‌గా విజయ్ నాన్న సాల్వ్ చేశారు. రేయ్.. వాడు చెప్పిన మాట విను అని విజయ్‌తో వాళ్ల నాన్న అంటే, ఓకే డాడీ అన్నాడు. నీ డైరెక్షన్ నీది.. నా యాక్టింగ్ నాది అని ఫిక్స్ అయి, గొడవలు మానేశాం. ఇప్పుడు కూడా ఎలాంటి కథలతో సినిమాలు చేయాలి? కమర్షియల్‌గా ఎలా చేయాలి? అని చర్చించుకుంటాం. విజయ్ బాలీవుడ్ వరకూ వెళ్లాడు కాబట్టి తన ఫీడ్‌బ్యాక్ బాగుంటుంది. తనకు చాలా అవగాహన ఉంది.

● ఇద్దరూ కన్నీళ్లు పెట్టుకున్న సందర్భం...

బాధలో పెట్టుకున్నవి చాలా ఉన్నాయి. కానీ 'పెళ్ళి చూపులు' సక్సెస్‌కి ఎమోషనల్ అయ్యాం. అప్పుడు విజయ్‌ది, నాది బ్యాడ్ సిట్యువేషన్... నిరాశలో ఉన్నాం. మా ఇంట్లో పరిస్థితులు బాలేదు. మా నాన్న సంవత్సరీకం కూడా. ఆ టైమ్‌లో వచ్చినన్ని అప్స్ అండ్ డౌన్స్ మాకెప్పుడూ రాలేదు. ఆ పరిస్థితుల్లో చేసిన సినిమా హిట్ కావడంతో ఎమోషన్‌తో కన్నీళ్లు వచ్చాయి.

మీ ఫస్ట్ సినిమాలో విజయ్‌ని 'పెళ్ళి చూపులు'కి పంపించారు. మరి రియల్ లైఫ్‌లో విజయ్‌ని పెళ్లి కొడుకుగా చూడాలని లేదా?

కచ్చితంగా ఉంది. మా మధ్య ఆ విషయం గురించి చర్చకు వస్తుంటుంది. కానీ అవి వ్యక్తిగతం కాబట్టి బయటకు చెప్పలేను. అయితే నాకు హండ్రెడ్ పర్సంట్ విజయ్‌ని ఫ్యామిలీ మేన్‌గా చూడాలని ఉంది. ఎందుకంటే తనలో మంచి ఫ్యామిలీ మేన్ ఉన్నాడు. మంచి భర్త, తండ్రి కాగలుగుతాడు. విజయ్ ఆ లైఫ్‌ని కూడా ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నా. నా ఫ్రెండ్ పక్కా 'జెంటిల్‌మేన్'.

● విజయ్‌తో మళ్లీ సినిమా ఎప్పుడు?

విజయ్ నా ట్రంప్ కార్డ్. గేమ్‌లో ఎప్పుడైనా కొంచెం అటూ ఇటూ అయితే ఆ ట్రంప్ కార్డ్ వాడుకుంటా. ఆ టైమ్ దగ్గరికొచ్చింది. నాక్కూడా ఎక్కువమంది ఆడియన్స్‌కి రీచ్ కావాలని ఉంది. మా కాంబినేషన్‌లో సినిమా ఉంటుంది.

● విజయ్ లాంటి ఫ్రెండ్ ఉండటం గురించి?

విజయ్ ప్రతి సక్సెస్‌లో నా విజయం ఒకటి కనబడుతుంటుంది. తను నా హోమ్ బాయ్... నా డార్లింగ్. విజయ్ అవుట్‌సైడర్‌గా ఇండస్ట్రీకి వచ్చి, ఆ స్టేటస్‌కి రావడమనేది చాలామందికి ఆదర్శంగా ఉంటుంది. కొన్నేళ్ల తర్వాత కూడా ఆ అచీవ్‌మెంట్ గురించి మాట్లాడుకుంటారు. విజయ్ జర్నీలో నేనో చిన్న పార్ట్ అవడం గర్వంగా ఉంటుంది.

- డి.జి. భవాని

నివాళి

నాట్యం కోసమే పుట్టాను



సుప్రసిద్ధ నాట్యకళాకారిణి, భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ నృత్యాలలో నిష్ణాతురాలు, చిత్తూరు జిల్లా మదనపల్లిలో జన్మించి తమిళనాడులోని చిదంబరంలో పెరిగిన యామినీ కృష్ణమూర్తి శనివారం ఢిల్లీలో కన్నుమూశారు. ఆమె మృతికి నివాళిగా ఆమె గతంలో సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు...

యామిని అసలు పేరు పూర్ణతిలక. నాట్యంలో అనేక అవార్డులు గెలుచుకున్నారు. 2017లో 'నటరాజ డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ' వారి జీవిత సాఫల్య పురస్కారం అందుకోడానికి విజయవాడ వచ్చిన సందర్భంగా సాక్షి ఫ్యామిలీ.. యామినితో ముచ్చటించింది.

పదేళ్లకే నాట్యంలో నైపుణ్యం

యామిని తండ్రి కృష్ణమూర్తి కూతుర్ని కూడా తనలా పండితురాలిని చేయాలనుకున్నారు. అనుకోవడమే కాదు చేశారు కూడా! అందుకోసం రెండు ఇళ్లు, కొంతపొలం కూడా అమ్మేశారు. "మా నాన్నగారికి నన్ను విద్వాంసురాలిని చేయాలని బలమైన కోరిక ఉండేది. నేనా అస్సలు కుదురు లేని అమ్మాయిని. ఎప్పుడు చూసినా చెట్లు ఎక్కడం, గోడలు దూకడం... ఒక్క క్షణం కూడా కదలకుండా కూర్చునేదాన్ని కాదు. నాలో నాన్నగారికి ఏమి కనిపించిందో కాని, నా ఏడవ ఏటే భరతనాట్యం నేర్పించడం ప్రారంభించారు. అయితే అందుకు ఒక సంఘటన కారణం అయింది... వేదాంతం రాఘవయ్య గారి 'రైతు బిడ్డ' సినిమా చూశాక నాకు నాట్యం నేర్పించాలనే కోరిక కలిగిందట నాన్నగారికి. అప్పటికే వెంపటి పెద సత్యం, చినసత్యం, పసుమర్తి కృష్ణమూర్తి వీరంతా సినిమాలకి వెళ్లిపోయారు. వేదాంతం లక్ష్మీనారాయణ గారి దగ్గర నా కూచిపూడి నాట్యం ఆరంభం కావడమేంటి... పది సంవత్సరాల వయసు వచ్చేసరికి నాట్యంలో నైపుణ్యం సాధించాను" అని తన నాట్యప్రస్థానం గురించి చెప్పారు యామిని. తండ్రి ఆమెను మొదట చెన్నైలోని రుక్మిణీ అరండేళ్ కళాక్షేత్రకు తీసుకువెళ్లారు. యామిని నాట్యానికి ముగ్ధులయిన రుక్మిణీ అరండేళ్, ఆమెకు తన దగ్గరే నాట్యశిక్షణ ప్రాంభించారు.

వాళ్లు నన్ను 'బిజిలీ' అన్నారు

నేను నాట్యం కోసమే పుట్టాను. నా జీవితాన్ని నాట్యానికే అంకితం చేశాను. వివాహానికి దూరంగా ఉన్నాను. మధ్యప్రదేశ్‌లో బందిపోట్ల దగ్గర సైతం రెండుసార్లు ప్రదర్శన ఇచ్చాను. నాన్నగారు భయపడొద్దని చెప్పారు. వారు నా నాట్యం మెచ్చుకోవడమే కాదు, నన్ను బిజిలీ అన్నారు.



భరతనాట్యంతోపాటే కూచిపూడి కూడా...

భరతనాట్యం నేర్చుకునే సందర్భంలోనే కూచిపూడి నాట్యంవైపు యామిని మనసు మళ్లింది. ఆ తర్వాత కూచిపూడి వైభవానికి ఆమె పాటుపడ్డారు. అది చాలా చిత్రంగా జరిగింది. తర్వాత ప్రముఖ ఒడిస్సీ ఆచార్యులు కేలూచరణ్ మహాపాత్ర దగ్గర ఆమె ఒడిస్సీ నృత్యం అభ్యసించారు. "నేను మూడు గంటల పాటు చేసే నా నాట్యప్రదర్శనలో కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ... ఒక్కోటి గంటసేపు ప్రదర్శించేదాన్ని.

ఇల్లు నటరాజ ఆలయానికి దగ్గర కావడం నా సుకృతం

మా ఇల్లు, చెన్నైలోని చిదంబర నటరాజ దేవాలయానికి చాలా దగ్గర కావడంతో, దేవాలయ కుడ్యాల మీద కొలువుతీరిన శిల్పాల భంగిమలు నా మీద చెరగని ముద్ర వేశాయి. "రోజూ గుడికి వెళ్లేదాన్ని. ఆ శిల్పాలు చూసి ఇంటికి వచ్చాక, అదే భంగిమలో నిలబడేదాన్ని. నాకు నాట్యభంగిమలు, ముద్రలు అందంగా అమరడానికి ఇది ఒక కారణం అయి ఉంటుంది" అని వివరిస్తూనే "ఇక్కడ మరొక విషయం చెప్పాలి. నాకు పండుగలన్నీ నాట్యవేదిక మీదే జరిగేవి. ప్రతి పండుగ సందర్భంలో నిర్వహించే వేడుకలలో నా నాట్యం తప్పనిసరిగా ఉండటమే ఇందుకు కారణం" అని చెప్పారు యామిని.

ఇందిరాగాంధీకి చాలా ఇష్టం

నాటి ప్రధాని ఇందిరాగాంధీకి నేనంటే చాలా ఇష్టం. ఢిల్లీలో ఏ ప్రభుత్వ కార్యక్రమం ఉన్నా, ఏ పండుగ సంబరాలు ఉన్నా వెంటనే "యామిని ఉందా" అని అడిగేవారు. నాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ సమక్షంలో 'క్షీరసాగరమథనం' నృత్యరూపకం ప్రదర్శించడం ఒక మధురానుభూతి. కలకత్తా ప్రజలను చూస్తే 'ఆర్ట్ ఈజ్ ఇన్ దెయిర్ హార్ట్స్' అనిపిస్తుంది. నేను లోన్లీ పర్సన్ కాను, ఎలోన్‌గా ఉంటాను, డిలైటెడ్‌గా ఉన్నాను.

విమర్శించాలనుకునేవారు... సూర్యుడు ఉదయం తూర్పున ఉదయిస్తాడు, సాయంత్రానికి పడమట అస్తమిస్తాడు అని - సూర్యుడిని కూడా విమర్శిస్తారు.

ఫ్రెండ్‌షిప్ డే

అలనాటి స్నేహమా జ్ఞాపకాలు పదిలమా

జీవన మార్గాలను వెతుక్కుంటూ బహుదూరం ప్రయాణించాము. బరువు బాధ్యతల్లో పడి పాత స్నేహాలు మరిచాము. ఇన్నాళ్లు గడిచాక, ఏదో ఒక సందర్భంలో... ఆనాటి మిత్రురాలు గుర్తుకొస్తే వెచ్చబడ్డ కళ్లతో తలుచుకున్నాము. అలనాటి స్నేహమా... నీ చిరునామా ఎక్కడ అని అడిగితే సమాధానం దొరుకుతుందా? ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా గ్రూప్ ఫోటోలను చూసి తమ స్నేహితురాళ్లను తలుచుకుంటున్న సాక్షి పాఠకులు...

గోదావరిఖనిలో ఒకే వీధిలో



ఇందులో ఎడమవైపు నుంచి రెండోవ్యక్తిని నేను. మిగిలిన ముగ్గురు సాయికృష్ణ, సులోచన, అరుణ. 1987లో తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు ఈ ఫోటో దిగాం. నా పేరుతో మా నాన్న 'శ్రీదేవి కాన్వెంట్' నడిపేవారు. అందులో మేము నలుగురం చదువుకున్నాం. ఆ తర్వాత హైస్కూల్లో కూడా కలిసే చదువుకున్నాం. టెన్త్ తర్వాత మిగిలిన వారికి పెళ్లిళ్లయ్యాయి. వారి తర్వాత నా పెళ్లి. మా జీవితాల్లో ఇన్ని రోజులు గడిచినా నేను, అరుణ కాంటాక్ట్‌లో ఉన్నాం. సాయికృష్ణ, సులోచన ఎక్కడ ఉన్నారో తెలియదు. వారి నంబర్ల కోసం ట్రై చేస్తున్నాను. నేనిప్పుడు మహిళా సంఘాల్లో పని చేస్తున్నాను. చిన్నప్పుడు మేమంతా గడిపిన రోజులు గుర్తొస్తే మనసులో అదోలాంటి ఉద్వేగం కలుగుతుంది. దిగులు కలుగుతుంది. మేము నలుగురం మళ్లీ కలిస్తే బాగుంటుందని నా ఆశ. సాక్షిలో ఫోటో వస్తే వాళ్లు చూస్తారని పంపుతున్నాను.

- శ్రీదేవి, గోదావరి ఖని



యాభై ఏళ్ల స్నేహం

యాభై ఏళ్ల క్రితం 1972–74 నర్సాపురం వైఎన్‌ఎం కాలేజీలో మేము ముగ్గురం ఇంటర్ చదివాం. అప్పుడు తీయించుకున్న ఫొటో. నాతో పాటు ఉన్నది సత్యవాణి, గ్లాడిస్. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మా స్నేహం కొనసాగుతూనే ఉంది. ఇటీవలే 50 ఏళ్ల మా స్నేహాన్ని సెలబ్రేట్ చేసుకుంటూ కలిశాం. స్నేహితులు ఉన్నప్పుడే లైఫ్ బాగుంటుంది. బెస్ట్‌ఫ్రెండ్స్ మనకు బలం. వాళ్లే ఎనర్జీ.

- కృష్ణవేణి



అక్కచెల్లెళ్లు అనుకునేవారు

నేను బ్లూడ్రెస్‌లో ఉన్న అమ్మాయిని. నా పక్కన ఉన్నది అపర్ణ. పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతంలో మేమిద్దరం చిన్నప్పటి నుంచి ఫ్రెండ్స్. కాన్వెంట్‌లో అమ్మాయిలమంతా చాలా క్లోజ్ అయితే వారిలో మేమిద్దరం ఇంకా క్లోజ్. పెనుగొండలో డిగ్రీ వరకు కలిసి చదువుకున్నాం. మా ఇద్దరినీ చూసి అక్కచెల్లెళ్లు అనుకునేవారు. మా ఆలోచనలూ ఒకటే. పెళ్లయ్యాక కూడా మేము కాంటాక్ట్‌లో ఉన్నాం. గత ఐదేళ్లుగా తన కాంటాక్ట్ మిస్ అయ్యింది. తను భర్త ఉద్యోగం రీత్యా రేణిగుంటలో ఉండేది. ఆ తర్వాత ఇప్పుడు ఎక్కడ ఉందో తెలియదు. ఫ్రెండ్‌షిప్‌డే రోజు తన పలకరింపు వింటే చాలా సంతోషిస్తాను.

- రేణుక, సిద్ధాంతం, ప.గో.జిల్లా



ఆ ముగ్గురూ ఎక్కడున్నారో!

ఈ ఫోటోలో వరుసగా ఉన్నది పద్మ, కరీమా, ఉమ (నేను), సుకన్య. గుంటూరు కొత్తపేటలో జలగం రామారావు స్కూల్‌లో 1981–82 టెన్త్ క్లాస్ చదువుతుండగా దిగిన ఫొటో. మా నలుగురికీ ఒకరంటే ఒకరికి ప్రాణం. ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా మిగిలిన వాళ్లం సాయం చేసుకునేవారం. ఒకసారి మేము నలుగురం స్కూల్ ఎగ్గొట్టి కాకాణి గుడి చూసి సాయంత్రం క్లాసులకు వచ్చాం. అప్పుడు మా మాష్టారు ఆడపిల్లలమని కూడా చూడకుండా బెత్తం దెబ్బలు వేశారు. ఎంతో కలిసి ఉన్న మేము ఆ తర్వాత కాలంలో ఎవరి జీవితాల్లో వాళ్లం పడి మిస్ అయిపోయాం. ఈ ఫోటోలో ఉన్న మిగిలిన ముగ్గురూ ఇప్పుడు ఎక్కడ ఉన్నారో. వారి కోసం నేను ఎంతో ఎదురు చూస్తున్నాను.

- పసుపులేటి ఉమాదేవి,
భట్టిప్రోలు, బాపట్ల జిల్లా.

బ్యూటిప్



పాలల్లో కొద్దిగా ఓట్స్ వేసి ఉడికించాలి. తర్వాత ఇందులో కాస్త పెరుగు, తేనె వేసి బాగా కలపాలి. ఇది కాస్త చల్లబడిన తర్వాత బ్లాక్‌హెడ్స్ ఉన్న చోట అప్లై చేసుకుని 20 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత మైల్డ్ క్లెన్సర్ ఉపయోగించి ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ వేసుకోవడం వల్ల చర్మంపై ఉండే బ్లాక్‌హెడ్స్ సులభంగా తొలగిపోతాయి.

ఐరన్ ఉమన్

వయనాడ్ వారియర్

వయనాడ్ అనే మాట వినిపించగానే కళ్ల ముందు కన్నీటి సముద్రం కనిపిస్తుంది. అక్కడికి వెళ్లే సహాయకులకు ప్రకృతి విలయ విధ్వంస దృశ్యాలను చూసి తట్టుకునే గుండె ధైర్యంతో పాటు మెరుపు వేగంతో కదిలే శక్తి ఉండాలి. ఆ శక్తి ఆర్మీ మేజర్ సీతా అశోక్ షెల్కేలో నిండుగా కనిపిస్తుంది. అందుకే... సామాన్య ప్రజల నుంచి రిటైర్డ్ ఆర్మీ అధికారుల వరకు సీతను ప్రశంసిస్తున్నారు...



● ఆర్మీ మేజర్ సీతా అశోక్ షెల్కే

వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన చూరల్‌మాల గ్రామంలో కొత్తగా నిర్మించిన బెయిలీ బ్రిడ్జి రెయిలింగ్‌పై సగర్వంగా నిలుచున్న మేజర్ సీతా షెల్కే ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

లింగ వివక్షతను సవాలు చేసి సగర్వంగా వెలుగుతున్న ఫొటో అది.

'ఇండియన్ ఆర్మీ ఇంజనీర్‌లతో కలిసి మేజర్ సీత షెల్కే పదహారు గంటలలోనే 24 టన్నుల సామర్థ్యం ఉన్న బెయిలీ వంతెనను నిర్మించారు' అని అభినందిస్తూ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు లెఫ్టినెంట్ కల్నల్ జేఎస్ సోధి(రిటైర్డ్). తన కామెంట్‌తో పాటు కొన్ని ఫొటోలను కూడా షేర్ చేశాడు.

'ఒక్క చిత్రం చాలు వంద మాటలు ఎందుకు!' అన్నట్లు ఈ ఫొటోలలో ఒక్కటి చూసినా చాలు సీత బృందం కష్టం, శక్తిసామర్థ్యాలు తెలుసుకోవడానికి.

ఒకవైపు నేల కూలిన చెట్లు, మరోవైపు అడుగు వేయనివ్వని శిథిలాలు, వేగంగా ప్రవహిస్తున్న నది, పై నుంచి వర్షం, పరిమిత స్థలం... ఒక్క అనుకూలత కూడా లేని అత్యంత ప్రతికూల పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో కూడా నిట్టూర్చకుండా బ్రిడ్జి నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా చేసింది ఆర్మీ బృందానికి నాయకత్వం వహించిన సీత.

సహాయచర్యలు చేపట్టడంలో ఈ బ్రిడ్జి కీలకం కానుంది.

'ఇది సైన్యం విజయం మాత్రమే కాదు. సహాయకార్యక్రమాల కోసం ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వారు, స్థానిక అధికారులు... ఎంతో మంది విజయం' వినమ్రంగా అంటుంది సీత.

కొండచరియలు విరిగిపడిన చోట పని చేయడం పెద్ద సవాలు. అక్కడ పురుషులతో సమానంగా పనిచేసింది సీత.

మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌కు చెందిన సీతకు 'సాహసం' చిన్నప్పటి నుంచి సన్నిహిత మిత్రురాలు. ఆ ధైర్యమే ఆమెను సైన్యంలోకి తీసుకువచ్చింది.



● బెయిలీ బ్రిడ్జి రెయిలింగ్‌పై...

మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్(ఎంఈజీ) అనేది వంతెనలు నిర్మించడం, మందుపాతరలను నిర్వీర్యం చేయడం...ఇలాంటి పనులెన్నో చేస్తుంటుంది. ఈ ఇంజినీరింగ్ యూనిట్ గురించి ఒక్కమాటలో చెప్పాలంటే ప్రమాదాల అంచున పనిచేయడం. ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా ప్రాణాలు మూల్యంగా చెల్లించుకోవాల్సిందే. 'మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్'లోని డెబ్బై మంది సభ్యులలో ఏకైక మహిళ సీత. అయినప్పటికీ ఆమె ఎప్పుడూ అసౌకర్యం అనుకోలేదు. అధైర్య పడిపోలేదు.

'మహిళ కదా... ఇది రిస్క్ జాబ్ కదా' అని ఎంతోమంది సీతతో అనేవాళ్లు.

'రిస్క్ లేనిది ఎక్కడా!' అనేది ఆమె నోటి నుంచి వేగంగా వచ్చే మాట.

'రిస్క్ తీసుకోక పోవడం కూడా పెద్ద రిస్కే' అనుకునే సీతా అశోక్ షెల్కే ఎన్నో రెస్క్యూ ఆపరేషన్‌లలో ధైర్యంగా పాల్గొంది. నిద్ర, తిండి, నీళ్లు.... ఇలాంటివేమీ పట్టించుకోకుండా పని చేసింది. 'మగవాళ్లు ఎంత కష్టమైనా పనైనా చేస్తారు. మహిళలకు కష్టం' అనే మాట ఆమె ముందు నిలిచేది కాదు.

వాయనాడ్‌లో సహాయ, నిర్మాణ కార్యక్రమాలలో తన బృందంతో కలిసి నాన్–స్టాప్‌గా పనిచేస్తున్న సీత మోములో అలసట కనిపించదు....రాకెట్ వేగంతో పనిచేయాలనే తపన తప్ప. ఆ తపనే ఆమెను అందరూ ప్రశంసించేలా చేస్తోంది.



జొకోవిచ్ ఒలింపిక్ స్వర్ణ స్వప్నం నెరవేరేనా? నేడు అల్‌కరాజ్‌తో ఫైనల్ పోరు

తన సుదీర్ఘ కెరీర్‌లో లోటుగా ఉన్న ఒలింపిక్ స్వర్ణ పతకాన్ని అందుకునేందుకు సెర్బియా దిగ్గజం విజయం దూరంలో నిలిచాడు. వరుసగా ఐదో ఒలింపిక్స్ క్రీడల్లో పోటీపడుతున్న 37 ఏళ్ల జొకోవిచ్ తొలిసారి పసిడి పతక పోరుకు అర్హత సాధించాడు. పారిస్ ఒలింపిక్స్ పురుషుల టెన్నిస్ సింగిల్స్ సెమీఫైనల్లో జొకోవిచ్ 6-4, 6-2తో లొరెంజో ముసెట్టి (ఇటలీ)పై గెలిచాడు. తద్వారా ఒలింపిక్స్ టెన్నిస్ చరిత్రలో ఫైనల్‌కు చేరిన పెద్ద వయస్కుడిగా గుర్తింపు పొందాడు. నేడు జరిగే ఫైనల్లో ఈ ఏడాది ఫ్రెంచ్, వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్)తో జొకోవిచ్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో ఇద్దరూ 3-3తో సమంగా ఉన్నారు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో జొకోవిచ్ కాంస్య పతకం గెలిచాడు. 2012 లండన్, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన జొకోవిచ్ 2016 రియో ఒలింపిక్స్‌లో తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు.





ఈసారీ గెలిచేద్దాం

- బ్రిటన్‌తో నేడు భారత హాకీ జట్టు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్
- 'టోక్యో'లోనూ బ్రిటన్‌ను ఓడించే సెమీస్‌కు చేరిన టీమిండియా
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

పారిస్: టోక్యో ఒలింపిక్స్‌లో తాము సాధించిన కాంస్య పతకాన్ని నిలబెట్టుకోవాలంటే భారత జట్టు ముందుగా క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని దాటాలి. మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్లో ఎదురైన ప్రత్యర్థి బ్రిటన్ జట్టుతోనే పారిస్ ఒలింపిక్స్‌లోనూ భారత్ క్వార్టర్ ఫైనల్లో తలపడనుంది. నేడు జరిగే ఈ నాకౌట్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం విజయం సాధిస్తేనే సెమీఫైనల్‌కు చేరుకొని పతకం రేసులో నిలుస్తుంది. ఓడిపోతే మాత్రం టీమిండియా ఇంటిదారి పడుతుంది. 'టోక్యో' క్వార్టర్ ఫైనల్లో భారత్ 3–1 గోల్స్ తేడాతో బ్రిటన్ జట్టును ఓడించింది. 'పారిస్' గేమ్స్‌లో భారత హాకీ జట్టు నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. గ్రూప్ 'బి'లో ఉన్న భారత జట్టు తొలి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై 3–2తో గెలిచింది. రెండో లీగ్ మ్యాచ్‌లో మాజీ ఒలింపిక్ విజేత అర్జెంటీనాతో 1–1తో 'డ్రా' చేసుకుంది. మూడో లీగ్ మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై 2–0తో గెలిచి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. నాలుగో లీగ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఒలింపిక్ చాంపియన్ బెల్జియం జట్టు చేతిలో 1–2తో ఓడిన టీమిండియా చివరి లీగ్ మ్యాచ్‌లో పటిష్ట ఆ్రస్టేలియా జట్టును 3–2తో ఓడించి సంచలనం సృష్టించింది. ఒలింపిక్స్ క్రీడల్లో ఆ్రస్టేలియా జట్టుపై 52 ఏళ్ల తర్వాత భారత జట్టు విజయాన్ని అందుకుంది.

లీగ్ దశ మ్యాచ్‌ల ఫలితాలు, ప్రదర్శన ప్రస్తుతం గతంతో సమానం. నాకౌట్ మ్యాచ్ కావడంతో తప్పనిసరిగా గెలిస్తేనే జట్లు ముందుకు సాగుతాయి. 1988 సియోల్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం నెగ్గిన తర్వాత బ్రిటన్ జట్టు మళ్లీ ఒలింపిక్స్‌లో పతకం సాధించలేకపోయింది. ప్రస్తుత ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న బ్రిటన్ జట్టును ఏమాత్రం తక్కువ అంచనా వేయకుండా భారత జట్టు ఆద్యంతం నిలకడగా ఆడాల్సి ఉంటుంది. గోల్ చేసేందుకు వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. దక్కిన పెనాల్టీ కార్నర్‌లను లక్ష్యానికి చేర్చాలి. అందుబాటులో ఉన్న ముఖాముఖి రికార్డు ప్రకారం భారత్, బ్రిటన్ జట్లు ఇప్పటి వరకు 23 సార్లు తలపడ్డాయి. 13 సార్లు బ్రిటన్ నెగ్గగా... 9 సార్లు భారత్ గెలిచింది. ఒక మ్యాచ్ 'డ్రా' అయింది. ఒలింపిక్స్‌లో మాత్రం బ్రిటన్‌పై భారత్‌దే పైచేయిగా ఉంది. విశ్వ క్రీడల్లో ఈ రెండు జట్లు తొమ్మిదిసార్లు తలపడగా... ఆరుసార్లు భారత్, మూడుసార్లు బ్రిటన్ గెలుపొందాయి. నేడు జరిగే ఇతర మూడు క్వార్టర్ ఫైనల్స్‌లో స్పెయిన్‌తో బెల్జియం; నెదర్లాండ్స్‌తో శ్రీఆ్రస్టేలియా; జర్మనీతో అర్జెంటీనా తలపడతాయి. యాదృచ్ఛికంగా 'పారిస్' గేమ్స్‌లోనూ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగు క్వార్టర్ ఫైనల్స్‌లో ఎదురెదురుగా తలపడిన జట్లే ఈసారి పోటీపడుతున్నాయి.



‘మూడో’ కన్ను చెదిరింది!

మనూ భాకర్‌కు త్రుటిలో చేజారిన కాంస్యం
25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో నాలుగో స్థానం
2 కాంస్యాలతో ముగించిన భారత యువ షూటర్

ఏడు రోజుల వ్యవధి. రెండు ఒలింపిక్ కాంస్య పతకాలు గెలిచిన ఘనత. మూడో పతకం సాధించి కొత్త చరిత్ర సృష్టించేందుకు సై. కానీ చివరకు 'షూట్ ఆఫ్'తో ఆశలకు తెర పడింది. త్రుటిలో కాంస్యం చేజారింది. ఒలింపిక్స్ చరిత్రలో భారత్ తరపున వ్యక్తిగత క్రీడాంశంలో మూడు పతకాలు గెలుచుకున్న తొలి ప్లేయర్‌గా నిలవాలని ఆశించిన యువ షూటర్ మనూ భాకర్‌కు చివర్లో చుక్కెదురైంది. తీవ్ర ఒత్తిడికి తలవంచిన ఆమె ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేక నాలుగో స్థానంతో ముగించింది. అయితే 22 ఏళ్ల మనూ భాకర్ సాధించిన ఘనత చిన్నదేమీ కాదు. మూడు ఈవెంట్లలో రెండు పతకాలు, మరో దాంట్లో నాలుగో స్థానం అంటే అసాధారణ ప్రదర్శన. గత టోక్యో ఒలింపిక్స్‌లో కనీస ప్రభావం చూపించలేక తీవ్ర విమర్శలపాలైన ఈ యంగ్‌స్టర్ ఇప్పుడు పారిస్ నుంచి సగర్వంగా స్వదేశం వెళుతోంది.

పారిస్: భారత స్టార్ షూటర్ మనూ భాకర్ పారిస్ ఒలింపిక్స్‌లో మూడో పతకాన్ని సాధించడంలో విఫలమైంది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో మనూ నాలుగో స్థానానికి పరిమితమైంది. శనివారం జరిగిన ఫైనల్లో మనూ 'షూట్–ఆఫ్'లో ఓటమి పాలైంది. ఒక్కో సిరీస్‌లో ఐదు షాట్‌ల చొప్పున ఉండే ఎనిమిది సిరీస్‌లు ముగిసేసరికి మనూ 28 పాయింట్లు స్కోరు చేసింది. హంగేరీకి చెందిన వెరోనికా మాయో కూడా సరిగ్గా 28 పాయింట్లే సాధించింది. దాంతో ఇద్దరి మధ్య ఐదు షాట్‌ల 'షూట్–ఆఫ్' నిర్వహించారు. ఇందులో మూడు షాట్‌లను మనూ లక్ష్యంపైకి సరిగ్గా కొట్టగా... నాలుగు షాట్‌లు సరిగ్గా కొట్టిన వెరోనికాయే పైచేయి సాధించి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. దాంతో మనూకు నిరాశ తప్పలేదు. ఫైనల్లో తొలి సిరీస్‌లో రెండు షాట్‌లు మాత్రం లక్ష్యం చేర్చిన మనూ పేలవంగా మొదలు పెట్టింది. అయితే ఆ తర్వాత వరుసగా 4, 4 పాయింట్లు సాధించి 10 పాయింట్లతో ఎలిమినేషన్ రౌండ్‌కు సిద్ధమైంది. ఇక్కడ మళ్లీ తడబడి 3తో మొదలు పెట్టిన మనూ ఆ తర్వాత వరుసగా 5, 4, 4 పాయింట్లతో ఏడు సిరీస్‌ల తర్వాత మొత్తం 26 పాయింట్లతో రెండో స్థానంతో మెరుగైన స్థితిలో నిలిచింది. అయితే ఈ తర్వాత ఈ జోరు కొనసాగలేదు. ఎనిమిదో సిరీస్ మనూను బాగా దెబ్బ తీసింది. కేవలం 2 షాట్‌లు మాత్రమే లక్ష్యం చేరడంతో వెనకబడిపోయి కాంస్యం కోసం పోటీ పడాల్సి వచ్చింది. అయితే 'షూట్–ఆఫ్'లో అదే వైఫల్యం కొనసాగింది. ఈ ఈవెంట్‌లో 'షూట్–ఆఫ్'లో జిన్ యాంగ్ (దక్షిణ కొరియా) స్వర్ణం, క్యామిలె జెడ్‌రెస్కీ (ఫ్రాన్స్) రజతం గెలుచుకున్నారు. నిర్ణీత 10 సిరీస్‌ల తర్వాత ఇద్దరూ 37 పాయింట్లతో సమంగా నిలిచారు. 'షూట్–ఆఫ్'లో జిన్ యాంగ్ 3 పాయింట్లు సాధించగా... క్యామిలె ఒక పాయింట్‌తో సరిపెట్టుకుంది.

స్కీట్‌లో నిరాశ...

షూటింగ్‌లోనే స్కీట్ ఈవెంట్ పురుషుల విభాగంలో భారత షూటర్ అనంత్ జీత్‌సింగ్ నరూకా విఫలమయ్యాడు. ఐదు క్వాలిఫయింగ్ రౌండ్ల తర్వాత అతను 24వ స్థానంలో మాత్రమే నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. తొలి ఆరుగురు ఫైనల్‌కు చేరే ఈ ఈవెంట్‌లో అనంత్ జీత్ మొత్తం 125కుగాను 116 (23, 22, 23, 24, 24) పాయింట్లు సాధించాడు.

బాక్సర్ నిశాంత్ ఓటమి

బాక్సింగ్‌లో భారత్‌కు నిరాశ ఎదురైంది. శనివారం జరిగిన 71 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్లో నిశాంత్ దేవ్ 1–4తో మార్కో వెర్దె (మెక్సికో) చేతిలో ఓడిపోయాడు. నిశాంత్ ఓటమితో పురుషుల విభాగంలో భారత కథ ముగిసింది.

“ ఒత్తిడిని అధిగమించలేకపోయాను

పారిస్ ఒలింపిక్స్‌లో మూడో పతకంపై గురి పెట్టాను. అయితే కీలక సమయంలో ఒత్తిడిలో చిత్తయ్యాను. ఎంత ప్రశాంతంగా ఉండాలని ప్రయత్నించినా నా వల్ల కాలేదు. అయితే రెండు కాంస్యాల తన ప్రదర్శన పట్ల సంతృప్తిగా ఉన్నాను. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో ఇంతకంటే మెరుగైన ప్రదర్శన ఇస్తాను. 'షూట్–ఆఫ్'లో చాలా ఒత్తిడిని ఎదుర్కొన్నా. దానిని అధిగమించి గెలిచేందుకు నా శాయశక్తులా ప్రయత్నించినా అది సరిపోలేదు. రెండు పతకాలు గెలవడం సంతోషకరమే. కానీ ఈ క్షణాన మాత్రం నాలుగో స్థానం నాకు తీవ్ర నిరాశ కలిగించింది. ఒలింపిక్స్‌లో చాలా వరకు బాగానే ఆడినా ఈసారి విఫలమయ్యాను. ఎప్పుడైనా రేపు మరో అవకాశం అనేది ఉంటుంది. 2028 కోసం ఎదురు చూస్తున్నా. ఈ పోరుకు ముందు ఎలాగైనా మూడో పతకం సాధించాలని నాపై ఎవరూ ఒత్తిడి పెట్టలేదు, సోషల్ మీడియాకు దూరంగా ఉన్నాను కాబట్టి బయటి వ్యక్తుల అంచనాల గురించి కూడా నాకేమీ తెలియదు. నాలుగో స్థానం దక్కింది కాబట్టి నా లోపాలేమిటో తెలుసుకునే అవకాశం కూడా కలుగుతుంది. పతకం రాకపోతే ఎవరూ నిరాశ చెందవద్దని నేను ముందే చెప్పడం ఏదో మాట వరసకు అన్నదే. ఇక్కడా గెలిస్తే బాగుండేది. కానీ చివరి వరకు పోరాడగలిగాను. నేను ఈ ఒలింపిక్స్ కోసం చాలా కష్టపడ్డాను. ఇక ముందు ఇలాగే కష్టపడతానని అందరికీ చెబుతున్నాను.

–మనూ భాకర్


దీపిక

లక్ష్యానికి చేరని భారత బాణం

ఒలింపిక్స్ నుంచి మళ్లీ రిక్తహస్తాలతో వెనుదిరిగిన భారత ఆర్చర్లు

- పతకావకాశాన్ని చేజేతులా వృథా చేసుకున్న దీపిక కుమారి
- కీలకదశలో అక్కరకురాని అపార అనుభవం
- క్వార్టర్ ఫైనల్లో కొరియా టీనేజర్ చేతిలో ఓటమి

పారిస్: ఒలింపిక్స్‌లో మన ఆర్చర్లకు మరోసారి నిరాశ తప్పలేదు! భారీ అంచనాలు, మంచి ఫామ్‌తో పారిస్‌లో అడుగుపెట్టిన ఆర్చర్లు పోటీపడ్డ అన్నీ విభాగాల్లో విఫలమై.. రిక్తహస్తాలతో ఇంటి బాట పట్టారు. ఇప్పటికే పురుషుల టీమ్, మహిళల టీమ్, మిక్స్‌డ్ టీమ్, పురుషుల వ్యక్తిగత విభాగాల్లో మనవాళ్లకు చేదు ఫలితాలు ఎదురుకాగా... శనివారం మహిళల వ్యక్తిగత విభాగంలోనూ అదే పునరావృతం అయింది. ప్రపంచ మాజీ నంబర్ వన్, భారత స్టార్ దీపికా కుమారి క్వార్టర్ ఫైనల్లో కొరియాకు చెందిన 19 ఏళ్ల టీనేజ్ ఆర్చర్ నామ్ సిహ్యెన్ చేతిలో ఓడగా.. తొలిసారి విశ్వ క్రీడల్లో ఆడుతున్న భజన్ కౌర్ ప్రిక్వార్టర్స్‌లోనే వెనుదిరిగింది. 'పారిస్' క్రీడల రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్–అంకిత భకత్ నాలుగో స్థానంలో నిలవడమే ఒలింపిక్స్ చరిత్రలో మన ఆర్చర్ల అత్యుత్తమ ప్రదర్శన.

వరుసగా నాలుగోసారి ఒలింపిక్స్ బరిలోకి దిగిన దీపిక శనివారం జరిగిన రికర్వ్ మహిళల వ్యక్తిగత క్వార్టర్ ఫైనల్లో 4–6 (28–26, 25–28, 29–28, 27–29, 27–29)తో నామ్ సిహ్యెన్ చేతిలో పరాజయం పాలైంది. తొలి మూడు సెట్‌లలో రెండింట గెలిచి 4–2తో ఆధిక్యంలోకి వెళ్లి ఆశలు రేపిన దీపిక.. నాలుగో సెట్‌లో గురితప్పి 7 పాయింట్లు సాధించడంతో వెనుకబడింది. 14 ఏళ్లుగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా పతకాలు సాధిస్తూ మేటి ఆర్చర్‌గా పేరు తెచ్చుకున్న దీపిక వరుసగా నాలుగో ఒలింపిక్స్‌లోనూ పతకం లేకుండానే వెనుదిరిగింది. 'నిరాశ చెందా. ఒలింపిక్స్‌లో ప్రతిసారీ ఇలాంటి ఫలితాలే ఎందుకు వస్తున్నాయో అర్థం కావడం లేదు. ఈ వాతావరణం, అంచనాలే కారణమనుకుంటా. రెండు బాణాలు గురి తప్పడంతో.. మ్యాచ్‌ను నేనే ప్రత్యర్థికి అప్పగించినట్లు అనిపించింది' అని 2012 'లండన్'లో 33వ స్థానంలో, 2016 'రియో'లో 16వ స్థానంలో, 2020 టోక్యోలో 8వ స్థానంలో నిలిచిన దీపిక వ్యాఖ్యానించింది. క్వార్టర్ ఫైనల్లో దీపిక గెలిచి ఉంటే సెమీఫైనల్‌కు అర్హత సాధించి కనీసం కాంస్య పతక రేసులో నిలిచేది. అంతకుముందు ప్రిక్వార్టర్స్‌లో దీపిక 6–4 (27–24, 27–27, 26–25, 27–29, 27–27)తో మిచెల్లి క్రాపెన్ (జర్మనీ)పై గెలిచింది. మరో ఆర్చర్ భజన్ కౌర్ 'షూట్ ఆఫ్'లో దినంద చోరునిసా (ఇండోనేసియా) చేతిలో ఓడింది. మొదట స్కోర్లు 28–29, 27–25, 26–28, 28–28, 27–26తో సమం కాగా.. విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన 'షూట్ ఆఫ్'లో తడబడ్డ భజన్ 8 పాయింట్లు సాధించగా.. 9 పాయింట్లతో ఇండోనేసియా ఆర్చర్ ముందంజ వేసింది.

మథియాస్ బో గుడ్‌బై

భారత డబుల్స్ కోచ్ పదవి నుంచి వైదొలిగిన డెన్మార్క్ మాజీ షట్లర్



పారిస్: భారత బ్యాడ్మింటన్ డబుల్స్ కోచ్ పదవి నుంచి మథియాస్ బో తప్పుకున్నాడు. సాత్విక్ సాయిరాజ్ –చిరాగ్ శెట్టి జోడీని గొప్పగా తీర్చిదిద్ది వారి విజయాల్లో కీలకపాత్ర పోషించిన అతను పారిస్ ఒలింపిక్స్‌లో భారత ద్వయం వైఫల్యం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నాడు. గత కొంత కాలంగా అద్భుత ప్రదర్శనతో వరుసగా ట్రోఫీలు నెగ్గి పారిస్ ఒలింపిక్స్‌లో పతకంపై ఆశలు రేపిన సాత్విక్–చిరాగ్ జంట క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించింది. 2012 లండన్ ఒలింపిక్స్ డబుల్స్ విభాగంలో రజతం గెలిచిన మథియాస్ భారత జట్టుకు నాలుగేళ్ల క్రితం డబుల్స్ స్పెషలిస్ట్ కోచ్‌గా వచ్చాడు. 'నా కోచింగ్ రోజులు ముగిశాయి. ఇకపై నేను భారత్‌లో గానీ, మరెక్కడా గానీ కోచింగ్ ఇవ్వబోవడం లేదు. చాలా సమయం బ్యాడ్మింటన్ కోర్టుల్లో తీవ్ర ఒత్తిడి మధ్య గడిపిన నేను బాగా అలసిపోయాను. నాకు అండగా నిలిచిన, ఎన్నో జ్ఞాపకాలు అందించిన అందరికీ కృతజ్ఞతలు' అని మథియాస్ బో స్పష్టం చేశాడు. ప్రతికూల పరిస్థితుల్లోనూ కష్టపడి భారీ అంచనాలతో ఒలింపిక్స్ బరిలోకి దిగి పతకం సాధించలేకపోయిన సాత్విక్–చిరాగ్‌ల ప్రదర్శన పట్ల గర్వపడుతున్నానని, భవిష్యత్తులో వారిద్దరు ఎన్నో విజయాలు సాధిస్తారని మథియాస్ ఆకాంక్షించాడు. డెన్మార్క్‌కు చెందిన 44 ఏళ్ల మథియాస్ ఈ ఏడాది మార్చిలోనే సినీ నటి తాప్సీని పెళ్లి చేసుకున్నాడు.

భళా బైల్స్...

ఒలింపిక్స్‌లో ఏడో స్వర్ణం గెలిచిన అమెరికా స్టార్ జిమ్నాస్ట్





పారిస్: టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం నెగ్గలేకపోయిన అమెరికా మహిళా స్టార్ జిమ్నాస్ట్ 'పారిస్'లో మాత్రం పసిడి మెరుపులు మెరిపిస్తోంది. ఇప్పటి వరకు పోటీపడ్డ మూడు ఈవెంట్లలోనూ ఆమె స్వర్ణ పతకాలను సొంతం చేసుకుంది. 27 ఏళ్ల బైల్స్ మహిళల టీమ్ విభాగంలో, ఆల్ అరౌండ్ విభాగంలో పసిడి పతకాలు నెగ్గగా... తాజాగా శనివారం జరిగిన వాల్ట్ ఈవెంట్‌లోనూ విజేతగా నిలిచింది. ఎనిమిది మంది మధ్య జరిగిన ఫైనల్లో బైల్స్ 15.300 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. రెబెకా అంద్రాడె (బ్రెజిల్; 14.966 పాయింట్లు) రజతం, జేడ్ కేరీ (అమెరికా; 14.466 పాయింట్లు) కాంస్యం గెల్చుకున్నారు. ఓవరాల్‌గా ఒలింపిక్స్ క్రీడల్లో బైల్స్‌కిది పదో పతకంకాగా, ఇందులో ఏడు స్వర్ణాలు ఉన్నాయి. 2016 రియో ఒలింపిక్స్‌లో బైల్స్ నాలుగు స్వర్ణాలు, ఒక కాంస్యం నెగ్గింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో బైల్స్‌కు ఒక రజతం, ఒక కాంస్యం దక్కింది. ఒలింపిక్స్ జిమ్నాస్టిక్స్‌లో మహిళల వాల్ట్ ఈవెంట్‌లో రెండుసార్లు విజేతగా నిలిచిన రెండో జిమ్నాస్ట్‌గా బైల్స్ గుర్తింపు పొందింది. గతంలో వెరా కసాలావ్‌స్కా (చెకోస్లొవేకియా; 1964, 1968 ఒలింపిక్స్) రెండుసార్లు వాల్ట్ ఈవెంట్‌లో పసిడి పతకాలు గెలిచింది. 'పారిస్'లో బైల్స్ ఖాతాలో నాలుగో స్వర్ణం కూడా చేరే అవకాశం ఉంది. నేడు జరిగే అన్‌ఈవెన్ బార్స్ ఫైనల్లో బైల్స్ పోటీపడనుంది.



నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

షూటింగ్

పురుషుల 25 మీటర్ల క్వాలిఫికేషన్ మొదటి స్టేజ్: విజయ్‌వీర్, అనీశ్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి). పురుషుల 25 మీటర్ల క్వాలిఫికేషన్ రెండో స్టేజ్: విజయ్‌వీర్, అనీశ్ (సాయంత్రం గం. 4:30 నుంచి). మహిళల స్కీట్ క్వాలిఫికేషన్: రైజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్ (మధ్యాహ్నం గం. 1:00 నుంచి)

హాకీ

పురుషుల క్వార్టర్ ఫైనల్: భారత్ X బ్రిటన్ (మధ్యాహ్నం గం. 1:30 నుంచి)

గోల్ఫ్

పురుషుల వ్యక్తిగత స్ట్రోక్‌ప్లే నాలుగో రౌండ్: శుభాంకర్ శర్మ, గగన్‌జీత భుల్లర్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి)

బ్యాడ్మింటన్

పురుషుల సింగిల్స్ సెమీ ఫైనల్: లక్ష్యసేన్ X అక్సెల్‌సన్ (డెన్మార్క్) (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)

బాక్సింగ్

మహిళల 75 కేజీల క్వార్టర్ ఫైనల్: లవ్లీనా బొర్గోహైన్ X లి కియాన్ (చైనా) (మధ్యాహ్నం గం. 3:02 నుంచి)

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	16	11	9	36
2	ఫ్రాన్స్	12	14	15	41
3	ఆస్ట్రేలియా	12	7	5	24
4	అమెరికా	11	20	20	51
5	బ్రిటన్	10	10	12	32
6	దక్షిణ కొరియా	9	6	5	20
7	జపాన్	8	5	9	22
49	భారత్	0	0	3	3

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

మహిళల 100 మీటర్ల విజేత జూలియన్


జూలియన్

పారిస్ ఒలింపిక్స్ మహిళల 100 మీటర్ల రేసులో సెయింట్ లూసియా దేశానికి చెందిన జూలియన్ ఆల్ఫ్రెడ్ స్వర్ణ పతకాన్ని సాధించింది. శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఫైనల్లో జూలియన్ 10.72 సెకన్లలో అందరికంటే వేగంగా లక్ష్యానికి చేరి విజేతగా నిలిచింది. ప్రపంచ చాంపియన్ షకారీ రిచర్డ్‌సన్ (అమెరికా) 10.87 సెకన్లతో రజతం దక్కించుకోగా... మెలీసా జెఫర్సన్ (అమెరికా; 10.92 సెకన్లు) కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. 1996 అట్లాంటా ఒలింపిక్స్ (గెయిల్ డెవర్స్) తర్వాత మహిళల 100 మీటర్ల విభాగంలో అమెరికా అథ్లెట్‌కు పసిడి పతకం లభించలేదు. 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో అమెరికాకే చెందిన మరియన్ జోన్స్ స్వర్ణ పతకాన్ని సాధించినా... 2007లో మరియన్ జోన్స్ మెరుగైన ప్రదర్శన కోసం నిషేధిత ఉత్ప్రేరకాలు వాడినట్లు ప్రకటించింది. దాంతో అమెరికా ఒలింపిక్ కమిటీ, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ మరియన్ జోన్స్ 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో సాధించిన స్వర్ణ పతక ఫలితాన్ని రద్దు చేశాయి.

10 వేల మీటర్ల రేసులో చెప్టెగాయ్‌కు స్వర్ణం



పారిస్: అథ్లెటిక్స్ పురుషుల 10,000 మీటర్ల రేసులో ఉగాండా రన్నర్ జోషువా చెప్టెగాయ్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. శనివారం జరిగిన ఫైనల్లో జోషువా 26 నిమిషాల 43.14 సెకన్లలో అందరికంటే వేగంగా 10,000 మీటర్లను పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో కొత్త ఒలింపిక్ రికార్డును నమోదు చేయడంతోపాటు 'పారిస్' గేమ్స్‌లో ఉగాండాకు తొలి పసిడి పతకాన్ని అందించాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కెనెనిసా బెకెలె (ఇథియోపియా; 27ని:01.17 సెకన్లు) నెలకొల్పిన రికార్డును జోషువా 'పారిస్'లో సవరించాడు.



డోపింగ్‌లో పట్టుబడ్డ అఫ్గానిస్తాన్ జూడో ప్లేయర్

పారిస్ ఒలింపిక్స్‌లో మూడో డోపింగ్ కేసు నమోదైంది. అఫ్గానిస్తాన్‌కు చెందిన జూడో ఆటగాడు మొహమ్మద్ సమీమ్ ఫైజాద్ డోపింగ్ పరీక్షలో దొరికిపోయాడు. అతను నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు పరీక్షల్లో తేలింది. దీంతో అతన్ని అఫ్గాన్ జట్టు నుంచి తప్పించారు. 81 కేజీల కేటగిరీలో తొలి బౌట్‌లో పాల్గొన్న సమయంలోనే 22 ఏళ్ల ఫైజాద్ నుంచి రక్త, మూత్ర నమూనాలను సేకరించారు. అనంతరం ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) ఆధ్వర్యంలోని ల్యాబ్‌లో పరీక్షించగా పాజిటివ్ రిపోర్ట్ వచ్చింది. పారిస్ క్రీడల్లో పట్టుబడిన మూడో డోపీ సమీమ్ ఫైజాద్. ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషుల బృందంతో అఫ్గాన్ ఈ విశ్వక్రీడల్లో పాల్గొంటుంది.

ఎబ్డెన్-పీర్స్ జోడీకి స్వర్ణం

పారిస్ ఒలింపిక్స్ పురుషుల టెన్నిస్ డబుల్స్‌లో మాథ్యూ ఎబ్డెన్-జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) జోడీ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో ఎబ్డెన్-పీర్స్ ద్వయం 6-7 (6/8), 7-6 (7/1), 10-8తో ఆస్టిన్ క్రాయిసెక్-రాజీవ్ రామ్ (అమెరికా) జంటపై విజయం సాధించింది. 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో టాడ్ వుడ్‌బ్రిడ్జ్-మార్క్ వుడ్‌ఫర్డ్ తర్వాత ఆస్ట్రేలియాకు పురుషుల డబుల్స్‌లో మళ్లీ పసిడి పతకం లభించింది.

ఒలింపిక్స్‌లో ఈత పోటీలు అనగానే.. ఠక్కున గుర్తొచ్చే పేరు మైకేల్ ఫెల్ప్స్! మకుటం లేని మహారాజులా స్విమ్మింగ్‌పూల్‌ను ఏలిన ఈ అమెరికా స్విమ్మర్.. విశ్వక్రీడల్లో ఏకంగా 28 పతకాలు సాధించి అదుర్స్ అనిపించుకున్నాడు. అందులో 23 స్వర్ణాలు ఉన్నాయంటే.. విశ్వ క్రీడల్లో అతడి హవా ఏ స్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు ఫ్రాన్స్ నయా స్విమ్మర్ లియాన్ మర్చండ్.. అమెరికా దిగ్గజం బాటలో దూసుకెళ్తున్నాడు. పాల్గొన్న తొలి ఒలింపిక్ క్రీడల్లోనే నాలుగు స్వర్ణాలు కైవసం చేసుకొని ఫెల్ప్స్‌కు తానే సరైన వారసుడినని అనిపించు కుంటున్నాడు. రెండు గంటల వ్యవధిలో రెండు స్వర్ణాలు సాధించి అభిమానుల దృష్టిని ఆకర్షిం చిన మర్చండ్.. 'పారిస్' క్రీడల్లో నాలుగో పసిడి చేజిక్కించుకున్నాడు. నాలుగు భిన్న రేసుల్లో అగ్రస్థానంలో నిలిచిన మర్చండ్.. ఈ నాలుగింట ఒలింపిక్ రికార్డులు బద్దలు కొట్టడం విశేషం.



కొలనులో కొత్త కెరటం

- ఫెల్ప్స్‌ను తలపిస్తున్న ఫ్రాన్స్ స్విమ్మర్ మర్చండ్
- నాలుగో ఒలింపిక్ రికార్డుతో 'పారిస్'లో నాలుగో స్వర్ణం కైవసం

ఫ్రాన్స్ యువ స్విమ్మర్ లియాన్ మర్చండ్ బరి లోకి దిగిన తొలి ఒలింపిక్స్‌లోనే నాలుగో పసిడి పత కంతో సత్తా చాటాడు. ఇప్పటికే మూడు స్వర్ణాలు నెగ్గిన మర్చండ్.. ఆదివారం పురుషుల 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే రేసులో 1 నిమిషం 54.06 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచాడు. 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 200 మీటర్ల బటర్‌ఫ్లయ్, 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లేలో పసిడి పతకాలు గెలుచుకున్న 22 ఏళ్ల మర్చండ్.. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించడమే లక్ష్యమని అంటున్నాడు. మర్చండ్ పోటీపడ్డ తొలి రేసును కుటుంబ సభ్యులతో కలిసి వీక్షించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యూయేల్ మక్రాన్.. అతడి ప్రతిభకు ముగ్ధుడయ్యారు. వారం రోజుల వ్యవధిలో కొలనులో సంచలన ఫలితాలు సాధించి రికార్డులు తిరగరాసిన మర్చండ్‌కు తాను అభిమాని అయిపోయానని వెల్లడించారు.'అభిమాన సం దోహం మధ్య పతకం గెలవడం చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి అవకాశం చాలా అరుదుగా వస్తుం ది. ప్రేక్షకులంతా లేచి నిల్చొని అభివాదం చేస్తుంటే.. ఇన్నేళ్లు పడ్డ కష్టం అంతా మరిచిపోయినట్లు అనిపి స్తుంది' అని నాలుగో పసిడి పతకం గెలిచిన అనం తరం మర్చండ్ అన్నాడు. తనను తాను సిగ్గరిగా చెప్పుకునే మర్చండ్.. తాజా క్రీడల్లో చివరగా బరి లోకి దిగిన 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే సమయంలో చాలా ప్రశాంతంగా కనిపించాడు. మూడు పతకాలు గెలిచిన గర్వం కానీ, మరో పతకం సాధించాలనే ఒత్తిడి కానీ ఏమాత్రం లేకుండా బరిలోకి దిగి బం గారు పతకం చేజిక్కించుకున్నాడు. 'నాలుగు స్వర్ణాలు గెలవడం నమ్మశక్యంగా లేదు. మొదట ఒక



పతకం గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నా.. ఆ తర్వాత వరుసగా మంచి ప్రదర్శనలు కనబర్చా. ఫలితం నాకు అనుకూలంగా వచ్చింది' అని మర్చం డ్ పేర్కొన్నాడు.

ఫ్రెంచ్ ఫెల్ప్స్...

ఈత కొలనులో సంచలనాలు నమోదు చేస్తున్న మర్చండ్‌ను అభిమానులు ముద్దుగా 'ఫ్రెంచ్ ఫెల్ప్స్' అని పిలుచుకుంటున్నారు. అయితే అది తనపై ఎలాంటి ఒత్తిడి తేవడం లేదని.. ఒకింత ఆనందంగా కూడా ఉందని మర్చండ్ పేర్కొన్నాడు. దశాబ్దకాలం పాటు ఒలింపిక్స్‌లో ఏకఛత్రాధిపత్యం కనబర్చిన ఫెల్ప్స్ నమోదు చేసిన రెండు ఒలింపిక్ రికార్డుల (400 మీటర్ల మెడ్లే, 200 మీటర్ల మెడ్లే)ను మర్చండ్ తాజాగా బద్దలు కొట్టాడు. మరోవైపు ఫెల్ప్స్ కూడా మర్చండ్ ఫీట్‌కు ఫిదా అయిపో యాడు. 200 మీటర్ల బటర్‌ఫ్లయ్, బ్రెస్ట్‌స్ట్రోక్‌లో మర్చండ్ స్వర్ణాలు గెలిచిన సందర్భంలో ఫెల్ప్స్ సంబరాలు జరుపుకున్న వీడియో వైరల్‌గా మారిం ది. 'ఫెల్ప్స్‌తో పోల్చినప్పుడు గర్వంగా ఉంటుంది. స్విమ్మింగ్ రూపురేఖలను మార్చిన ఘనత అతడిది' అని మర్చండ్ అన్నాడు. ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణాలు సాధించేందుకు ఫెల్ప్స్ ఇచ్చిన సూచనలు కూడా పనిచేశాయని వెల్లడించాడు. అయితే 'పారిస్' క్రీడల్లో మర్చండ్‌తో పోటీపడిన సహచ రులు మాత్రం.. ఫెల్ప్స్ కన్నా మర్చండ్ కఠిన ప్రత్యర్థి అని ప్రశంసించారు. మర్చండ్‌తో కలిసి 400 మీటర్లు, 200 మీటర్లు వ్యక్తిగత మెడ్లే విభాగం లో బరిలోకి దిగిన అమెరికా స్విమ్మర్ కార్సాన్ ఫాస్టర్ మాట్లాడుతూ.. 'పోటీలో పాల్గొన్న వారం దరికీ.. అత్యుత్తమ స్విమ్మర్‌తో బరిలోకి దిగిన అను భవం ఎదురైంది. పోటీ పడిన నాలుగు ఈవెం ట్లలోనూ స్వర్ణాలు గెలవడం మామూలు విషయం కాదు' అని పేర్కొన్నాడు.

–సాక్షి క్రీడా విభాగం

'టై'ని బ్రేక్ చేసేదెవరో?

నేడు భారత్, శ్రీలంక మధ్య రెండో వన్డే

- ఆధిక్యంపై టీమిండియా దృష్టి
- స్పిన్ దళంతో అసలంక బృందం
- మధ్యాహ్నం గం. 2:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



కొలంబో: వన్డే సిరీస్‌లోనూ శుభారంభం చేస్తుందను కున్న భారత్‌కు తొలి మ్యాచ్ 'టై' ఫలితం ఏమాత్రం ఊహించనిది. స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై ఆతిథ్య బౌలర్లు ఓడే మ్యాచ్‌ను సమం చేసుకున్నారు. బంతులు మిగిలున్నా... స్పిన్ ఉచ్చులో పడి ఆశిం చిన ఫలితాన్ని రాబట్టలేకపోయిన భారత్ ఇప్పుడు ఆ 'టై'ని బ్రేక్ చేసే పనిలో పడింది. ఆదివారం జరిగే రెండో వన్డేలో గెలుపే లక్ష్యంగా రోహిత్‌శర్మ బృందం బరిలోకి దిగుతోంది. పైగా ఈ వేదికపై టీమిండి యాకు మంచి రికార్డే ఉంది. ఇక్కడ 6 వన్డేల్లో గెలిచిన ఘనత భారత్‌ది! సరిగ్గా మూడేళ్ల క్రితం 2021లో చివరిసారిగా లంక చేతిలో ఓడింది. తర్వాత గత 'టై' మినహా ఆడిన ప్రతి మ్యాచ్ గెలిచింది.

మిడిలార్డర్ బాధ్యతగా ఆడితే...

తొలి వన్డేలో భారత బౌలర్లు, ఓపెనర్లు బాగానే ఆడారు. 231 లక్ష్యఛేదనలో 130/3 స్కోరు వద్ద పటిష్టంగానే ఉంది. 101 పరుగులు చేస్తే గెలిచే చోటా ఏడు వికెట్లు చేతిలో ఉన్న టీమిండియా సరిగ్గా 100 చేసింది. మిడిలార్డర్‌లో నిలకడలేమి వల్లే జట్టు చివరకు 'టై' చేసుకోవాల్సి వచ్చింది. అయితే ఒక్క మ్యాచ్‌తో వేలెత్తిచూపేలా బ్యాటింగ్ ఆర్డర్ అయితే లేదు. కాస్త ఓపిక, అదేపనిగా స్పిన్‌ను ఎదుర్కొనే సహనం కనబరిస్తే చాలు జట్టు గాడిన పడుతుంది. కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్‌లు బ్యాట్ ఝుళిపిస్తే సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి దూసుకె ళ్లవచ్చు. స్పిన్ ట్రాక్ కావడంతో మూడో పేసర్‌కు అవకాశం ఉండకపోవచ్చు. కాబట్టి అర్ష్‌దీప్, సిరాజ్ లకు తోడుగా ముగ్గురు స్పిన్నర్లు అక్షర్, సుందర్, కుల్దీప్‌లతో బౌలింగ్ దళం బరిలోకి దిగుతుంది.

పైచేయి సాధించే పనిలో...

పొట్టి ఫార్మాట్‌లో క్లీన్‌స్వీప్ అయిన ఆతిథ్య శ్రీలంక తొలి వన్డేలో ప్రత్యర్థికి దీటుగా పోరాడింది. ఈ మ్యాచ్‌లో విజయం లభించకపోయినా... వచ్చిన కొండంత ఆత్మవిశ్వాసమే బలంగా ఇప్పుడు లంక బరిలోకి దిగుతోంది. ఓపెనర్లలో నిసాంక సూపర్‌ఫా మ్‌లో ఉండటం... స్పిన్నర్లు పట్టు బిగించడం జట్టు స్థయిర్యాన్ని పెంచింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో రెండో మ్యాచ్‌లో గెలిచి పైచేయి సాధిం చాలని అసలంక సేన భావిస్తోంది. కలిసొచ్చే పిచ్‌పై నమ్ముకున్న స్పిన్ బౌలింగ్ దళం జట్టును ఒడ్డున పడేస్తుందని జట్టు మేనేజ్‌మెంట్ అంచనాలతో ఉంది. టాపార్డర్‌లో అవిష్క, కుశాల్ మెండిస్, సమ రవిక్రమ కూడా తమవంతు పాత్ర పోషిస్తే పరుగుల రాక సులువవుతుంది. లోయర్ ఆర్డర్‌లో దునిత్ వెల లగే రూపంలో జట్టును ఆదుకునే బ్యాటర్ ఉండటం జట్టుకు అదనపు బలం. బౌలింగ్‌లో స్పిన్నర్లు హస రంగ, అసలంక, ధనంజయ రాణిస్తున్నారు. ఈ నేప థ్యంలో టి20 సిరీస్‌ల కాకుండా వన్డే సిరీస్ పోటాపోటీగా జరగడం ఖాయం.

పిచ్, వాతావరణం

ప్రేమదాస స్టేడియం స్పిన్‌కే అనుకూలం. గత మ్యాచ్‌లో పడిన 18 వికెట్లలో స్పిన్నర్ల (13) వాటానే అధికం. దీంతో బ్యాటర్లకు ఇబ్బం దులు తప్పవు. ఆదివారం చిరుజల్లు కురిసే అవకాశముంది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, కేఎల్ రాహుల్, శివమ్ దూబే, అక్షర్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్, సిరాజ్, అర్ష్‌దీప్. శ్రీలంక: అసలంక (కెప్టెన్), నిసాం క, అవిష్క ఫెర్నాండో, కుశాల్ మెండీస్, సమరవిక్రమ, లియనగే, వెలలగే, హసరంగ, ధనంజయ, షిరాజ్, అసిత ఫెర్నాండో.

నేత్ర, విష్ణు ఎదురీత

పారిస్ ఒలింపిక్స్‌లో భారత సెయిలర్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. మహిళల డిం గీ విభాగంలో 6 రేసులు ముగిసేసరికి భారత సెయిలర్ నేత్ర కుమానన్ 24వ స్థానంలో నిలిచింది. మూడు రేసులు ముగిసేసరికి 11వ ప్లేస్‌లో ఉన్న నేత్ర శనివారం ఐదు, ఆరు రేసుల్లో మెరుగైన ప్రదర్శన కనబర్చలేక పోయింది. పురుషుల ఈవెంట్‌లో విష్ణు శరవ ణన్ 23వ స్థానంలో ఉన్నాడు. 10 రేసులు ముగిసేసరికి టాప్–10లో ఉన్న సెయిలర్లు ఫైనల్‌కు అర్హత సాధించనున్నారు.

వెనుకంజలో భారత గోల్ఫర్లు

పారిస్ ఒలింపిక్స్‌లో భారత గోల్ఫర్లు ప్రభావం చూపలేకపోతున్నారు. శనివారం మూడో రౌండ్ పోటీలు ముగిసేసరికి శుభాంకర్ శర్మ 34వ స్థానంలో.. గగన్‌జీత్‌సింగ్ భుల్లర్ 48 స్థానంలో నిలిచారు. రెండు రౌండ్‌లు ముగిసేసరికి మెరుగైన స్థితిలో కనిపించిన శుభాంకర్... శనివారం పోటీల్లో తొమ్మిది స్థానాలు కోల్పోయి.. 211 పాయింట్లతో నిలిచాడు. సెర్బియా గోల్ఫర్ రహమ్ జాన్ (199) టాప్‌లో ఉన్నాడు. మొత్తం 18 హోల్స్ ఉన్న ఈ పోటీల్లో నాలుగు రౌండ్‌లు నిర్వహించనున్నారు. ఇందులో మెరుగైన షాట్లు ఆడిన తొలి ముగ్గురు గోల్ఫర్లకు పతకాలు దక్కుతాయి. ఆదివారం చివరి రౌండ్ పోటీలు జరగనున్నాయి. ఇక మహిళల వ్యక్తి గత విభాగంలో భారత్ నుంచి అదితి అశోక్, దీక్ష డాగర్ బరిలోకి దిగనున్నారు.


శుభాంకర్

సినిమా


● వెంకటేశ్

పొల్లాచ్చికి పోదాం

పొల్లాచ్చికి పోదాం అంటున్నారట హీరో వెంకటేశ్. 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' సిని మాల తర్వాత హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ చిత్రంలో ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఓ మాజీ పోలీసాఫీసర్, అతని భార్య, అతని మాజీ ప్రేయసి... ఇలా మూడు పాత్రల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందుతోంది. ఇటీవల ఈ సినిమా తొలి షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అయితే హీరో వెంకటేశ్ పాల్గొనని సన్నివేశాల చిత్రీకరణ జరిపారు. కాగా నెక్స్ట్ షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెం డో వారంలో పొల్లాచ్చిలో ప్రారంభం కానుందని తెలి సింది. ఈ షెడ్యూల్‌లో వెంకటేశ్‌తో పాటు మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ కూడా పాల్గొంటారట. ఈ చిత్రాన్ని సంక్రాంతికి రిలీజ్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది.

అంతర్జాతీయ గూఢచారి


● అడివి శేష్

అడివి శేష్ హీరోగా వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం లో రూపొందుతున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గూఢచారి 2'. టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అర్జున్ కుమార్ అలియాస్ ఏజెంట్ గోపీ 116 పాత్రలో అడివి శేష్ హీరోగా శశికిరణ్ తిక్క దర్శకత్వంలో రూపొంది, సూపర్ హిట్‌గా నిలిచిన 'గూఢచారి' (2018) సినిమాకు సీక్వెల్‌గా 'గూఢచారి 2' రూపొందుతోంది. 'గూఢచారి' సినిమా విడుదలై ఆరేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా 'గూఢచారి 2' సినిమా నుంచి ఆరు స్టన్నింగ్ మూమెంట్స్‌ను రిలీజ్ చేశారు. అడివి శేష్ మాట్లా డుతూ– ''గూఢచారి' మూవీ చాలా ప్రత్యేకమైనది. ఆరేళ్లుగా ఈ సినిమా గురించిన ప్రశంసలు వింటూనే ఉన్నాను. 'గూఢచారి 2' చిత్రం అంతర్జాతీయ స్థాయిలో ఉంటుంది. ఓ మ్యాసీవ్ విజువల్ ట్రీట్‌గా ఉంటుంది'' అన్నారు. ''40 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఈ యాక్షన్ డ్రామా సినిమా ప్రేక్షకులకు గొప్ప అనుభూ తిని ఇస్తుంది'' అన్నారు వినయ్ కుమార్. ''గూఢచారి 2' సినిమా, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకుల అంచనాలను మించి ఉంటాయి'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ''గూఢచారి'కి ఎంత బడ్జెట్ అయ్యిందో 'గూఢచారి 2' సినిమాలోని ఒక్క యాక్షన్ సీక్వెన్స్‌కు అంతే బడ్జెట్ అయింది'' అన్నారు అభిషేక్. భారతీయ ప్రధాన భాషల్లో 'గూఢచారి 2' 2025లో రిలీజ్ కానుంది.


● 'బ్రదర్' పోస్టర్

దీపావళికి బ్రదర్

దీపావళికి థియేటర్స్‌కు వస్తున్నాడు బ్రదర్. 'జయం' రవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బ్రదర్'. ఈ చిత్రంలో ప్రియాంకా మోహన్ హీరోయిన్‌గా నటించగా, భూమికా చావ్లా, రావు రమేశ్, యోగిబాబు, సతీష్ కృష్ణన్ ఇతర కీలక పాత్రల్లో నటిం చారు. ఎమ్. రాజేశ్ దర్శకత్వంలో సిద్ధార్థ్ రావిపాటి, సెంథిల్ కుమార్ ఈ సినిమాను నిర్మించారు. కాగా 'బ్రదర్' సినిమాను ఈ ఏడాది దీపావళి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీకి హారిస్ జయరాజ్ సంగీతం అందించారు.


● దేవిశ్రీ ప్రసాద్, నాగచైతన్య

మ్యూజికల్ తండేల్

'లవ్‌స్టోరీ' సినిమా తర్వాత నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో జాలరి రాజు పాత్రలో నాగచైతన్య కనిపిస్తారు. నాగచైతన్య, సాయిపల్లవిలు డీ–గ్లామరస్ రోల్స్‌లో కనిపిస్తారు. వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. కాగా ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ నెల 2న దేవిశ్రీ ప్రసాద్ బర్త్ డే. ఈ సందర్భంగా 'తండేల్' యూనిట్ ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. ''తండేల్' సినిమా కోసం చార్ట్ బస్టర్ అల్బమ్ కంపోజర్ చేశారు మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్. నేపథ్య సంగీతం కూడా నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


● మీనాక్షి, విజయ్

చూపే ఒక స్పార్క్యూ...

'జిగి జింతాకు చూపే ఒక స్పార్క్యూ... ఆ నాజూకు నడకే ఓ క్యాట్వాక్యూ...' అంటూ మొదలవుతుంది 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) సినిమాలోని 'స్పార్క్' సాంగ్. తమిళ హీరో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న తాజా చిత్రం ఇది. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబరులో విడుదల కానుంది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ తెలుగు వెర్షన్‌ను రిలీజ్ చేయనుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'స్పార్క్' సాంగ్ లిరికల్ వీడియోను విడుదల చేశారు. ''అయ్యయ్యో... మనసులోకి నన్ను లాగే మందు పెట్టావే... కలల్లో రోజూ వచ్చి రెచ్చగొట్టావే...' అంటూ 'స్పార్క్' పాట తెలుగు వెర్షన్‌కు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, వృషబాలుతో కలిసి ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ యువన్ శంకర్‌రాజా ఆలపిం చారు.



తెరపైకి బ్రిట్నీ జీవితం

ప్రముఖ అమెరికన్ పాప్ స్టార్ బ్రిట్నీ స్పియర్స్ జీవితం వెండితెరపైకి రానుంది. తన జీవితం ఆధారంగా బ్రిట్నీ స్పియర్స్ 'ది ఉమెన్ ఇన్ మీ' (మెమొయిర్) అనే పుస్తకం రాశారు. ఇం దులో బ్రిట్నీ ప్రేమ విశేషాలు, చేదు అనుభవాలు, కుటుంబ విశే షాలు.. ఇలా చాలా అంశాలు ఉన్నాయట. ఇరవైఆరు భాషల్లో రిలీజ్ అయిన ఈ పుస్తకానికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ దక్కింది. అంతేకాదు.. ఈ పుస్తకం ఆడియో వెర్షన్‌కు ప్రముఖ హాలీవుడ్ నటి మిచెల్ విలియమ్స్ వాయిస్ ఇచ్చారు. ఈ బుక్ హక్కు లను యూనివర్సల్ పిక్చర్స్ దక్కించుకుంది. దీంతో బ్రిట్నీ బయోపిక్ ప్రస్తుతం హాలీ వుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారిం ది. దర్శకుడు జోన్ ఎమ్ చు ఈ బయోపిక్‌ను తెరకెక్కించనున్నా రని, మార్క్ ప్లాట్ నిర్మించనున్నారని టాక్. ఇక 'నా ఫేవరెట్ మూవీస్ తీసిన మార్క్ ప్లాట్‌తో ఓ సీక్రెట్ ప్రాజెక్ట్ చేస్తున్నా నని నా ఫ్యాన్స్‌కు చెప్పడానికి హ్యాపీగా ఉంది' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు బ్రిట్నీ.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే చిత్రాలు చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం 'సావి' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ఫ్రెంచ్ సావిత్రి కథ



ఓ సినిమా కథ బావుంటే ఆ కథకి ఏ భాషా హద్దు కాదు. అలాగే ఏ దేశమూ సరిహద్దు కాదు. దానికి సరైన ఉదాహరణ 'సావి' సినిమా. 'సావి' గురించి చెప్పుకోవాలంటే ఈ సిని మాకి మూలం తెలుసుకోవడం చాలా అవసరం. 2008లో ఫ్రెంచ్ దర్శకుడు ఫ్రెడ్ కవాయే 'ఎనీథింగ్ ఫర్ హర్' అనే సినిమా నిర్మించారు. ఆ సినిమాను 8 మిలియన్ డాలర్లు పెట్టి తీస్తే, ఆరు మిలియన్ డాలర్ల రాబడితో సరిపెట్టుకుంది. అదే మూల కథతో సరిగ్గా రెండేళ్ళ తరువాత... అంటే 2010లో రస్సెల్ క్రోవ్ వంటి సీనియర్ నటుడుతో హాలీవుడ్ దర్శకుడు పాల్ హాగిస్ 'ది నెక్స్ట్ త్రీ డేస్' అనే సినిమా నిర్మిం చారు. ఈ సినిమాను 30 మిలియన్ డాలర్లు పెట్టి తీస్తే దాదాపు 67 మిలియన్ డాలర్లు సాధించి, బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ కథ ఫ్రెంచ్‌లో ప్రారంభమై హాలీవుడ్ చుట్టి 14 ఏళ్ళ తరువాత బాలీవుడ్‌కి 'సావి'గా అడుగుపెట్టింది. అంతలా ఈ కథలో ఏముందో చూద్దాం. అందమైన ఓ చిన్న కుటుంబం. భార్య, భర్త, ఓ చిన్న పిల్లాడు. వీరే కథకు పాత్రధారులు. అనుకోని ఓ ఘటన వల్ల ఒక హత్య కేసులో ఇరుక్కుని జీవిత ఖైదీగా శిక్ష పడుతుంది భార్యకు. దేశం కాని దేశంలో తన బిడ్డకు తల్లిని దూరం చేయలేక ఆ భర్త శిక్ష అను భవిస్తున్న తన భార్యను జైలు నుండి తప్పించి కుటుంబమంతా ఎలా వేరే దేశం చేరుకుంటారు అనేదే కథ. 'సావి'లో పెద్ద మార్పేంటంటే భార్య బదులు భర్తను ఖైదీగా మార్చారు. పైగా ఇండియా సెంటిమెంట్ ప్రకారం సావి అంటే సావిత్రి అని దర్శకుడు అభినయ్ డియో సినిమా ఆఖర్లో చెప్పి స్తాడు. సినిమా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. అనిల్ కపూర్ ప్రత్యేక పాత్రలో నటించిన ఈ సినిమాలో దివ్య ఖోస్లా టైటిల్ రోల్ చేశారు. థ్రిల్లింగ్ జోనర్ ఇష్టపడే వాళ్ళకు 'సావి' మంచి ఛాయిస్. ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతోంది.

– ఇంటూరు హరికృష్ణ

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



రజక/M.Tech / C.Govt. మేనేజర్ / కెనరా బ్యాంక్/18 Lakhs.P.A/5'10" ఎత్తు/30 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-15781]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు/28/ 5'9"/B.Tech/Govt. సెక్షన్ ఇంజనీర్/ రైల్వే/90,000/-PM/ అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-15781]

క్రిస్టియన్ మాల/B.Tech, NIT/C.Govt. Asst. మేనేజర్ /SBI / 70,000/-PM/6' ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-15780]

బెస్త, గంగపుత్ర/కట్నం ప్రసక్తి లేదు/M.Tech (Civil) Govt. Asst. ఇంజనీర్ / ట్రాన్స్‌కో/16 Lakhs. P.A/6'ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. 9966760501 [HA-15780]

రజక/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/Govt. బ్యాంక్ మేనేజర్/SBI/80,000/-PM/ 5'10" ఎత్తు /29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-15780]

SC హిందూ మాదిగ/ M.Tech/ Govt. Sr. Asst./ రెవెన్యూ Dept/ 60,000/-PM/ 5'11"ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-15780]

SC మాదిగ/B.Tech/C.Govt. మేనేజర్ / కెనరా బ్యాంక్/80,000/-PM / 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. Ph: 6304407230, 9515755529 [HA-15782]

యాదవ/కట్నం ప్రసక్తి లేదు/B.టెక్/ C.Govt. Sr. ఇంజనీర్/రైల్వే/14 Lakhs. P.A / 5'8"ఎత్తు /28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-15782]

SC-Mala (Hindu)/2nd Marriage/ 40y / 5'10"/PG Own Visa Consultancy/ 1,60,000/-PM Wants Good Bride (Direct). Ph: 8187861989 [H-782757]

★

ముస్లిం/55Y ఆస్తులు, బాదరబందీ, చెడు అలవాట్లు లేని డ్రైవర్ వరునకు. 45Y విడో వధువు. ఏ మతమైనా అంగవైకల్యం ఉన్నా OK. డైరెక్ట్ 8886309582 (Only Hyd) [HA-15783]

డైరెక్ట్ : విశ్వబ్రాహ్మణ/48y/ 2వ పెళ్ళి/ 50K PM / డిగ్రీ / ప్రై.జాబ్/Hydలో స్వంత ఇల్లు & ప్రాపర్టీ ఉన్న వరునికి తగిన వధువు కావలెను. 9618346855 [HA-98101]

★★

59 సం॥ / తెలుగు జర్నలిస్ట్ /విడోయర్/ తిరుపతి/ ద్వితీయ వివాహమునకు తగిన వధువు కావలెను. భాదరబందీలేని వితంతువుకు ప్రాధాన్యత. ✆ 9032532295. [T-764215]

వరుడు కావలెను



రెడ్డి/విడో/AGE: 35, QLY: B.Com/Own Properties/Lands గల అందమైన వధువుకి వరుడు కావలెను/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు (ఇల్లరికం అయినా OK) Ph: 8121347478 [H-782757]

38yrs Govt ఎంప్లాయ్ 4,00,000/- (pm) వెరీ వెల్ సెటిల్డ్ కోట్ల ప్రాపర్టీ కలిగి కుల పట్టింపు లేని అందమైన వధువుకి వరుడు కావలెను. (డైవర్సీ) సంప్ర: 9032445378 [H-796662]

కమ్మ: 38yrs/ ఫెయిర్ / కులపట్టింపులేదు / Govt ఎంప్లాయ్ 90k (PM), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ 2 సొంత ఇల్లులు & బిజినెస్ కలిగిన వధువుకి వరుడు కావలెను (1st, 2nd మ్యారేజ్ & ఇల్లరికం ok) సంప్ర: 9640133485 [H-796662]

రెడ్డి: కమ్మ/విడో/56y/ 54y/ Khammamలో సొంత ప్లాట్లు / Hyd లో సొంత బిజినెస్ రెంట్స్/ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను (అర్జెంట్) (ఇల్లరికం ok) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643. [H-796662]

కుల ప్రసక్తి లేదు /విడో/55y / విజయవాడ / Hydలో Own House/ Rents/ Lands/ Well Settle/ పిల్లలు లేని ఏ బాదరబందీ లేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-782757]

2వ పెళ్లి, కుల ప్రసక్తి లేదు, 3,00,000 PM, కోట్ల ప్రాపర్టీ, బాగా స్థిరపడిన అమ్మాయికి, అందమైన వరుడు కావలెను (ఇల్లరికం పిల్లలు ఉన్న OK) 9381696641 [H-796662]

రెడ్డి/కుల పట్టింపు లేదు/26Y/5'4"/B.Tech/ పెద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చెయ్యండి. Ph: 9885463158 [HA-15781]

క్రిస్టియన్ మాల/25/ 5'4" / B.Tech / C. Govt. Asst. మేనేజర్/కెనరా బ్యాంక్ / 60,000/-PM / అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-15781]

పద్మశాలి/ఏకైక కుమార్తె / B.Tech/C. Govt. బ్యాంక్ P.O/SBI/50,000/-PM /5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-15781]

హిందూ మాల/M.Tech/C.Govt. Asst. ఇంజినీర్ / రైల్వేస్ / 60,000/-PM / 5'4" ఎత్తు /26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-15781]

యాదవ/ఏకైక కుమార్తె/M.Sc/Govt. గ్రూప్-II ఆఫీసర్/కస్టమ్స్ & GST Dept/ 62000/-PM/5'5"ఎత్తు/25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-15781]

క్రిస్టియన్ మాదిగ/B.Tech / C.Govt. సైంటిస్ట్ / DRDO/1 Lakh. PM/5'4" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. 6305007091 [HA-15781]

SC మాల/B.Tech/C.Govt.ట్యాక్స్ ఆఫీసర్ /ఇన్‌కమ్ ట్యాక్స్ Dept/60,000/-PM/5'4" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-15781]

గౌడ/1 Cr. ఆస్తి/M.SC/Govt.Jr.Asst పంచాయతీరాజ్ Dept/42000/-PM/ 5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9550572571 [HA-15781]

వడ్డెర/M.Sc/C.Govt.Jr.Asst./ పోస్టల్ Dept/ 45000/-PM / 5'5"ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-15780]

కుల పట్టింపు లేదు/55Yrs/2వ పెళ్లి/ఫ్యామిలీ పెన్షన్/55000/-PM/Own House/15 ఎకరాల వ్యవసాయ భూమి గల వధువుకు కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. ఇల్లరికం అయినా OK. Ph: 7702580013 [HA-15782]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 28, 6', Microsoft, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 11", SWE, 160 K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MS, 30, 5' 6", SWE, 200 K, 7 Crores, Green Card, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIIT), 30, 5' 8", SWE, 40 L P/A, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి MBBS, 24, 5' 4", Doctor, Hyderabad, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 7", Business Analyst, 90 K, 4 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, Residency Doctor, 27, 5' 4", USA, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 6", SWE, 2 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 34, 5' 11", SWE, 350 K, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 31, 5' 8", Analyst, 175 K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, DM, 27, 5' 11", PG Doctor, 100 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 40, 5' 8", Microsoft, 60 L P/A, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 27, 5' 3", Analyst, 12 L P/A, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 6", Developer, 110 K, 5 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 24, 5' 9", Doctor, 20 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 28, 5' 5", SWE, 130 K, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

SC మాల & క్రిస్టియన్/B.Tech, NIT/ M.Tech,IIT/C.Govt.ఆఫీసర్/HPCL/10 Lakhs. P.A / 5'4"ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-15782]

SC మాదిగ & క్రిస్టియన్/B.Tech(EEE)/ C. Govt. డిప్యూటీ మేనేజర్/SBI/75000/-PM / 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. 9676995093 [HA-15782]

రెడ్డి/2nd మ్యారేజ్ : కుల, మత, ఆస్తి పట్టింపు లేదు. డిగ్రీ Height 5'4", బిజినెస్సులు గల అందమైన వధువుకి వరుడు కావలెను. 1st, 2nd(ఇల్లరికం OK) అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. Ph: 9032596676 [HA-15782]

రెడ్డి/2nd మ్యారేజ్: (కుల/మత/ఆస్తి) ప్రసక్తి లేదు. Age:30, Degree/Own House/2 Sites/ Business /వెల్ సెటిల్డ్ గల అందమైన వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. (ఇల్లరికం OK) Ph: 9392332143 [HA-15782]

కాపు/43y/విడో / డిగ్రీ, C.Govt. పెన్షనర్, Hydలో సొంత బంగ్లా, 25Cr ప్రాపర్టీ, బాగా స్థిరపడిన వధువుకు స్థిరపడిన వరుడు కావలెను. CNB, 9573943211, 8125132949 [HA-15782]

వయసు : 35yrs / ఎత్తు 5'5"గవర్నమెంటు జాబ్, 1.5 Laks జీతం కలిగిన అందమైన అమ్మాయికి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. పిల్లలున్నా OK. Ph: 7893409985 [HA-15782]

రెడ్డి: విడో/ 55y/ 5'3"/ Govt టీచర్/ ట్యూషన్స్/సొంత ఇల్లు, ఆస్తి కుల పట్టింపు లేని వధువుకి వరుడు కావలెను. 8367233524 [H-796331]

ఆస్తి, కుల పట్టింపులేని వధువుకు వరుడు కావలెను / 60y/విడో/ 5'4"/ Govt Rtd/ 80,000/pm/ సొంత ఇల్లు ఆంధ్రాలో పొలాలు/పిల్లలు లేరు 9618513615 [H-796331]

రెడ్డి:విడో / 59y / 5'5"/ Fair / Govt(HM)/28 ఎకరాల కొబ్బరి తోట/సొంత ఇల్లు, రెంట్స్/ 3L/pm/ పిల్లలు లేని వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. 9492718486 [H-796331]

FC: విడో/60y/ Fair/Govt రిటైర్డ్/సొంత ఇల్లు/ కొద్దిగా పంటభూమి గల ఒంటరి వధువుకు కులప్రసక్తిలేని స్నేహపూర్వకమైన వరుడు కావలెను. 9391272485 [H-796331]

కాపు: 53y/విడో/ఇంటర్/సొంత ఇల్లు & బిజినెస్/ 9 ఎకరాల పొలం గల వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని వధువుకు వరుడు కావలెను. 9705499686 [H-796331]

బ్రాహ్మణ /24/5'3"/B.Sc '27/5'4"/ MBA '30/ 5'3"/B.Sc '27/5'2"/ ఇంటర్/32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్/ పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph : 7842636086 [HA-16313]

వేదికలు



కావ్య మ్యారేజ్ లింక్స్! 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ స్త్రీలకు ఫ్రీ. Ph: 7702526428 [H-782757]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర : 8555980066, 9885144375 [H-782757]

మాల మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph : 7396915712 [HA-15782]

ధ్రువ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1వ, 2వ, లేటు, విడో, డైవర్సీ వారికి తగిన సంబంధాలు చూపబడును. Age: 18-70 సం.లు. Ph: 7702955854 [HA-15785]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15784]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Sai Teja, Ph: 9032378894/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15784]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15784]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Sai Teja, Ph: 9032378894/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15784]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15784]

కుల పట్టింపు లేని అన్ని కులాల వారికి 1వ/2వ/లేట్ విడో/ విడోయర్/ పెన్షనర్స్/ ఒంటరి స్త్రీలకు మరియు పురుషులకు వ॥ 21-80 సం॥ పెళ్లి సంబంధాలు త్వరగా చూడబడును. సంప్ర: 8374802603 [H-796662]

మాల, మాదిగ, హిందూ, క్రిస్టియన్/ Govt. సాఫ్ట్‌వేర్ /గెజిటెడ్/MBBS/PG/ NRI/PVT/ బిజినెస్/1వ/2వ/లేట్/ AP/ TS/ 15 సం॥ Exp. Ph: 8790555273 [HA-32610]

Doctors, Software, NRI, Rich Persons కు Late Matches కు, అన్ని ప్రాంతాల వార్కి వ్యక్తిగత శ్రద్ధతో Fast గా సెటిల్‌మెంట్ చేయబడును. పూర్ణమ్యాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-2957]

★


Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9494809254 (Whatsapp) [HA-986]

★★

గవర్నమెంట్ ఎంప్లాయిస్, ప్రైవేట్ ఎంప్లాయిస్, డాక్టర్స్ & సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వధూవరులకు మాల హిందూ సంబంధాలు చూడబడును. ✆ 77949 11019 [R-1229035]

కొండలు పగులగొట్టి.. కోట్లు కొల్లగొట్టి..

- నిబంధనలు పాటించకుండా గ్రానైట్ తవ్వకాలు
- కాలుష్యం బారిన 40 వేల కుటుంబాలు
- సీజేకు లేఖ రాసిన కరీంనగర్‌వాసి
- సుమోటోగా స్వీకరించిన హైకోర్టు..
- రేపు విచారణ



సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో గ్రానైట్ అక్రమ తవ్వకాలపై హైకోర్టు సోమవారం విచారణ జరపనుంది. ప్రధాన న్యాయమూర్తికి కరీంనగర్ వాసి డి.అరుణ్‌కుమార్ రాసిన లేఖపై హైకోర్టు సుమోటోగా విచారణ జరిపేందుకు నిర్ణయించింది. 'కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో గ్రానైట్ క్వారీలతో పరిసర ప్రాంతాల్లో పర్యావరణం అధ్వానంగా మారింది. అక్కడి ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. విచ్చలవిడిగా, అక్రమంగా గ్రానైట్ తవ్వకాలతో పాటు అనుబంధ పరిశ్రమలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తుండటంతో పర్యావరణ కాలుష్యం అంతకంతకూ పెరిగిపోతోంది. గ్రానైట్, స్టోన్ కటింగ్, పాలిషింగ్ యూనిట్లతో గాలి మాత్రమే కాకుండా నీరు, ధ్వని కాలుష్యం పెరిగిపోయింది. పరిశ్రమల నుంచి వెలువడే ధూళి కారణంగా చుట్టుపక్కల గ్రామాల్లో పచ్చదనం మాయమైంది. శ్వాస పీల్చుకోవడానికి మనుషులే కాదు.. జంతువులు సైతం ఇబ్బందిపడుతున్నాయి' అని లేఖలో పేర్కొన్నారు.

పశువులకు మేత లేదు..

'గ్రానైట్ యజమానులకు గుట్టలు బంగారు కొండల్లా మారాయి. గ్రానైట్ అక్రమ తవ్వకాలు జరపడమే కాకుండా నిబంధనలు పాటించకుండా పర్యావరణ హననానికి పాల్పడుతున్నారు. చుట్టూ పంటలు పండక, చెట్లు సరిగ్గా పెరగక, పశువులకు మేత లేక చాలా మంది ఉపాధి కోల్పోతున్నారు. గనుల్లో భారీ బ్లాస్టింగ్‌లు, కాలుష్య కారకాలకు 10కి పైగా గ్రామాలు ప్రభావితమయ్యాయి. సుమారు 40 వేల మంది జీవితాలు ప్రమాదకరంగా మారాయి. దీనిపై వెంటనే చర్యలు చేపట్టేలా అధికారులను ఆదేశించాలి' అని పిటిషనర్ కోరారు. విచారణకు స్వీకరించిన హైకోర్టు.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గనులు, పరిశ్రమలు, వాణిజ్య, పర్యావరణ, అటవీ శాఖల ముఖ్య కార్యదర్శులతో పాటు కాలుష్య నియంత్రణ మండలి సభ్యకార్యదర్శి, జిల్లా కలెక్టర్, తదితరులను ప్రతివాదులుగా చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ పిటిషన్‌పై రేపు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

అక్రమంగా రోజుకు రూ.30 లక్షల ఇసుక తవ్వకం

- కామారెడ్డి జిల్లా బిచ్కుందలో ఇసుక మాఫియా అరాచకం
- హైకోర్టు సీజేకు ఓ న్యాయవాది లేఖ.. సుమోటోగా విచారణకు స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలపై హైకోర్టు సోమవారం విచారణ చేపట్టనుంది. న్యాయవాది ఎ.ప్రకాశ్ రాసిన లేఖను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి.. సుమోటో పిల్‌గా స్వీకరించి విచారణ చేపట్టాలని నిర్ణయించారు. 'కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం ఖద్గం-శెట్లూరు శివారులో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పోలీసు, ఆర్డీవో, రెవెన్యూ, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మైనింగ్ అధికారులంతా కుమ్మక్కై అక్రమాలకు సహకరిస్తున్నారు. అక్రమ మైనింగ్ వల్ల ప్రభుత్వ ఖజానాకు రోజుకు దాదాపు రూ. 30 లక్షల దాకా నష్టం వాటిల్లుతోంది. అక్రమంగా తవ్విన ఇసుకను మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు తరలించి విక్రయిస్తున్నారు. ఇసుక లారీలను అడ్డగించిన కొందరు పోలీసులపై మాఫియా తమ ప్రైవేట్ సెక్యూరిటీతో దాడులకు పాల్పడుతోంది' అని లేఖలో న్యాయవాది ప్రకాశ్ పేర్కొన్నారు.

అనుమతి పూర్తయినా ఆగని తవ్వకాలు..

'బిచ్కుంద మండలం ఖద్గం-శెట్లూరు శివారులోని ఆరు క్వారీల్లో ఇసుక తవ్వకాలు జరిపేందుకు గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన అనుమతి చాలా కాలం క్రితమే ముగిసింది. అర్ధరాత్రి హడావుడిగా జేసీబీలు, టిప్పర్లు పెట్టి ఇసుక తరలిస్తున్నారు. భారీ సంఖ్యలో టిప్పర్లు తిరుగుతుండటం రోడ్డు ప్రమాదాలకు దారిస్తోంది. కొన్ని సందర్భాల్లో స్థానికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. దాదాపు 30 లక్షల క్యూబిక్ మీటర్లపైనే మైనింగ్ జరిగినా మైనింగ్ అధికారులు మాత్రం ఇసుక మాఫియాతో కుమ్మక్కై 18 లక్షల క్యూబిక్ మీటర్ల మేరకే ఇసుక తవ్వినట్లు తప్పుడు రికార్డులు చేశారు. ఈ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆయకట్టు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలి' అని న్యాయవాది ప్రకాశ్ కోరారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. గనులు, భూగర్భ, రెవెన్యూ, రవాణా, హోం శాఖల ముఖ్య కార్యదర్శులు, జిల్లా కలెక్టర్, రాష్ట్ర మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తహసీల్దార్ తదితరులను ప్రతివాదులుగా చేర్చింది. ఈ పిటిషన్‌పై సోమవారం సీజే ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

ఊహల ఆధారంగా శిక్షలు సరికాదు

- ఓ హత్య కేసులో ట్రయల్ కోర్టు విధించిన జీవితఖైదును రద్దు చేస్తూ హైకోర్టు వ్యాఖ్య
- నిందితుడిపై ఇతర అభియోగాలు లేకుంటే వెంటనే విడుదల చేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సాక్ష్యాలన్నీ పక్కాగా ఉంటేనే దిగువ కోర్టులు శిక్షలు ఖరారు చేయాలని..ఊహలతో శిక్షల విధింపు సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. నిందితుడు నేరం చేశాడా లేదా అనే విషయంలో సందిగ్ధత ఉండరాదని.. సాక్ష్యాలన్నీ నిందితుడికి వ్యతిరేకంగా ఉంటేనే నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. గతంలో శరద్ బిర్ధిచంద్ సర్దా వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు చెప్పిన మార్గదర్శక సూత్రాలను ట్రయల్ కోర్టులు పాటించాలని సూచించింది. ఓ హత్య కేసులో నిందితుడిని ఊహల ఆధారంగా దోషిగా తేలుస్తూ ట్రయల్ కోర్టు విధించిన జీవితఖైదును రద్దు చేసింది. ఈ మేరకు జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. దీనిపై అతను దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతించింది.

ఏం జరిగిందంటే..

మెదక్ జిల్లా పెద్దగుండెల్లికి చెందిన పోచయ్య అనే వ్యక్తి 2013లో తన తల్లి (80)ని హత్య చేశాడన్న ఆరోపణలపై అరెస్టు చేశారు. సిద్దిపేట జిల్లా కోర్టు.. నేరం నిరూపణ అయిందంటూ 2015లో పోచయ్యకు జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ పోచయ్య హైకోర్టులో క్రిమినల్ అప్పీల్ దాఖలు చేశారు.

వైద్యుడి సాక్ష్యం కూడా సరిగ్గా లేదు..

'పోచయ్య తన తల్లిని టవల్‌తో గొంతు నులిమి చంపి, ఆపై మృతదేహాన్ని తీసుకెళ్లి సీతాఫలం చెట్టుకు ఒక గుడ్డతో వేలాడదీశాడు. హత్య చేసిన సాక్ష్యం మాయం చేయడంతోపాటు ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. అరెస్టు చేశాక నేరం అంగీకరించాడు' అంటూ ప్రాసిక్యూషన్ పేర్కొంది. అయితే పోచయ్య అప్పీల్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'పోలీసులు పేర్కొన్నట్లు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ప్రాసిక్యూషన్ విట్‌నెస్-1(పీడబ్ల్యూ-1) చెప్పారు. సాక్షులు కూడా ప్రాసిక్యూషన్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చారు. మృతురాలిది హత్యా.. ఆత్మహత్యా అనేది చెప్పలేనని వైద్యుడు పేర్కొన్నారు. ఘటనకు ప్రత్యక్ష సాక్షులు కూడా లేరు. కేవలం సెక్షన్ 161 కింద ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ట్రయల్ కోర్టు నిందితుడికి శిక్ష ఖరారు చేసింది. చట్టపరమైన, ఆమోదయోగ్య మైన సాక్ష్యాలు లేనప్పుడు, ఊహల ఆధారంగా న్యాయస్థానాలు సొంత అభిప్రాయాన్ని ఏర్పరచుకోలేవు. గతంలో ఓ తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు ఈ విషయంలో చేసిన మార్గదర్శకాలను ఇక్కడ గుర్తుంచుకోవాలి. ఈ నేపథ్యంలో అప్పీల్‌దారుకు విధించిన శిక్షను కొట్టివేయడం తప్ప మరో మార్గం లేదు. ఇతర కేసులు లేకుంటే అతన్ని వెంటనే విడుదల చేయండి' అని తీర్పులో పేర్కొంది.

వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా రిజ్వీ

- ఎస్సీల అభివృద్ధి శాఖ కమిషనర్‌గా శ్రీదేవి
- పలువురు అధికారులకు బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి.. ఎస్సీల అభివృద్ధి శాఖ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా.. ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీకే ప్రభుత్వం అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు రాష్ట్రంలో పలువురు ఐఏఎస్, నాన్‌కేడర్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రవాణా, గృహ నిర్మాణం, సాధారణ పరిపాలన (కేంద్రంతో సమన్వయం, స్మార్ట్ గవర్నెన్స్) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్‌రాజ్‌ను నియమిస్తూ ఇటీవల జారీ చేసిన ఆదేశాలను ప్రభుత్వం స్వల్పంగా మార్చింది. ఆయన్ను రవాణా, ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది.

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
వికాస్‌రాజ్	రవాణా, గృహ నిర్మాణం, సాధారణ పరిపాలన శాఖ (కేంద్రంతో సమన్వయం, స్మార్ట్ గవర్నెన్స్)ల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి	రవాణా, ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
టీకే శ్రీదేవి	వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్	ఎస్సీల అభివృద్ధి శాఖ కమిషనర్
ఎస్.హర్ష	రవాణా, ఆర్‌అండ్‌బీ సంయుక్త కార్యదర్శి	రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ సంయుక్త కార్యదర్శి
చెక్క ప్రియాంక	అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), సూర్యాపేట	పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి రవాణా, ఆర్‌అండ్‌బీ సంయుక్త కార్యదర్శి(అదనపు బాధ్యతలు)
కె.చంద్రశేఖర్ రెడ్డి (నాన్ కేడర్)	సహకార శాఖ జాయింట్ రిజిస్ట్రార్	మేనేజింగ్ డైరెక్టర్, హాకా
శ్రీనివాస్ రెడ్డి (నాన్ కేడర్)	జాయింట్ కమిషనర్, వాణిజ్య పన్నుల శాఖ, వరంగల్	మేనేజింగ్ డైరెక్టర్, మార్క్‌ఫెడ్
అధికారి	**ప్రస్తుత బాధ్యతలు**	**అదనపు బాధ్యతలు**
ఎస్ఏఎం రిజ్వీ	వాణిజ్య పన్నులు, ఆబ్కారీ శాఖ ముఖ్యకార్యదర్శి	వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్
పి.ఉదయ్‌కుమార్	వ్యవసాయ, సహకార శాఖ సంయుక్త కార్యదర్శి	మార్కెటింగ్ శాఖ డైరెక్టర్

తనికెళ్లకు గౌరవ డాక్టరేట్ ప్రదానం



హసన్‌పర్తి: సినీ నటుడు తనికెళ్ల భరణికి హనుమకొండలోని ఎస్సార్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు శనివారం ఎస్సార్ యూనివర్సిటీలో జరిగిన గ్రాడ్యుయేట్స్ డే కార్యక్రమంలో తనికెళ్ల భరణి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. డాక్టరేట్‌ను తన భార్య భవానీకి అంకితం చేస్తున్నట్లు తనికెళ్ల భరణి ప్రకటించారు. కార్యక్రమంలో సైయంట్ ఫౌండర్ అండ్ చైర్మన్ బీవీ మోహన్‌రెడ్డి, ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా వెల్లూర్ స్నాతకోత్సవం

సాక్షి, హైదరాబాద్: వెల్లూర్‌లోని వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) 39వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరమ్ చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుద్ధి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఏ వృత్తిని ఎంచుకున్నా ఆ రంగంలో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అయితే ఉద్యోగానికి తగ్గట్టుగా బహుళ నైపుణ్యాలను వృద్ధి చేసుకోవడమే ముఖ్య మన్నారు. అసోచామ్ కర్ణాటక రాష్ట్ర అభివృద్ధి మండలి చైర్మన్, టయోటా ఇండస్ట్రీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ సలహాదారు టీఆర్ పరశురామన్, విట్ వ్యవస్థాపక చాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా 8,205 మంది అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, 375 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేశారు. అదేవిధంగా 65 మంది ప్రతిభావంతులకు స్వర్ణ పతకాలను అందజేశారు.

బరువంటే కుదరదు బాగోగులు చూడాలి

- కొమురమ్మ కుమారులకు తహసీల్దార్ రాజ్‌కుమార్ స్పష్టీకరణ



నెక్కొండ: కుమారుల నిర్లక్ష్యంతో చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న వృద్ధురాలు కొమురమ్మ బాగోగుల బాధ్యత ఆమె కుటుంబ సభ్యులదేనని తహసీల్దార్ రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చంద్రుగొండలో కుమారుడు, కోడలు కర్కశత్వంతో.. కొమురమ్మకు 20 రోజులుగా భోజనం పెట్టకుండా చీకటిగదిలో ఉంచడం తెలిసిందే. ఆమె దీనస్థితిపై శనివారం వివిధ పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు స్పందించారు. నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి ఆదేశాల మేరకు తహసీల్దార్ రాజ్‌కుమార్ శనివారం వృద్ధురాలి కుటుంబ సభ్యులను ఫోన్‌లో విచారించారు. కొమురమ్మపై కుమారులు, కోడళ్లు కర్కశత్వం వహించడం సరికాదని హెచ్చరించారు. కుమారులు పరమేశ్వర్, కుమారస్వామిలు వెంటనే తల్లి కొమురమ్మకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. చెరో 15 రోజుల పాటు తల్లి అవసరాలు చూడాలని తేల్చిచెప్పారు. కొమురమ్మపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించగా.. ఆమె బాగోగులు చూసేందుకు వారు సమ్మతించినట్లు తహసీల్దార్ రాజ్‌కుమార్ వెల్లడించారు.




మేమూ ఫ్రెండ్‌షిప్ చేస్తామోచ్..

మానవ సమాజంలో స్నేహానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. మరి మనుషుల తరహాలోనే జంతువులు కూడా ఫ్రెండ్‌షిప్ చేస్తాయా? వాటికీ ఫ్రెండ్స్ అంటూ ఉంటాయా? అనే డౌట్ ఎప్పుడైనా వచ్చిందా? దీనిపై ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రవేత్తలు ఎన్నో పరిశోధనలు చేశారు. తమ తోటి జంతువుల్లో కొన్నింటితో అవి ఎక్కువ చనువుగా ఉంటాయని, వాటి కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉంటాయని తేల్చారు.

- డాల్ఫిన్లు తమ ఆహారాన్ని స్నేహితులతో పంచుకుంటాయి.
- ఏనుగులు తమకు బాగా దగ్గరైన ఇతర ఏనుగులను ప్రత్యేకంగా పలకరిస్తాయి.
- కోతులు, చింపాంజీల వంటివి తోటి జంతువులను తడుముతూ స్నేహాన్ని చూపిస్తాయి.
- కిల్లర్ వేల్స్, ఓర్కాలుగా పిలిచే షార్కులు తమ ఆహారాన్ని, ఎక్కడ ఆహారం దొరుకుతుందన్న విషయాన్ని తోటివాటితో పంచుకుంటాయి.
- హైనాలు కూడా వీలైనన్ని ఎక్కువ హైనాలతో స్నేహం చేయడానికి ప్రయత్నిస్తాయి. అలా తమ గుంపును పెంచుకుంటాయి.
- చింపాంజీలు అయితే.. తమ స్నేహితులు చనిపోతే, వాటి పిల్లలను తమ పిల్లలతో కలిపి సాకుతాయి.

ఒకేచోట కలిసి జీవించే పరిస్థితుల్లో..

జంతువులు కేవలం తమ జాతివాటితోనే కాకుండా.. ఇతర జాతుల జంతువులతోనూ స్నేహంగా మెలగడాన్ని మనం చాలాసార్లు గమనించి ఉంటామని యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ ఎక్సెటర్‌కు చెందిన బిహేవియరల్ ఎకాలజీ శాస్త్రవేత్త డెల్ఫిన్ డి మూర్ తెలిపారు. మనుషుల తరహాలోనే ఒక ప్రాంతంలో కలిసి జీవించాల్సిన పరిస్థితుల్లో జంతువుల మధ్య స్నేహ బంధం ఏర్పడుతుందని వివరించారు. - సాక్షి, సెంట్రల్ డెస్క్





ప్రధానితో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. రాష్ట్రపతి భవన్‌లో రెండు రోజులపాటు జరిగిన గవర్నర్ల సదస్సులో పాల్గొన్న జిష్ణుదేవ్ శనివారం సాయంత్రం ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిష్ణుదేవ్ తొలిసారి ఢిల్లీకి వచ్చారు. ఈ సందర్భంగా తాజా రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది.

3 కిలోమీటర్ల పొడవుతో లూప్ రోడ్లు.. 150 ఎకరాల్లో కూడలి

రీజినల్ రింగ్ రోడ్డులో మొత్తంగా 11 చోట్ల కూడళ్లకు డిజైన్లు ఎంపిక

చౌటుప్పల్ సంగారెడ్డిలో ఇంటర్‌చేంజ్ కూడళ్లు!


చౌటుప్పల్ వద్ద ఇలా...


సంగారెడ్డి వద్ద ఇలా...

సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగ్ రోడ్డుపై రెండు ప్రాంతాల్లో భారీ ఇంటర్ చేంజ్ కూడళ్లను నిర్మించబోతున్నారు. హైదరాబాద్–పుణె జాతీయ రహదారిని క్రాస్ చేసే సంగారెడ్డి సమీపంలోని గిర్మాపూర్ వద్ద.. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని క్రాస్ చేసే చౌటుప్పల్ వద్ద ఈ కూడళ్లు ఉంటాయి. వీటికోసం ఢిల్లీ ఔటర్ రింగురోడ్డుపై నిర్మించిన 'ఎక్స్‌టెండెడ్ డంబెల్'డిజైన్‌ను ఎంపిక చేశారు. ఎనిమిది వరసల (తొలి దశలో నాలుగు వరసలు)తో రీజనల్ రింగు రోడ్డును నిర్మిస్తున్న నేపథ్యంలో ఇంటర్‌చేంజ్‌లను విశాలంగా రూపొందిస్తున్నారు.

ఆ డిజైనే ఎందుకు?

ఇప్పటికే ఉన్న భారీ రహదారులను ఎక్స్‌ప్రెస్‌వేలు క్రాస్ ప్రాంతాల్లో.. వాహనాలు ఆ రోడ్ల నుంచి రింగ్‌రోడ్డు మీదకు, రింగురోడ్డు నుంచి ఆ రోడ్ల మీదకు సులువుగా మారేందుకు వీలుగా ఇంటర్ చేంజ్ కూడళ్లను నిర్మిస్తారు. ఆ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న భూమి ఆధారంగా లూప్ డిజైన్లను ఎంపిక చేస్తారు. ఉత్తర–దక్షిణ భాగాలు కలిసే సంగారెడ్డి, చౌటుప్పల్ ప్రాంతాల్లో రోడ్ల పక్కనే చాలా నిర్మాణాలున్నా యి. అలాంటి చోట కూడళ్ల వద్ద భారీ లూప్‌లు నిర్మిస్తే భూసేకరణ పెద్ద సమస్యగా ఉంటుంది. ఈ క్రమంలో 'ఎక్స్‌టెండెడ్ డంబెల్'నమూనాను ఎంపిక చేశారు. ఈ డిజైన్‌లో వాహనాలు రోడ్లను మారే లూప్‌లు ఎక్కువశాతం రింగురోడ్డును అనుకునే ఉంటాయి. వీటి నిర్మాణానికి అవసరమైన భూమిలో 70% వరకు రింగురోడ్ భూమినే వినియోగిస్తారు. మిగతా 30 శాతం భూమిని సేకరిస్తే సరిపోతుంది.

ఒక్కోటి 150 ఎకరాల్లో.. 3 కిలోమీటర్ల నిడివితో..

'ఎక్స్‌టెండెడ్ డంబెల్'నమూనాలో నిర్మించే ఇంటర్ చేంజ్‌లలో.. లూప్ రోడ్లు చాలా దూరం నుంచే మొదలవుతాయి. ప్రస్తుతం రీజనల్ రోడ్డులో కూడా.. ప్రధాన కూడలికి ఇరువైపులా ఒకటిన్నర కిలోమీటర్ల దూరం చొప్పున మూడు కిలోమీటర్ల నిడివితో ఈ లూప్ రోడ్లు ఉండనున్నాయి. హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డుపై నిర్మించిన ఇంటర్ చేంజ్‌ల కంటే ఇది దాదాపు రెట్టింపు సైజు కావడం విశేషం.

మొత్తంగా పదకొండు కూడళ్లు..

రీజనల్ రింగురోడ్డుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ వేగంగా సాగుతుండటంతో.. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించింది. మరో మూడు నెలల్లో టెండర్ల ప్రక్రియ మొదలయ్యే చాన్స్ ఉంది. ఈ మేరకు అధికారులు రోడ్డు డిజైన్‌ను పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతానికి ఉత్తర భాగం (162 కిలోమీటర్లు.. సంగారెడ్డి నుంచి గజ్వేల్ మీదుగా చౌటుప్పల్ వరకు) నిర్మాణం చేపట్టనున్నారు. ఈ రోడ్డు దక్షిణభాగంతో కలిసే చోట్ల ఉండే రెండు ఇంటర్ చేంజ్‌లు సహా ఉత్తరభాగంలో మొత్తం 11 కూడళ్లు ఉంటాయి. వాటి డిజైన్లు సిద్ధమయ్యాయి.

- సంగారెడ్డి వద్ద భారీ 'ఎక్స్‌టెండెడ్ డంబెల్'డిజైన్‌తో కూడలి నిర్మిస్తారు.
- సంగారెడ్డి తర్వాత వచ్చే రెండో కూడలి 161 నంబర్ జాతీయ రహదారిని క్రాస్‌చేసే శివంపేట వద్ద ఉంది. ఇక్కడ డబుల్ డంబెల్ డిజైన్‌లో ఉంటుంది.
- మూడో కూడలి నర్సాపూర్–మెదక్ రోడ్డుపై నర్సాపూర్ వద్ద నిర్మిస్తారు. అక్కడ డంబెల్ మోడల్ ఎంపిక చేశారు.
- నాలుగో కూడలి హైదరాబాద్–నాగ్‌పూర్ రహదారిపై తూప్రాన్ వద్ద. ఇక్కడ క్లోవర్ లీఫ్ డిజైన్ ఎంపిక చేశారు.
- ఐదో కూడలి తూప్రాన్–గజ్వేల్ దారిలో మజీద్‌పల్లి వద్ద ఉంటుంది. ఇక్కడ రోటరీ డిజైన్ ఖరారు చేశారు.
- ఆరో కూడలి రాజీవ్ రహదారిపై ప్రజ్ఞాపూర్ సమీపంలో వస్తుంది. ఇక్కడ పాక్షిక క్లోవర్ లీఫ్ (మూడు లూప్‌లు మాత్రమే) డిజైన్ ఎంపిక చేశారు.
- ఏడో కూడలి జగదేవ్‌పూర్–తుర్కపల్లి మధ్య పీర్లపల్లి వద్ద ఉంటుంది. ఇక్కడ రోటరీ డిజైన్ ఎంపిక చేశారు.
- ఎనిమిదో కూడలి తుర్కపల్లి–యాదగిరిగుట్ట రోడ్డుపై తుర్కపల్లి వద్ద వస్తుంది. ఇక్కడ కూడా రోటరీ డిజైన్‌లో నిర్మిస్తారు.
- తొమ్మిదో కూడలి హైదరాబాద్–వరంగల్ హైవేపై రాయగిరి వద్ద ఉంటుంది. ఇక్కడ డబుల్ ట్రంపెట్ డిజైన్‌లో ఉంటుంది.
- పదో కూడలి భువనగిరి–వలిగొండ రోడ్డుపై వలిగొండ వద్ద వస్తుంది. ఇక్కడ రోటరీ డిజైన్ ఖరారు చేశారు.
- పదకొండో కూడలిని చౌటుప్పల్ వద్ద భారీ 'ఎక్స్‌టెండెడ్ డంబెల్'డిజైన్‌తో నిర్మిస్తారు.

రంగు అక్షరాల్లో శాసనం


తెలుగన్నడ లిపిలో వరగన్టి అన్న శాసన పదం


మధ్య రాతి యుగం నాటి కొంగ బొమ్మ

సాక్షి, హైదరాబాద్: సాధారణంగా శాసనాలు రాళ్లపై చెక్కిన అక్షరాల రూపంలో కనిపిస్తాయి.. కానీ, ప్రస్తుతం మనం రంగులతో రాస్తున్న తరహాలో కూడా శాసనాలుంటాయన్న అరుదైన విషయం వెలుగుచూసింది. గతంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే ఈ తరహా రంగు అక్షరాలు కనిపించాయి. ఇది 8 లేదా 9వ శతాబ్దానికి చెందినదిగా పరిశోధకులు భావిస్తున్నారు. రంగు రాళ్లను పొడి చేసి, దానిని చెట్ల నుంచి తీసిన నూనెలో కలిపి రంగుగా వినియోగించారని ఈ శాసనం వల్ల తెలుస్తోంది. హైదరాబాద్‌కు దగ్గరలో వర్గల్ వద్ద సరస్వతీ దేవి ఆలయం ఉన్న గుట్టపై ఈ శాసనం వెలుగుచూసింది. కొత్త తెలంగాణ చరిత్ర బృందానికి చెందిన శ్రీరామోజు హరగోపాల్, వేముగంటి మురళీకృష్ణలు దీనిని గుర్తించారు. అయితే, ఈ శాసనం లిఖించిన గుహను దేవాలయ సిబ్బంది స్టోర్ రూమ్ తరహాలో వినియోగిస్తున్నారని, ఈ నేపథ్యంలో శాసనంలోని చాలా భాగం చెదిరిపోయి, కొన్ని పదాలు మాత్రమే మిగిలిలాయని హరగోపాల్ తెలిపారు. అక్షరాలు తెలుగన్నడ లిపిలో ఉన్నాయని, వరగన్టి.. స్వస్తిశ్రీ..మల్ల, కళ్గిని. అన్న పదాలు మాత్రమే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. వర్గల్‌గా పేర్కొంటున్న ఈ ప్రాంతాన్ని వరగంటి అని కూడా పిలుస్తారు. పురాతన కాలంలోనే ఆ పేరు వినియోగంలో ఉందని ఇప్పుడు ఈ శాసనం ద్వారా తెలుస్తోందని ఆయన చెప్పారు. ఈ శాసన భాగం ఉన్న రాతిపైనే రాతి యుగంలో నాటి మానవులు గీసినదిగా భావిస్తున్న అరుదైన చిత్రాలున్నాయి. కొంగ, మనుషుల సామూహిక నృత్య భంగిమలు ఇక్కడ కనిపిస్తున్నాయి. ఇక్కడ చాలా చిత్రాలున్నా.. అవి కూడా చెదిరిపోయినట్లు హరగోపాల్ వెల్లడించారు. మిగిలిన చిత్రాలు, శాసన భాగాలనైనా పరిరక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

టుడేస్ గ్రాఫిక్

వివిధ దేశాల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవానికి అయ్యే సగటు వ్యయం

దేశం	వ్యయం
యూఎస్	6,27,986
స్విట్జర్లాండ్	4,71,743
గ్రీస్	4,04,339
ఆస్ట్రేలియా	3,68,921
చిలీ	3,56,529
యూఏఈ	2,09,496
జర్మనీ	2,04,975
స్పెయిన్	1,53,982
దక్షిణాఫ్రికా	1,50,968
భారత్	75,000

అగ్నిమాపక శాఖకు 6,254 ఫోన్ కాల్స్

ఈ ఏడాదిలో జూలై వరకు 66 మందిని కాపాడిన అధికారులు



సాక్షి, హైదరాబాద్: అగ్నిప్రమాదం అయినా, వరద ముప్పయినా, మరే విపత్తు అయినా.. సదా ప్రజల రక్షణకు సిద్ధంగా ఉంటామని అగ్నిమాపక విభాగం అధికారులు పేర్కొన్నారు. ప్రమాదాల నుంచి తమను కాపాడతారన్న నమ్మకం పెరగడంతో అగ్నిమాపక శాఖకు సమాచారం ఇస్తున్న వారు పెరుగుతున్నారని తెలిపారు. ఇటీవల అగ్నిమాపక శాఖలో ఫైర్‌మెన్ల పాసింగ్‌ఔట్ పరేడ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అగ్నిమాపక విభాగం తీసుకున్న నిర్ణయాలను, చేపట్టిన కార్యక్రమాలను అధికారులు వివరించారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి అగ్నిమాపక శాఖ కంట్రోల్ రూమ్‌కి మొత్తం 6,254 ఫోన్ కాల్స్ వచ్చినట్టు తెలిపారు. అలాగే 2023లో 8,151 కాల్స్, 2022లో 7,942 ఫైర్ కాల్స్ వచ్చినట్టు వారు వెల్లడించారు. ఈ ఏడాదిలో జూలై వరకు మొత్తం 66 మందిని ప్రమాదాల నుంచి కాపాడినట్లు తెలిపారు. అదేసమయంలో 1,023.42 కోట్ల విలువైన ఆస్తులను కాపాడగలిగారు. కాగా, అగ్నిప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ప్రమాదంలో చిక్కుకుంటే ఎలా కాపాడుకోవాలన్న అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

బండి సంజయ్ చొరవ.. కేదార్‌నాథ్‌లో తెలుగువాళ్లు క్షేమం

సాక్షి, హైదరాబాద్: ప్రకృతి విలయతాండవంతో అతలాకుతలమైన ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో చిక్కుకున్న తెలుగువాళ్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చొరవతో క్షేమంగా ఉన్నారు. కేదార్‌నాథ్ దేవాలయ సందర్శన కోసం ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి చెందిన అడప సత్యనారాయణ, మరో నలుగురు, హైదరాబాద్‌కు చెందిన మొలల వెంకటేశ్ కుటుంబంలోని ఐదుగురు వేర్వేరుగా జూలై 31న గుప్తకాశి నుంచి హెలికాప్టర్ ద్వారా కేదార్‌నాథ్‌కు వెళ్లారు. అక్కడికి వెళ్లిన తరువాత వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. కొండచరియలు విరిగిపడటం, వరదలు రావడంతో అక్కడే కాటేజీల్లో తలదాచుకున్నారు. వెంకటేశ్ భార్య, మరొక మహిళను రెండు రోజుల క్రితం రెస్క్యూ టీం గుప్తకాశికి తీసుకురాగా, 8 మంది అక్కడే ఉన్నారు. దీంతో తెలిసిన వారి ద్వారా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఫోన్ చేసి విషయం తెలియజేశారు. దీంతో సంజయ్ రుద్రప్రయాగ్ జిల్లా కలెక్టర్ సౌరభ్ గహార్వార్‌కు విషయం తెలియజేయడంతో ఆయన వెంటనే స్పందించారు. శనివారం ఉదయం వాతావరణం అనుకూలంగా ఉండటంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రెస్క్యూ టీం రాజమండ్రికి చెందిన అడప సత్యనారాయణ, సత్య వరప్రసాద్, అనంతలక్ష్మి శారద, రతన్ శేఖరి, ఫణికుమారిలను హెలికాప్టర్ ద్వారా గుప్తకాశికి తీసుకొచ్చారు. హైదరాబాద్‌కు చెందిన మొలల వెంకటేశ్, వినీత్, నిఖిల్ కేదార్‌నాథ్‌లోనే ఉన్నట్లు వెంకటేశ్ భార్య ఫోన్ ద్వారా 'సాక్షి'తో చెప్పారు. బండి సంజయ్ చొరవతో తాము క్షేమంగా ఉన్నామని అడప సత్యనారాయణ 'సాక్షి'కి తెలిపారు.

క్లుప్తంగా...

5 నెలల్లో 10,958 డౌన్‌లోడ్స్

టీ–సేఫ్ యాప్‌కు విశేషాదరణ

సాక్షి, హైదరాబాద్: ఒంటరిగా ప్రయాణించే మహిళలు, చిన్నారులు, ఇతర పౌరుల ప్రయాణాన్ని పర్యవేక్షించి.. వారు క్షేమంగా ఇంటికి చేరే వరకు పోలీసులు గమనించేలా ఏర్పాటు చేసిన టీ–సేఫ్ యాప్ సేవలకు ఆదరణ పెరిగింది. మార్చి 12న సీఎం రేవంత్‌రెడ్డి ఈ యాప్‌ను ప్రారంభించారు. ఐదు నెలల్లోనే మొత్తం 10,958 మంది టీ–సేఫ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నట్టు మహిళా భద్రత విభాగం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. జూలై 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా 17,263 ట్రిప్పుల ప్రయాణాల్లో మహిళలు ఈ యాప్ సేవలను వినియోగించుకున్నట్టు తెలిపారు. టీ–సేఫ్ యూజర్ల నుంచి ప్రశంసలు అందుతున్నాయని, ఈయాప్‌కు గూగుల్ ప్లే స్టోర్‌లో 4.8 రేటింగ్ లభించిందని మహిళా భద్రత విభాగం ఇన్‌చార్జి శిఖాగోయల్ తెలిపారు.

స్టాక్ మార్కెట్ పేరుతో భారీ సైబర్ మోసం

రూ.2.43 కోట్లు పోగొట్టుకున్న ప్రైవేట్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: నకిలీ స్టాక్ మార్కెట్ పేరిట ప్రైవేట్ ఉద్యోగికి బురిడీ వేసి భారీగా నగదు కాజేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఉద్యోగికి జూన్ 19న వాట్సాప్ ద్వారా స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. దీంతో అతడు తన వివరాలను నమోదు చేశారు. ఈ క్రమంలో అపరిచిత స్టాక్ మార్కెట్ నిర్వాహకులు ఐడీని క్రియేట్ చేసి ఇవ్వగా ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. మోసగాళ్లు పెట్టిన పెట్టుబడి, లాభాలు చూపిస్తూ వచ్చారు. మొత్తం 22 నగదు లావాదేవీ వ్యవహారాల్లో సదరు ఉద్యోగి రూ.2.43 కోట్లను పెట్టుబడిగా పెట్టాడు. అనంతరం లాభాలతో పాటు తాను పెట్టిన నగదును కూడా ఇవ్వాలని అడగడంతో అవతలి వ్యక్తి స్పందించలేదు. తాను మోసపోయినట్లు గుర్తించిన ఉద్యోగి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం పటాన్‌చెరు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

హీరా గ్రూప్ కేసులో దూకుడు పెంచిన ఈడీ

సాక్షి, హైదరాబాద్: అధిక లాభాలు ఆశజూపి రూ.కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఆరోపణలపై హీరా గ్రూప్‌పై నమోదైన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దూకుడు పెంచారు. ఇప్పటికే పలుమార్లు సోదాలు చేసి రూ.వందల కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం మరోమారు ఈడీ అధికారులు నగరంలోని బంజారాహిల్స్‌లో హీరాగ్రూపు కార్యాలయంతోపాటు ఈ మొత్తం కుంభకోణంలో కీలక సూత్రధారి నౌహీరాషేక్ ఇల్లు కార్యాలయాల్లోనూ సోదాలు చేసినట్లు సమాచారం. ఈ సోదాల్లో రూ.90 లక్షల నగదుతోపాటు వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. అధిక లాభాలు ఆశజూపి సదరు సంస్థ ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డిపాజిట్లు సేకరించి, వాటితో ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే మూడు దఫాల్లో జరిపిన సోదాల్లో ఈడీ అధికారులు దాదాపు రూ.400 కోట్లమేర విలువైన ఆస్తులను జప్తు చేసిన విషయం తెలిసిందే.

3, 4, 7 ఇవి ర్యాంకులు కావు... ఉద్యోగాలు

బహుళ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకులు


ఏడు ఉద్యోగాలు సాధించిన చింతల చెరువు గోపి


నాలుగు ఉద్యోగాలు సాధించిన నడ్డి గోపాలకృష్ణ

హుజూర్‌నగర్ రూరల్/పెద్దవూర/కల్లూరు రూరల్: నేటి పోటీ ప్రపంచంలో ఒక ప్రభుత్వ కొలువు సాధించడమే విశేషమైతే ముగ్గురు యువకులు ఏకంగా బహుళ కొలువులు సాధించి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన చింతలచెరువు గోపి ఏకంగా ఏడు ఉద్యోగాలు సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన గోపి బీటెక్ పూర్తి చేసి గతంలోనే జీహెచ్‌ఎంసీలో టెక్నికల్ అసిస్టెంట్, రైల్వేలో గ్రూప్–డిలో ఉద్యోగం సాధించాడు. ఆపై పంచాయతీ కార్యదర్శి కొలువుకు ఎంపికై ప్రస్తుతం అనంతగిరి మండలం వెంకట్రాంపురలో కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అలాగే గ్రూప్–4, పాలిటెక్నిక్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించడంతోపాటు తాజాగా ప్రకటించిన టీజీపీఎస్సీ ఫలితాల్లో పంచాయతీరాజ్ ఏఈఈగా గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఏఈ ఉద్యోగం సాధించాడు. గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించి మెయిన్స్‌కు సిద్ధమవుతున్నాడు. మరోవైపు నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని తుంగతూర్తి గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన నడ్డి గోపాలకృష్ణ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. 2018 డిసెంబర్‌లో పంచాయతీ కార్యదర్శి కొలువు సాధించి ఆ ఉద్యోగం చేస్తూనే 2019 నవంబర్‌లో రైల్వేలో గ్రూప్–డీ ఉద్యోగం పొందాడు. 2020 జనవరిలో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. తాజాగా ప్రకటించిన టీజీపీఎస్సీ ఫలితాల్లో ఏఈఈ సివిల్ ఇంజనీర్ (గెజిటెడ్) ఉద్యోగం సాధించాడు. మరోవైపు ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని పేరువంచకు చెందిన ఇనపాల గురువేశ్వరరావు ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఏఈఈ (సివిల్) ఫలితాల్లో 257వ ర్యాంకుతో ఉద్యోగం సాధించిన ఆయన.. ఏఈ పరీక్ష రాసి 253వ ర్యాంకుతో ఆ ఉద్యోగానికీ అర్హత సాధించాడు. అలాగే గ్రూప్–4లోనూ రాష్ట్ర స్థాయి 1,825 ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పాలిటెక్నిక్ లెక్చరర్ల నియామక పరీక్షలోనూ 215వ ర్యాంకుతో మెరిట్ జాబితాలో నిలిచాడు. గురువేశ్వరరావుకు ఆ ఉద్యోగం కూడా వచ్చే అవకాశముంది.

చాట్ జీపీటీదే భవిష్యత్తు

- సాంకేతికతపై పట్టు సాధించాలి
- ఇక్ఫాయ్ స్నాతకోత్సవంలో ఏఐసీటీఈ చైర్మన్ టీజీ సీతారాం



సాక్షి, హైదరాబాద్: రాబోయే రోజులన్నీ చాట్ జీపీటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానానిదే అని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి చైర్మన్ డాక్టర్ టీజీ సీతారాం అన్నారు. అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఈ సాంకేతికతపై మంచి పట్టు కలిగి ఉండాలని విద్యార్థులకు ఆయన సూచించారు. హైదరాబాద్ ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ స్నాతకోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ.. పరిశోధన, ఆవిష్కరణల రంగంలో ఏఐసీటీఈ చేస్తున్న కృషిని వివరించారు. యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ రంగరాజన్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దటంలో విద్యార్థులదే కీలకపాత్ర అన్నారు. విద్యారంగం ఎంతో అభివృద్ధి చెందుతున్నా, ఇంకా ఎక్కడో ఏదో లోటు ఉందన్నారు. నాణ్యమైన విద్య బడుగు వర్గాల వారికి చేరాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్ఫాయ్ వైస్ చాన్సలర్ ఎల్‌ఎస్ గణేశ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన 43 మంది విద్యార్థులకు పతకాలను బహూకరించారు. వివిధ కోర్సులు పూర్తి చేసిన 2,515 మందికి పట్టాలను అందజేశారు.

అక్రమంగా సౌందర్య సాధనాల తయారీ

సాక్షి, హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా సౌందర్య సాధనాలు తయారు చేస్తున్న హెల్త్‌కేర్ యూనిట్‌లో సోదాలు నిర్వహించి రూ.15.41 లక్షల విలువైన ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్టు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. శుక్ర, శనివారాల్లో ఈ సోదాలు నిర్వహించినట్లు వివరించారు. స్టాప్ ప్రొడక్షన్ ఉత్తర్వులు ఉన్నా.. రంగారెడ్డి జిల్లా ఫారూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలోని ఆరోహీ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వీటిని తయారు చేస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. సోదాల్లో 571 బాటిళ్లలో ఫేస్ సీరం, ఇతర పదార్థాలను పట్టుకున్నట్లు వెల్లడించారు.



జోరుమంటూ జోగ్..

కర్ణాటకలోని తీర జిల్లాల్లో వర్షాల కారణంగా కావేరి, ఉప నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. శివమొగ్గ జిల్లాలోని ప్రసిద్ధ జోగ్ జలపాతం హోరుమని గర్జిస్తూ కనువిందు చేస్తోంది. దీంతో దేశం నలుమూలల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. శరావతి నది ఇక్కడ వందల మీటర్ల ఎత్తు నుంచి పాయలుగా విడిపోయి దుమికే దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి. - శివమొగ్గ

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.